Q8NZM6

అధ్యాయం - 1

# ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? ప్రజాస్వామ్యం ఎందుకు?

AP SCERT

## అవలోకనం

ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? దాని యొక్క లక్షణాలు ఏవి? ఈ అధ్యాయం ప్రజాస్వామ్యం యొక్క సాధారణ నిర్వచనంపై రూపొందించబడింది. దశలవారీగా ఈ నిర్వచనంలో ఉన్న పదాల అర్థాన్ని తెలుసుకోవడానికి మనం ప్రయత్నిద్దాం. ప్రజాస్వామ్య ప్రభుత్వం యొక్క కనీస లక్షణాలను స్పష్టంగా అర్థం చేసుకోవడం ఇక్కడ లక్ష్యం. ఈ అధ్యాయాన్ని చదివిన తర్వాత మేము ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యేతర ప్రభుత్వం నుండి వేరు చేయగలగాలి. ఈ అధ్యాయం ముగింపులో మనం ఈ కనీస లక్ష్యాన్ని దాటి ప్రజాస్వామ్యం యొక్క విస్తృత భావనలను పరిచయం చేస్తాం.

ప్రజాస్వామ్యం అనేది నేడు ప్రపంచంలో అత్యంత ప్రబలమైన ప్రభుత్వ రూపం, ఇది మరిన్ని దేశాలకు విస్తరిస్తోంది. కానీ అలా ఎందుకు జరుగుతున్నది? ఇతర ప్రభుత్వ రూపాల కంటే మెరుగైనదిగా దీనిని ఏది చేస్తుంది? అనేదే ఈ అధ్యాయంలో మనం తీసుకునే రెండవ ప్రశ్న.

## 1.1 ప్రజాస్వామ్యం అంటే ఏమిటి?

మీరు ఇప్పటికే వివిధ రకాల ప్రభుత్వాల గురించి చదివి ఉన్నారు. ప్రజాస్వామ్యం పై మీకు ఉన్న అవగాహన ఆధారంగా కొన్ని ఉదాహరణలను ప్రస్తావిస్తూ

- ప్రజాస్వామ్య ప్రభుత్వాలు
- ప్రజాస్వామ్యేతర ప్రభుత్వాలు

యొక్క కొన్ని సాధారణ లక్షణాలను వ్రాయండి.

### ప్రజాస్వామ్యాన్ని ఎందుకు నిర్వచించాలి?

మనం మరింత ముందుకు వెళ్లే ముందు మొదటగా మెర్రి యొక్క అభ్యంతరాన్ని గమనించండి. ఈ విధంగా ప్రజాస్వామ్యాన్ని నిర్వచించడం ఆమె ఇష్టపడదు, కొన్ని ప్రాథమిక ప్రశ్నలను అడగాలని అనుకుంటున్నారు. ఆమె ప్రశ్నలకు వాళ్ళ ఉపాధ్యాయురాలు మటిల్డా లింగ్డో ప్రతిస్పందించారు. సహ విద్యార్థులు ఈ చర్చలో చేరడంతో:

**మెరి :** మేడమ్ నాకు ఈ ఆలోచన నచ్చలేదు. ముందుగా మేము ప్రజాస్వామ్యం గురించి సమయం వెచ్చించి, చర్చించిన తరువాత ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నాము. నా ఉద్దేశ్యంలో దానిని వేరే పద్ధతిలో చెప్పుకోకూడదా? ముందు నిర్వచనం వచ్చి ఆ తరువాత ఉదాహరణ ఉండాలి కదా?

**లింగ్డో మేడమ్ :** నేను నీ అభిప్రాయాన్ని అర్థం చేసుకోగలను కానీ దైనందిన జీవితంలో మనం ఆలోచించే విధానం ఇది కాదు. మనం కలం, వర్షం, ప్రేమ వంటి పదాలను ఉపయోగిస్తాము. ఈ పదాలను ఉపయోగించే ముందు వాటి నిర్వచనం కోసం వేచి ఉంటామా? ఒకసారి ఆలోచించండి. ఈ పదాలకు స్పష్టమైన నిర్వచనం ఉందా? ఒక పదాన్ని ఉపయోగించడం ద్వారా మాత్రమే దాని అర్థాన్ని మనం అవగాహన చేసుకోగలం.

**మెరి :** మనకు నిర్వచనాలు ఎందుకు అవసరం?

**లింగ్డో మెడమ్ :** ఒక పదాన్ని ఉపయోగించడంలో ఇబ్బంది వచ్చినప్పుడు మాత్రమే మనకు నిర్వచనం అవసరం. తుంపర, మేఘవిస్ఫోటనం నుండి వర్షాన్ని వేరుచేయాలనుకున్నప్పుడు మాత్రమే మనకు వర్షం అనే పదానికి నిర్వచనం అవసరం. ప్రజాస్వామ్య విషయంలోనూ అదే నిజం. ఎందుకంటే ప్రజలు దానిని వివిధ రకాల ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నందున, వివిధ రకాల ప్రభుత్వాలు తమను తాము ప్రజాస్వామ్యాలు అని చెప్పుకుంటున్నాయి కాబట్టి మనకి స్పష్టమైన నిర్వచనం అవసరం.

**రిబియాంగ్ :** కానీ మనం నిర్వచనంపై అంత దృష్టి సారించాల్సిన అవసరము ఉందా? మరో సందర్భంలో మీరు అబ్రహం లింకన్ గురించి ప్రస్తావిస్తూ : "ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు ఏర్పడిన ప్రభుత్వమే ప్రజాస్వామ్యం" అని చెప్పారు. మేఘాలయలో ఎల్లప్పుడూ మనల్ని మనమే పరిపాలించుకుంటున్నాము. అది అందరూ అంగీకరించినదే. మనం దానిని ఎందుకు మార్చాలి?

**లింగ్డో మేడమ్ :** దానిని మార్చాలని నేను అనడం లేదు. ఈ నిర్వచనం చాలా బాగుందని నేను కూడా భావిస్తున్నాను. కానీ మనమే దానిని గురించి ఆలోచించకుండా ఇదే చాలా మంచి నిర్వచనమని చెప్పలేము. ఇది చాలా ప్రసిద్ధి చెందింది కాబట్టి, అందరూ దానిని ఆమోదిస్తున్నారు కాబట్టి మనం దానిని అంగీకరించవలసిన అవసరం లేదు.

**యోలాండా :** మేడం నేనొక సూచన చేయనా? మనం ఏ నిర్వచనం వెతకవలసిన అవసరం లేదు. **ప్రజాస్వామ్యం అనే పదం** డెమోక్రేషియా అనే గ్రీకు పదం నుంచి వచ్చిందని ఎక్కడో చదివాను. గ్రీకు భాషలో 'డెమోస్' అంటే ప్రజలు, 'క్రేషియా' అంటే పాలన. కాబట్టి ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత పాలన. ఇది సరైన అర్థం. ఇక చర్చ అవసరం ఎక్కడుంది?

**లింగ్డో మేడమ్ :** ఈ విషయం గురించి ఆలోచించడానికి ఇది చాలా సహాయకారిగా ఉంటుంది. ఇది ఎల్లప్పుడూ పనిచేయదని నేను అంటాను. ఒక పదం దాని మూలార్థానికే పరిమితమై ఉండదు. కంప్యూటర్లు గురించి ఆలోచించండి. మొదట్లో వాటిని గణన కోసమే ఉపయోగించారు. గణన అంటే లెక్కించడం, చాలా కష్టమైన గణిత సమస్యల సాధనకు, ఇవి చాలా శక్తివంతమైన కాలిక్యులేటర్లు. కానీ ఈరోజుల్లో చాలా తక్కువ మంది గణిత సమస్యలను లెక్కించడానికి కంప్యూటర్లు ఉపయోగిస్తున్నారు. వారు దీన్ని రాయడానికి, డిజైన్ చేయడానికి, సంగీతం వినడానికి, సినిమాలు చూడడానికి ఉపయోగిస్తున్నారు. పదాలు అలాగే ఉంటాయి, కానీ వాటి అర్థం కాలంతో పాటు మారవచ్చు. ఆ సందర్భంలో ఆ పదం యొక్క మూలార్థానికే పరిమితం కావడం సరైనది కాదు.

**మెరి :** మేడమ్, మనం పదాల విస్తృత అర్థాన్ని చూడవలసిన అవసరం ఉందని మీ ఉద్దేశ్యం కదా!

**లింగ్డో మేడమ్ :** మీరు నన్ను బాగా అర్థం చేసుకున్నారు. మనం ఈ అర్థంతో ముందుకు వెళ్దాం.

### కృత్యము

మనం లింగ్డో మేడమ్ చెప్పిన విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిత్యం ఉపయోగించే కలం, వర్షం, ప్రేమ వంటి సాధారణ పదాల యొక్క సరైన నిర్వచనాన్ని రాయడానికి ప్రయత్నిద్దాం. ఉదాహరణకు పెన్నును నిర్వచించడానికి పెన్సిల్, బ్రష్, సుద్ద లేదా క్రేయాన్ నుండి స్పష్టంగా వేరుచేసే మార్గం ఏదైనా ఉందా?

- ఈ ప్రయత్నం నుండి మీరు ఏమి నేర్చుకున్నారు?
- ప్రజాస్వామ్యం యొక్క అర్థాన్ని అవగాహన చేసుకోవడానికి ఇది మనకు ఎలా ఉపకరిస్తుంది?

### ఒక సాధారణ నిర్వచనం

ప్రజాస్వామ్యాలు అని పిలవబడే ప్రభుత్వాల మధ్య సారూప్యతలు, వ్యత్యాసాలపై



నేను వేరే వివరణను విన్నాను. ప్రజాస్వామ్యం ప్రజలకు సంబంధం లేకుండా, ప్రజల నుండి దూరంగా ఉంటూ ప్రజలను కొనుగోలు చేసేది అని మనం దీనిని ఎందుకు అంగీకరించం?

AP SCERT

చర్చకు తిరిగివద్దాం. అన్ని ప్రజాస్వామ్యాలకు ఒక సాధారణ అంశం ఏమిటంటే : దీనిలో ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. ఆ విధంగా **ప్రజాస్వామ్యం అనేది పాలకులు ప్రజలచే ఎన్నుకోబడు ప్రభుత్వ రూపం** అనే ఒక సాధారణ నిర్వచనంతో మనం ప్రారంభిద్దాం.

ఇది ఒక మంచి ప్రారంభం. ఈ నిర్వచనం మనకు ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్యేతర ప్రభుత్వాల నుండి వేరుచేయడానికి అవకాశం ఇస్తుంది. మయన్మార్ సైనిక పాలకులు ప్రజలచే ఎన్నుకోబడిన వారు కాదు. సైన్యాన్ని అదుపులో ఉంచుకున్న వీరు దేశానికి పాలకులు అయ్యారు. ఈ నిర్ణయంపై ప్రజలకు ఎలాంటి పాత్ర లేదు. పినోచెట్ (చిలీ) వంటి నియంతలు ప్రజలచే ఎన్నుకోబడలేదు. ఇది రాచరికాలకు కూడా వర్తిస్తుంది. ప్రజలు వారిని పరిపాలించడానికి ఎన్నుకున్నందున సౌదీ అరేబియా రాజులు పరిపాలన చేయడంలేదు, రాజవంశంలో పుట్టినందువలననే పాలన చేస్తున్నారు.

ఈ సాధారణ నిర్వచనం సరిపోదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలపాలన అని అది గుర్తుచేస్తుంది. కానీ మనం అనాలోచితంగా ఈనిర్వచనాన్ని ఉపయోగించినట్లయితే ఎన్నికలు నిర్వహించే దాదాపు ప్రతీ ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యమని పిలువవలసి వస్తుంది. అది చాలా తప్పుదారి పట్టించేదిగా ఉంటుంది. తాను ప్రజాస్వామ్యం కానప్పటికీ ప్రజాస్వామ్య ప్రభుత్వంగా పిలవబడాలని ప్రతీ ప్రభుత్వం కోరుకుంటుందని 3వ అధ్యాయంలో మనం చదువుతాము. అందుకే ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వానికి, ప్రజాస్వామ్యంగా నటిస్తున్న ప్రభుత్వానికి మధ్యగల తేడాను మనం జాగ్రత్తగా గుర్తించాలి. ఈ నిర్వచనంలోని ప్రతి పదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవడం, ప్రజాస్వామ్య ప్రభుత్వ లక్షణాలను వివరించడం ద్వారా మనం దీన్ని చేయవచ్చు.

AP SCERT

**మీ పురోగతి పరిశీలించుకోండి**

రిబియాంగ్ ఇంటికి తిరిగి వెళ్లి ప్రజాస్వామ్యంపై మరికొన్ని ప్రసిద్ధ నిర్వచనాలను సేకరించింది. ఈసారి వాటిని చెప్పిన వారి పేర్లను లేదా రాసిన వారి పేర్లను ఆమె ప్రస్తావించలేదు. మీరు వీటిని చదివి ఈ ఆలోచనలు ఎంత మంచివో లేదా ఉపయోగకరమైనవో తెలియజేయాలని ఆమె కోరుకుంటుంది.

- ప్రతి వ్యక్తి తన భవిష్యత్‌ను తానే నిర్మించుకునే హక్కును ప్రజాస్వామ్యం ఇస్తుంది.
- నియంతల ఆదేశం ప్రకారం వారిని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యం. నీ మనసులో ఉన్నదే ఇతరుల నుండి వినాలని కోరుకుంటావు.
- న్యాయం కోసం నిలబడగల వ్యక్తి యొక్క సామర్థ్యం ప్రజాస్వామ్యానికి అవకాశం ఇస్తుంది. కాని ఆ వ్యక్తి అన్యాయం వైపు మొగ్గితే అక్కడ ప్రజాస్వామ్యం తప్పనిసరి అవుతుంది.
- ప్రజాస్వామ్యంలో మన యోగ్యతకు తగిన ప్రభుత్వాన్నే మనం ఏర్పాటు చేసుకోగలం.
- ప్రజాస్వామ్యంలోని అన్ని లోపాలను ప్రజాస్వామ్యం ద్వారానే పూరించుకోగలం.

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**

ఇరాక్‌లో అమెరికా, ఇతర విదేశీ శక్తుల సమక్షంలో ఎన్నికలు జరిగినప్పుడు ఈ వ్యంగ్య చిత్రాన్ని గీశారు. ఈ వ్యంగ్య చిత్రం ఏమి తెలియజేస్తుందని మీరు అనుకుంటున్నారు? ప్రజాస్వామ్యం అలా ఎందుకు రాయబడింది?




©Stephane Peray, Thailand, Cagle Cartoons Inc.

## 1.2 ప్రజాస్వామ్య లక్షణాలు

**ప్రజాస్వామ్యం అనేది పాలకులు ప్రజలచే ఎన్నుకోబడు ప్రభుత్వ రూపం** అనే సాధారణ నిర్వచనంతో మనం ప్రారంభించాము. ఇది అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది.

- ఈ నిర్వచనంలో **పాలకులు** ఎవరు? ఏ ప్రభుత్వమైనా ప్రజాస్వామ్యంగా పిలవబడాలంటే ఏ అధికారులను ఎన్నుకోవాలి? ఎన్నుకోబడని అధికారులు ప్రజాస్వామ్యంలో ఏ నిర్ణయాలు తీసుకోవచ్చు?
- ప్రజాస్వామ్య ఎన్నికలలో ఎలాంటి **ఎన్నికలు** ఉంటాయి? ఒక ఎన్నిక ప్రజాస్వామ్య బద్ధమైందిగా పరిగణించబడాలంటే ఏయే నిబంధనలను అనుసరించాలి?
- పాలకులను ఎన్నుకోగల లేదా పాలకులుగా ఎన్నికకాగల **వ్యక్తులు** ఎవరు? ఇందులో ప్రతి పౌరుడిని సమాన హోదాలో చూడాలా? ప్రజాస్వామ్యం పౌరులకు ఈ హక్కును నిరాకరించగలదా?
- చివరగా ప్రజాస్వామ్యం అనేది ఏ రకమైన **ప్రభుత్వరూపము?** ప్రజాస్వామ్యంలో ఎన్నికైన పాలకులు తమ ఇష్టానుసారం వ్యవహరించగలరా? నచ్చినట్లు చేయగలరా? లేక ప్రజాస్వామ్య ప్రభుత్వం కొన్ని పరిమితులతో పని చేయాలా? పౌరుల కొన్ని హక్కులను గౌరవించడం ప్రజాస్వామ్యానికి అవసరమా?

కొన్ని ఉదాహరణల సహాయంతో ఈ ప్రశ్నలలో ప్రతి ఒక్కదాన్ని పరిశీలిద్దాం.

### ఎన్నిక కాబడిన నాయకుల చేత ప్రధాన నిర్ణయాలు

పాకిస్థాన్‌లో పర్వేజ్ ముషారఫ్ 1999 అక్టోబర్‌లో సైనిక తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొట్టి, తనను తాను దేశానికి 'ముఖ్య పాలకునిగా' ప్రకటించుకున్నాడు. ఆ తరువాత అతను తన హోదాను అధ్యక్షునిగా మార్చుకున్నాడు. 2002లో దేశంలో **ప్రజాభిప్రాయ సేకరణ** నిర్వహించాడు. అది అతనికి ఐదు సంవత్సరముల పొడిగింపును మంజూరు చేసింది. పాకిస్తాన్ ప్రసారమాధ్యమాలు, మానవ హక్కుల సంస్థలు, ప్రజాస్వామ్య కార్యకర్తలు ప్రజాభిప్రాయ సేకరణలో అక్రమాలు, మోసం జరిగాయని ఆరోపించాయి.




©Emad Hajjaj, Jordan, Cagle Cartoons Inc. 7 June 2005

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**

సిరియా ఒక చిన్న పశ్చిమాసియా దేశం. ఆ దేశంలో పాలక బాత్ పార్టీ, దాని కొన్ని చిన్న మిత్రపక్షాలకు మాత్రమే ఎన్నికలలో పోటీకి ప్రవేశం ఉంది. ఈ వ్యంగ్య చిత్రం చైనా లేదా మెక్సికోకు వర్తిస్తుందని మీరు అనుకుంటున్నారా? ప్రజాస్వామ్యంపై ఆకుల కిరీటం దేనికి సంకేతం?

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**

ఈ వ్యంగ్య చిత్రం లాటిన్ అమెరికా నేపథ్యంలో గీయబడింది. ఇది పాకిస్తాన్ పరిస్థితికి కూడా వర్తిస్తుందని మీరు భావిస్తున్నారా? ఇది వర్తించే ఇతర దేశాల గురించి ఆలోచించండి. మన దేశంలో కూడా ఇలా కొన్నిసార్లు జరిగినదా?




©Ares, Caglecartoon.com, Cagle Cartoons Inc. 22 January 2005

అతను 2002 ఆగష్టులో సవరించబడిన పాకిస్తాన్ రాజ్యాంగం 'లీగల్ ఫ్రేమ్ వర్క్ ఆర్డర్‌ను' జారీ చేశాడు. ఈ ఉత్తర్వు ప్రకారం దేశ అధ్యక్షుడు జాతీయ, ప్రాంతీయ శాసనసభలను రద్దు చేయవచ్చు. పౌర మంత్రివర్గం యొక్క పనిని సైనిక అధికారుల నియంత్రణలో ఉన్న జాతీయ భద్రతా మండలి పర్య వేక్షిస్తుంది. ఈ చట్టాన్ని ఆమోదించిన తర్వాత జాతీయ, ప్రాంతీయ శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. తరువాత పాకిస్తాన్‌లో ఎన్నికల ద్వారా ఎన్నికైన ప్రతినిధులకు కొన్ని అధికారాలు ఇవ్వ బడ్డాయి. కానీ అంతిమ అధికారం సైనిక అధికారులు మరియు జనరల్ ముషారఫ్‌కే ఉంటుంది.

జనరల్ ముషారఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్‌ను ప్రజాస్వామ్యం అని పిలవకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయని స్పష్టమవుతుంది. అయితే వీటిలో ఒకదానిపై దృష్టి పెడదాం. పాకిస్తాన్‌లో పాలకులు ప్రజలచే ఎన్నుకోబడ్డారని మనం చెప్ప గలమా? దాదాపుగా చెప్పలేము. ప్రజలు జాతీయ, ప్రాంతీయ శాసనసభలకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకొని ఉండవచ్చు. కాని అలా ఎన్నికైన ప్రతినిధులు నిజమైన పరిపాలకులు కారు.



ఇది అంతా నాకు అగమ్యగోచరంగా ఉంది. ఈ ప్రజాస్వామ్యమంతా పాలకులు, ప్రభుత్వాల గురించేనా? మనం ఒక ప్రజాస్వామ్యయుత తరగతి గురించి లేదా ఒక ప్రజాస్వామ్యయుత కుటుంబం గురించి మాట్లాడవచ్చా?

వారు అంతిమ నిర్ణయం తీసుకోలేరు. అంతిమ అధికారం ప్రజలచే ఎన్నుకోబడని సైనిక అధికారులు, జనరల్ ముషారఫ్‌కే ఉన్నది. వారిలో ఎవరూ ప్రజలచే ఎన్నుకోబడలేదు. అనేక నియంతృత్వాలలోనూ, రాచరికాలలోనూ ఇదే జరుగుతుంది. అక్కడ ఎన్నికైన పార్లమెంటు, ప్రభుత్వము ఉంటుంది. కానీ నిజమైన అధికారం ఎన్నుకోబడని వారి వద్ద ఉంటుంది. కొన్ని దేశాలలో నిజమైన అధికారం స్థానికంగా ఎన్నికైన ప్రతినిధులకు కాకుండా కొన్ని బాహ్యశక్తుల చేతులలో ఉంటుంది. దీనిని ప్రజాపాలన అని అనలేము.

**ప్రజాస్వామ్యంలో తుది నిర్ణయం 'తీసుకునే అధికారం' ప్రజలచే ఎన్నుకోబడిన వారికే ఉండాలి.** ఇది మొదటి లక్షణం

## స్వేచ్ఛగా, న్యాయంగా జరిగే ఎన్నికల పోటీ

చైనాలో క్వాంగువో రెన్మిన్ దైబియావో దహూయ్ (నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్) అని పిలువబడే దేశ పార్లమెంటును ఎన్నుకోవడం కోసం ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు జరుగుతాయి. దేశ అధ్యక్షుడిని నియమించే అధికారం నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌కు ఉంది. దీనిలో చైనా నలుమూలల నుండి ఎన్నికైన దాదాపు 3,000 మంది సభ్యులు ఉన్నారు. కొంతమంది సభ్యులు సైన్యంచే ఎన్నుకోబడతారు. ఎన్నికల్లో పోటీ చేసే ముందు అభ్యర్థికి చైనా కమ్యూనిస్టు పార్టీ ఆమోదం అవసరం. చైనీస్ కమ్యూనిస్టు పార్టీ లేదా దానితో అనుబంధంగా ఉన్న ఎనిమిది చిన్న పార్టీలలో సభ్యులుగా ఉన్నవారు మాత్రమే 2002-03లో జరిగిన ఎన్నికలలో పోటీ చేసేందుకు అనుమతించబడ్డారు. ప్రభుత్వం ఎప్పుడూ కమ్యూనిస్టు పార్టీ ద్వారానే ఏర్పడుతుంది.

1930లో స్వాతంత్రం పొందినప్పటి నుండి మెక్సికో తన అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి ప్రతి ఆరు సంవత్సరాల తరువాత ఎన్నికలు నిర్వహిస్తుంది. దేశం ఎప్పుడూ సైనిక లేదా నియంత పాలనలో లేదు. కానీ 2000వ సంవత్సరం వరకు ప్రతి ఎన్నికలలోనూ పి.ఆర్.ఐ (ఇనిస్టిట్యూషనల్ రివల్యూషనరీ పార్టీ) గెలుపొందింది. ప్రతిపక్ష పార్టీలు

AP SCERT

ఎన్నికలలో పోటీ చేశాయి. కానీ ఎప్పుడూ విజయం సాధించలేదు. పి.ఆర్.ఐ ఎన్నికలలో గెలుపొందేందుకు అనేక చవకబారు జిమ్మిక్కులను ఉపయోగిస్తుందని ప్రతీతి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారంతా పార్టీ సమావేశాలకు హాజరు కావాల్సిందే. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పి.ఆర్.ఐ.కి ఓట్లు వేయమని తల్లిదండ్రులను బలవంతం చేసేవారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలను విమర్శించడం తప్ప వాటి కార్యకలాపాలను ప్రసార మాధ్యమాలు పెద్దగా పట్టించుకోలేదు. కొన్నిసార్లు పోలింగ్ కేంద్రాలను చివరి నిమిషంలో ఒక చోట నుండి మరొక చోటికి మార్చడం ప్రజలు ఓట్లు వేయడాన్ని కష్టతరం చేసింది. పి.ఆర్.ఐ తన అభ్యర్థుల కోసం ప్రచారంలో పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసింది.

పైన వివరించిన ఎన్నికలను ప్రజలు తమ పాలకులను ఎన్నుకునే ఉదాహరణలుగా పరిగణించాలా? ఈ ఉదాహరణలను చదివితే మనం పరిగణించలేము అనే భావన కలుగుతుంది. ఇక్కడ చాలా సమస్యలు ఉన్నాయి. చైనాలో ఎన్నికలు ప్రజలకు ఎటువంటి ఎంపికకు అవకాశం కల్పించవు. అధికార పార్టీని, అది ఆమోదించిన అభ్యర్థులను మాత్రమే ప్రజలు ఎంపిక చేసుకోవాలి. మనం దీనిని ఎంపిక అని పిలవవచ్చా? మెక్సికన్ ఉదాహరణలో వాస్తవంగా ప్రజలకు ఎంపిక ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ వాస్తవానికి వారికి ఎంపికకు అవకాశం లేదు. ప్రజలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ అధికార పార్టీని ఓడించే అవకాశమే లేదు. ఇవి న్యాయమైన ఎన్నికలు కావు.

ప్రజాస్వామ్యంపై మన అవగాహనకు మనం రెండవ లక్షణంగా జోడించవచ్చు. ఏదో ఒకరకంగా ఎన్నికల నిర్వహించడం సరిపోదు. విభిన్న రాజకీయ పార్టీల మధ్య ఎంపికకు ఎన్నికలు అవకాశం కల్పించాలి. ప్రజలు కోరుకుంటే ఈ ఎంపిక ద్వారా ప్రస్తుత పాలకులను తొలగించడానికి అవకాశం ఉండాలి. **ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు కూడా ఓడిపోవడానికి అవకాశం ఉండేలా జరిగే స్వేచ్ఛా, నిష్పక్షపాతమైన ఎన్నికలే ప్రజాస్వామ్యానికి పునాది.** ప్రజాస్వామ్య ఎన్నికల గురించి మనం 3వ అధ్యాయంలో ఎక్కువగా తెలుసుకుంటాము.




©Nerilicon, *El Economista*, Mexico, Cagle Cartoons Inc. 17 May 2005

## ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ

ప్రజాస్వామ్యం కోసం పోరాడటం సార్వత్రిక వయోజన ఓటు హక్కు డిమాండుతో ఏ విధంగా ముడిపడి ఉందో ఇంతకుముందు మనం చదివాము. ఈ సూత్రం ఇప్పుడు దాదాపు ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడింది. అయినప్పటికీ ఓటు హక్కును నిరాకరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి.

- 2015 వరకు సౌదీ అరేబియాలో మహిళలకు ఓటు హక్కు ఉండేది కాదు.
- రష్యన్ మైనారిటీకి చెందిన వ్యక్తులు ఓటు హక్కును పొందడం కష్టంగా ఉండే విధంగా ఎస్తోనియా పౌరసత్వ నియమాలు రూపొందించింది.
- ఫిజీలో భారతీయ ఫిజియన్ ఓటు కంటే స్థానిక ఫిజీ పౌరుని ఓటుకు ఎక్కువ విలువ ఉండేలా ఎన్నికల వ్యవస్థ ఉన్నది.

ప్రజాస్వామ్యం రాజకీయ సమానత్వం అనే ప్రాథమిక సూత్రంపై ఆధారపడి ఉంది. **ప్రజాస్వామ్యంలో ప్రతీ వయోజన పౌరుడికి ఒక ఓటు ఉండాలి, ప్రతీ ఓటుకు ఒకే విలువ ఉండాలి,** అనే ప్రజాస్వామ్యం యొక్క 3వ లక్షణాన్ని ఇస్తుంది. దీనిని గూర్చి మనం 3వ అధ్యాయంలో మరింత చదువుతాము.

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**

ఈ వ్యంగ్య చిత్రం 'ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం' పేరుతో ఉంది. ఇది మొదట లాటిన్ అమెరికన్ ప్రచురణలలో ప్రచురించబడింది. డబ్బు సంచులు ఇక్కడ దేనిని సూచిస్తాయి? ఈ వ్యంగ్య చిత్రాన్ని భారతదేశానికి వర్తింప చేయవచ్చా?

AP SCERT

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**

ఈ వ్యంగ్య చిత్రం సద్దాం హుస్సేన్ పాలనను తొలగించిన తరువాత జరిగిన ఇరాక్ ఎన్నికల గురించినది. అతను కటకటాల వెనుక చూపించబడ్డాడు. వ్యంగ్య చిత్రకారుడు ఇక్కడ ఏమి చెబుతున్నాడు? ఈ వ్యంగ్య చిత్ర సందేశాన్ని ఈ అధ్యాయంలోని మొదటి కార్టూన్‌తో సరిపోల్చండి.




©John Trever, *Albuquerque Journal*, US, Cagle Cartoons Inc.

## సమన్యాయ పాలన, హక్కులను గౌరవించడం

జింబాబ్వే 1980లో శ్వేత జాతి మైనారిటీ పాలన నుండి స్వాతంత్ర్యం పొందింది. అప్పటినుండి దేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన ZANU-PF పార్టీ చేత పరిపాలించబడింది. దాని నాయకుడు రాబర్ట్ ముగాబే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దేశాన్ని పాలించాడు. ఎన్నికలు క్రమం తప్పకుండా జరిగేవి, ZANU-PF పార్టీయే ఎల్లప్పుడూ గెలుపొందేది. అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే ప్రజాదరణ పొందాడు. కానీ ఎన్నికలలో అక్రమ పద్ధతులను కూడా అవలంబించాడు. సంవత్సరాలు గడిచే కొద్దీ అధ్యక్షుని అధికారాలను పెంచడానికి, అతని జవాబుదారీతనాన్ని తగ్గించడానికి అతని ప్రభుత్వం అనేకసార్లు రాజ్యాంగాన్ని మార్చింది. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను వేధించడంతోపాటు వారి సభలకు అంతరాయం కలిగించేవారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రజా నిరసనలు, ప్రదర్శనలు చట్టవిరుద్ధంగా ప్రకటించబడ్డాయి. అధ్యక్షుడిని విమర్శించే హక్కును పరిమితం చేసే చట్టం ఉండేది. టెలివిజన్, రేడియోలు ప్రభుత్వంచే నియంత్రించబడ్డాయి, అధికార పార్టీ వాదనలను మాత్రమే తెలియజేసేవి. స్వతంత్ర వార్తాపత్రికలు ఉన్నాయి. కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పత్రికా విలేఖరులను ప్రభుత్వం వేధించేది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన కొన్ని కోర్టు తీర్పులను ప్రభుత్వం పట్టించుకోలేదు, న్యాయమూర్తులపై ఒత్తిడి తెచ్చింది. అతడు 2017లో పదవి నుండి బలవంతంగా తొలగించబడ్డాడు.

ప్రజాస్వామ్యంలో పాలకులకు ప్రజామోదం అవసరం అని జింబాబ్వే ఉదాహరణ తెలియజేస్తుంది. అయితే అది సరిపోదు. జనాదరణ పొందిన ప్రభుత్వాలు ప్రజాస్వామికమైనవి కాకపోవచ్చు. జనాదరణ పొందిన నాయకులు నియంతలు కావచ్చు. మనం ప్రజాస్వామ్యాన్ని అంచనా వేయాలనుకుంటే వాటి ఎన్నికలను గమనించడం ముఖ్యం. ఎన్నికలకు ముందు ఆ తర్వాత చూడటం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ముందు రాజకీయంగా వ్యతిరేకించగలగడంతో సహా సాధారణ రాజకీయ కార్యకలాపాలకు తగినంత అవకాశం ఉండాలి. దీనికి పౌరుని యొక్క ప్రాథమిక హక్కులను రాజ్యం గౌరవించడం అవసరం. వారు ఆలోచించడానికి, అభిప్రాయాలను కలిగి ఉండడానికి, వీటిని బహిరంగంగా వ్యక్తీకరించడానికి, సంఘాలను ఏర్పాటు చేయడానికి, నిరసనలు, ఇతర రాజకీయ చర్యలు చేపట్టడానికి స్వేచ్ఛ ఉండాలి. చట్టం దృష్టిలో అందరూ సమానమే. ప్రతి ఒక్కరూ ఆమోదించి,



జింబాబ్వే గురించి ఎందుకు మాట్లాడాలి? మన దేశంలోని అనేక ప్రాంతాల నుండి ఇలాంటి నివేదికలను నేను చదివాను. మనం దాని గురించి ఎందుకు చర్చించం?

AP SCERT




©Eric Allie, *Pioneer Press*, US, Cagle Cartoons Inc., 27 February 2006

పాటించే స్వతంత్ర న్యాయవ్యవస్థ ద్వారా ఈ హక్కులు రక్షించబడాలి. ఈ హక్కులను గూర్చి 5వ అధ్యాయంలో మరింత చదువుతాము.

అలాగే ఎన్నికల తర్వాత కొన్ని విధి విధానాలకు అనుగుణంగానే ప్రభుత్వాన్ని నడపాలి. ఎన్నికలలో గెలిచినంత మాత్రాన ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం తన ఇష్టానుసారం పనిచేయలేదు. అది కొన్ని ప్రాథమిక నియమాలను పాటించాలి. ముఖ్యంగా అల్ప సంఖ్యాకులకు కల్పించబడిన కొన్ని హామీలను గౌరవించాలి. ప్రతి ప్రధాన నిర్ణయం సంప్రదింపుల పరంపర ద్వారా జరగాలి. ప్రతి ఆఫీస్ బేరర్‌కు రాజ్యాంగం, చట్టం నిర్దేశించిన కొన్ని హక్కులు మరియు బాధ్యతలు ఉంటాయి. వీరిలో ప్రతి ఒక్కరూ ప్రజలకే కాక ఇతర స్వతంత్ర అధికారులకు కూడా జవాబుదారీగా ఉంటారు. దీని గురించి మనం నాలుగవ అధ్యాయంలో మరింత చదువుతాము.

ఈ రెండు అంశాలు మనకు ప్రజాస్వామ్యం యొక్క నాలుగవ, చివరి లక్షణాన్ని అందిస్తాయి. అది: **రాజ్యాంగ చట్టము, పౌరుల హక్కులు నిర్దేశించిన పరిమితుల్లోనే ప్రజాస్వామ్య ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుంది.**

## సారాంశ నిర్వచనం

ఇప్పటివరకు జరిగిన చర్చను సమీక్షిద్దాం. **ప్రజాస్వామ్యం అనేది ప్రజలచే పాలకులు ఎన్నుకోబడే ప్రభుత్వ రూపం** అనే సాధారణ నిర్వచనంతో ప్రారంభించాము. ఇందులో ఉపయోగించిన కొన్ని ముఖ్యమైన పదాలను వివరించకపోతే ఈ నిర్వచనం సంపూర్ణం కాదని మనం గమనించాము. ప్రజాస్వామ్యం యొక్క నాలుగు లక్షణాలను మనం అనేక ఉదాహరణల ద్వారా తెలిపాము. తదనుగుణంగా ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వ రూపము. దీనిలో

- ప్రజలచే ఎన్నుకోబడిన పాలకులు అన్ని ప్రధాన నిర్ణయాలు తీసుకుంటారు;
- ఎన్నికలు ప్రస్తుత పాలకులను మార్చడానికి ప్రజలకు ఒక ఎంపికను, న్యాయమైన అవకాశాన్ని అందిస్తాయి;
- ఈ ఎంపిక, అవకాశం ప్రజలందరికీ సమాన ప్రాతిపదికన అందుబాటులో ఉంటుంది;
- ఈ ఎంపిక యొక్క కార్యాచరణ రాజ్యాంగం యొక్క ప్రాథమిక నియమాల ద్వారా, పౌరుల హక్కుల ద్వారా పరిమితం చేయబడిన ప్రభుత్వానికి దారి తీస్తుంది.

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**

'గూగుల్', 'యాహూ' వంటి ప్రసిద్ధ వెబ్‌సైట్‌ల పై పరిమితులు విధించడం ద్వారా చైనా ప్రభుత్వం ఇంటర్నెట్‌లో ఉచిత సమాచార ప్రవాహాన్ని నిరోధించింది. ట్యాంకుల, నిరాయుధ విద్యార్థి చిత్రం ఇటీవలి చైనీయుల చరిత్రలో మరొక ప్రధాన సంఘటనను పాఠకులకు గుర్తు చేస్తుంది. ఆ సంఘటనను గూర్చి తెలుసుకోండి.

AP SCERT

**మీ పురోగతి పరిశీలించుకోండి**

**ప్రజాస్వామ్యం మనుగడలో ఉందా లేదా అని తెలుసుకోవడానికి క్రింది ఐదు ఉదాహరణలను చదవండి. పైన చర్చించిన ప్రజాస్వామ్య లక్షణాల ఆధారంగా వీటిని జతపరచండి.**

| ఉదాహరణ | లక్షణం |
|---|---|
| భవిష్యత్తులో తాను ఎన్నికైన ప్రతినిధుల సలహా మేరకు తన బాధ్యతలను నిర్వహిస్తానని భూటాన్ రాజు ప్రకటించారు. | సమన్యాయం |
| భారతదేశం నుండి వలస వెళ్ళిన అనేక మంది కార్మికులకు శ్రీలంకలో ఓటు హక్కు ఇవ్వలేదు. | హక్కులకు గౌరవం |
| రాజకీయ సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలపై రాజు నిషేధం విధించాడు. | ఒక వ్యక్తి ఒక ఓటు ఒకే విలువ |
| బీహార్ అసెంబ్లీని రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని భారత సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నది. | స్వేచ్ఛాయుత ఎన్నికల పోటీ |
| ఎన్నికల సమయంలో తటస్థ ప్రభుత్వాలు పరిపాలించాలని బంగ్లాదేశ్‌లోని రాజకీయ పార్టీలు అంగీకరించాయి. | ఎన్నికైన నాయకుల ప్రధాన నిర్ణయాలు |

## 1.3 ప్రజాస్వామ్యం ఎందుకు?

మేడమ్‌లింగ్డో తరగతిలో ఒక వాదన చెలరేగింది. ప్రజాస్వామ్యం అంటే ఏమిటి, ప్రజాస్వామ్యమే ఉత్తమ ప్రభుత్వరూపమని మీరు భావిస్తున్నారా? అని తన విద్యార్థులను అడగడం ద్వారా మునుపటి సెక్షన్‌లో ఆమె తన బోధనను ముగించింది. అందరికీ ఏదో చెప్పాలనిపించింది.

### ప్రజాస్వామ్య ప్రయోజనాలపై చర్చ

**యోలాండా:** మనం ప్రజాస్వామ్య దేశంలో జీవిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారు. గతంలో ప్రజాస్వామ్యం లేని దేశాలు ఇప్పుడు ప్రజాస్వామ్యయుత దేశాలుగా మారుతున్నాయి. గొప్ప వ్యక్తులందరూ ప్రజాస్వామ్యం గురించి గొప్పగా చెప్పారు. ప్రజాస్వామ్యం అనేది ఉత్తమమైనదని స్పష్టం కాలేదా? దీని గురించి మనం చర్చించాల్సిన అవసరం ఉందా?

**టాంగ్మిని:** అది ప్రసిద్ధమైనది కాబట్టి, ప్రతిఒక్కరు ఆమోదించారు కాబట్టి మనం దానిని అంగీకరించవలసిన అవసరం లేదని లింగ్డో మేడం చెప్పారు. అందరూ తప్పుడు మార్గాన్ని అనుసరిస్తూ ఉండిఉండవచ్చు కదా?

**జెని:** అవును, వాస్తవానికి ఇది తప్పుడు మార్గమే. ప్రజాస్వామ్యం మన దేశానికి ఏమి తెచ్చింది? ఏడు దశాబ్దాల ప్రజాస్వామ్యపాలన తర్వాత కూడా దేశంలో చాలా పేదరికం ఉంది.

**రిబియాంగ్:** అయితే ప్రజాస్వామ్యానికి, దానికి సంబంధం ఏమిటి? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం కాబట్టి మనకు పేదరికం ఉందా? లేదా ప్రజాస్వామ్యంగా ఉన్నప్పటికీ మనకు పేదరికం ఉందా?



నేను లింగ్డోమేడం క్లాస్‌లో ఉండాలనుకుంటున్నాను! అది ప్రజాస్వామ్య తరగతిలా అనిపిస్తుంది. కాదా?

**జెని:** ఏది ఏమైనా అది తేడా ఎలా అవుతుంది? నా ఉద్దేశం ఏమిటంటే ఇది ఉత్తమ ప్రభుత్వ రూపం కాదు. ప్రజాస్వామ్యం మొత్తం గందరగోళం, అస్థిరత్వం, అవినీతి, కపటత్వం. రాజకీయ నాయకులు తమలో తాము పోట్లాడుకుంటారు. దేశం గురించి ఎవరు పట్టించుకుంటారు?

**పొయిమాన్:** దీనికి బదులుగా మనకు ఏమి ఉండాలి? తిరిగి బ్రిటీషు పరిపాలనకు వెళ్ళాలా? ఈ దేశాన్ని పరిపాలించమని ఏ రాజునైనా ఆహ్వానించాలా?

**రోజ్:** నాకు తెలియదు, ఈ దేశానికి కావలసినది బలమైన నాయకుడు. ఎన్నికలు, పార్లమెంటుతో అవసరం లేని వ్యక్తి. ఒక నాయకుడికి అన్ని అధికారాలు ఉండాలి. దేశ ప్రయోజనాల దృష్ట్యా అతను ఏమైనా చేయగలగాలి. అతడు మాత్రమే దేశం నుండి అవినీతిని, పేదరికాన్ని దూరం చేయగలడు.

**ఎవరో అరిచారు.** దాన్నే **నియంతృత్వం** అంటారు!

**హోయ్:** ఆ వ్యక్తి ఈ అధికారాలన్నీ తన స్వంతానికి, తన కుటుంబం కోసం వాడుకోవడం ప్రారంభిస్తే ఏమవుతుంది? అతడే లంచగొండి అయితే?

**రోజ్:** నేను నిజాయితీ, చిత్తశుద్ధి గల బలమైన నాయకుడిని గురించి మాత్రమే మాట్లాడుతున్నాను.

**హోయ్:** అయితే అది సరైంది కాదు. నీవు వాస్తవమైన ప్రజాస్వామ్యాన్ని ఊహాజనితమైన నియంతృత్వంతో పోల్చుతున్నావు. కాని మనం ఆదర్శాన్ని ఆదర్శంతో, వాస్తవాన్ని వాస్తవికతతో పోల్చాలి. వెళ్లి నిజ జీవితంలో నియంతల రికార్డులను చూడు. వారు అత్యంత అవినీతి పరులు, స్వార్థపరులు, క్రూరమైన వారు. వీళ్ళ గురించి తెలుసుకోవడానికి మనకు అది మాత్రమే చాలదు. ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే మీరు వారిని వదిలించుకోలేరు కూడా.

AP SCERT

మేడమ్ లింగ్డో ఈ చర్చను ఆసక్తితో వింటున్నారు. ఇప్పుడు ఆమె స్పందించారు : "మీరందరూ చాలా ఉద్రేకంతో వాదించుకోవడం చూసి నేను చాలా సంతోషించాను. ఎవరు ఒప్పో, ఎవరు తప్పో అనేది నాకు తెలియదు, అది మీరే తేల్చుకోండి. కానీ మీరందరూ మీ మనసులో మాట చెప్పాలను కుంటున్నారని నాకనిపిస్తుంది. ఎవరైనా మిమ్మల్ని ఆపడానికి ప్రయత్నిస్తే లేదా మీరు అనుకున్నది చెప్పినందుకు మిమ్మల్ని శిక్షిస్తే మీకు చాలా బాధగా అనిపించి ఉండవచ్చు. ప్రజాస్వామ్యం లేని దేశంలో మీరు అలా చేయగలరా? ప్రజాస్వామ్యానికి అది మంచి వాదనా?"

## ప్రజాస్వామ్యానికి వ్యతిరేక వాదనలు

ఈ సంభాషణలో మనం నిత్యం వినే ప్రజాస్వామ్యానికి వ్యతిరేక వాదనలు ఎక్కువగా ఉన్నాయి.

ఈ వాదనలలో కొన్నింటిని చదువుదాం :

- ప్రజాస్వామ్యంలో నాయకులు మారుతూనే ఉంటారు. ఇది అస్థిరతకు దారితీస్తుంది.
- ప్రజాస్వామ్యం రాజకీయ పోటీ, అధికారం కోసం జరిగే ఆట. నైతికతకు ఆస్కారం లేదు.
- ప్రజాస్వామ్యంలో చాలా మందిని సంప్రదించాలి. ఇది ఆలస్యానికి దారితీస్తుంది.
- ఎన్నికైన నాయకులకు ప్రజల శ్రేయస్సు తెలియదు. ఇది చెడు నిర్ణయాలకు దారి తీస్తుంది.
- ప్రజాస్వామ్యం అవినీతికి దారి తీస్తుంది. ఎందుకంటే అది ఎన్నికల పోటీపై ఆధారపడి ఉంటుంది.
- సామాన్యులకు ఏది మంచిదో తెలియదు. ఏ నిర్ణయాన్ని వారికి వదిలివేయరాదు.

ప్రజాస్వామ్య వ్యతిరేకంగా మీరు ఆలోచించగలిగే వాదనలు మరిన్ని ఉన్నాయా? వీటిలో ఏ వాదన ప్రధానంగా ప్రజాస్వామ్యానికి వర్తిస్తుంది? ఏ విధమైన ప్రభుత్వమైనా దుర్వినియోగం చేయడానికి వీటిలో వర్తించేవి ఏవి? వీటిలో దేనితో మీరు అంగీకరిస్తారు?

ప్రజాస్వామ్యం అన్ని సమస్యలకు ఇంద్రజాల పరిష్కారం కాదు. ఇది మన దేశంలో, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో పేదరికాన్ని అంతం చేయలేదు. ఒక తరహా ప్రభుత్వ రూపంగా ప్రజాస్వామ్యం ప్రజలు తమ నిర్ణయాలు తామే తీసుకునే విధంగా చేస్తుంది. ఇది వారి నిర్ణయాలు మంచివని హామీ ఇవ్వదు. ప్రజలు తప్పులు చేయవచ్చు. ఈ నిర్ణయాలలో ప్రజలను భాగస్వాములను చేయడం నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యానికి దారితీస్తుంది. ప్రజాస్వామ్యం నాయకత్వంలో తరచుగా మార్పులకు దారితీస్తుంద నేది కూడా నిజం. కొన్నిసార్లు ఇది పెద్ద నిర్ణయాలపై వెనక్కి తగ్గవచ్చు. ప్రభుత్వ సమర్ధతను ప్రభావితం చేయవచ్చు.

ఈ వాదనలు మనం చూసే ప్రజాస్వామ్య ప్రభుత్వం యొక్క ఆదర్శ రూపం కాకపోవచ్చు. కానీ నిజ జీవితంలో మనం ఎదుర్కొనే ప్రశ్న ఇది కాదు. మనకు ఎదురయ్యే అసలు ప్రశ్న వేరు: మనం ఎంచుకోవడానికి ఉన్న ఇతర ప్రభుత్వాల కంటే ప్రజాస్వామ్యం మెరుగైనదా?

## ప్రజాస్వామ్య అనుకూల వాదనలు

1958-1961 నాటి చైనా కరువు ప్రపంచ చరిత్రలో నమోదైన అత్యంత దారుణమైన కరువు. ఈ కరువులో దాదాపు మూడు కోట్ల మంది చనిపోయారు. ఆ రోజుల్లో భారతదేశ ఆర్థిక పరిస్థితి చైనా కంటే మెరుగ్గా ఏమీ లేదు. అయితే చైనాకి ఉన్నంత కరువు భారతదేశంలో లేదు.

ఈ వ్యంగ్య చిత్రం సుదీర్ఘ నియంతృత్వ అనుభవం ఉన్న బ్రెజిల్ దేశానికి చెందినది. దీనికి "ది హిడెన్ సైడ్ ఆఫ్ డిక్టేటర్షిప్" అని పేరు పెట్టారు. ఈ వ్యంగ్య చిత్రం నియంతృత్వపు ఏ దాచిన పార్శ్వాన్ని వివరిస్తుంది? ప్రతి నియంతృత్వానికి దాగి ఉన్న పార్శ్వం ఉంటుందా? వీలైతే, చిలీలోని పినోచెట్, పోలాండ్లోని జరుజెల్స్కి, నైజీరియాలోని సాని అబాచా మరియు ఫిలిప్పీన్స్ని ఫెర్డినాండ్ మర్కస్ తో సహా నియంతల గురించి తెలుసుకోండి.

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**




©Osmani Simanca, Brazil, Cagle Cartoons Inc. 6 December 2004

AP SCERT

రెండు దేశాల్లోని వివిధ ప్రభుత్వ విధానాల ఫలితంగా ఇది జరిగిందని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉండటం వల్ల ఆహార కొరతపై చైనా ప్రభుత్వం స్పందించని విధంగా భారత ప్రభుత్వం స్పందించేలా చేసింది. ఏ స్వతంత్ర, ప్రజాస్వామ్య దేశంలో ఇంతవరకు ఇంత పెద్ద ఎత్తున కరువు రాలేదని వారు అభిప్రాయపడుతున్నారు. చైనాలో కూడా బహుముఖ ఎన్నికలు, ప్రతిపక్ష పార్టీ, ప్రభుత్వాన్ని విమర్శించే పత్రికాస్వేచ్ఛ ఉండి ఉంటే, అప్పుడు చాలా మంది ప్రజలు కరువులో మరణించి ఉండకపోవచ్చు.

ప్రజాస్వామ్యాన్ని ఎందుకు ఉత్తమ ప్రభుత్వం రూపంగా భావిస్తారో ఈ ఉదాహరణ మనకు తెలుపుతుంది. ప్రజల అవసరాలకు ప్రతిస్పందించ డంలో ప్రజాస్వామ్యం ఇతర ప్రభుత్వ రూపాల కంటే మెరుగైనది. ప్రజాస్వామ్యేతర ప్రభుత్వం ప్రజల అవసరాలకు ప్రతిస్పందించవచ్చు, ప్రతిస్పందించక పోవచ్చు. అది పాలకుల ఇష్టా ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. పాలకులకు ఇష్టం లేకపోతే వారు ప్రజల కోరికలకు ప్రతి స్పందించరు. పాలకులు ప్రజల అవసరాలను తీర్చాలని ప్రజాస్వామ్యం చెబుతుంది. **ప్రజాస్వామ్య ప్రభుత్వం మెరుగైన ప్రభుత్వం. ఎందుకంటే ఇది మరింత జవాబుదారి ప్రభుత్వం.**

ప్రజాస్వామ్యేతర ప్రభుత్వం కంటే ప్రజాస్వామ్యం మెరుగైన నిర్ణయాలు తీసుకోగలుగుతుంది అనేది మరొక కారణం. ప్రజాస్వామ్యం సంప్రదింపులు చర్చలపై ఆధారపడి ఉంటుంది. ఒక ప్రజాస్వామ్య నిర్ణయంలో ఎల్లప్పుడూ అనేక మంది వ్యక్తులు, చర్చలు, సమావేశాలు ఉంటాయి. అనేక మంది వ్యక్తులు తమ ఆలోచనలను పంచుకున్నప్పుడు వారు ఏ నిర్ణయంలోనైనా తలెత్తే గల తప్పులను ఎత్తి చూపగలరు. దీనికి సమయం పడుతుంది. కానీ ముఖ్యమైన నిర్ణయాలకు సమయం తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఇది ఆకస్మిక లేదా బాధ్యతారహిత నిర్ణయాల అవకాశాలను తగ్గిస్తుంది. **తద్వారా ప్రజాస్వామ్యం నిర్ణయాల గుణాత్మకతను మెరుగుపరుస్తుంది.**


భారతదేశం ప్రజాస్వామ్యం కానట్లయితే ఏం జరిగి ఉండేది? ఒకే దేశంగా కలిసి ఉండేవాళ్ళమా?

**ప్రజాస్వామ్యం విభేదాలు, సంఘర్షణలను ఎదుర్కోవటానికి అవకాశాన్ని కల్పిస్తుంది** అన్నది మూడవ వాదన. ఏ సమాజంలోనైనా ప్రజలకు అభిప్రాయ భేదాలు, ఇష్టాఇష్టాలు ఉంటాయి. అద్భుతమైన సామాజిక వైవిధ్యం ఉన్న మనవంటి దేశంలో ఈ వ్యత్యాసాలు మరింత తీవ్రంగా ఉంటాయి. ప్రజలు వివిధ ప్రాంతాలకు చెందినవారు, వివిధ భాషలు మాట్లాడతారు, వివిధ మతాలను ఆచరిస్తారు, వివిధ కులాలకు చెందినవారు. వారు ప్రపంచాన్ని చాలా భిన్నంగా చూస్తారు, విభిన్న ప్రాధాన్యతలను కలిగి ఉంటారు. ఒక సమూహం యొక్క ప్రాధాన్యతలు ఇతర సమూహాలతో విభేదించవచ్చు. అటువంటి సంఘర్షణను ఎలా పరిష్కరిస్తాము. క్రూరమైన అధికారం ద్వారా ఈ సంఘర్షణను పరిష్కరించవచ్చు. అధిక శక్తివంతమైన సమూహం తన ఆదేశాలను ఇతరులు అనుసరించేలా చేస్తుంది, ఇతరులు దానిని అంగీకరించవలసి వస్తుంది. కానీ అది ఆగ్రహానికి, అసంతృప్తికి దారి తీస్తుంది. ఈ పద్ధతిలో విభిన్న సమూహాలు దీర్ఘ కాలంలో కలిసి జీవించలేవు. ప్రజాస్వామ్యమే ఈ సమస్యకు ఏకైక శాంతియుత పరిష్కారాన్ని సూచించగలదు. ప్రజా స్వామ్యంలో ఎవరూ శాశ్వత విజేతలు కారు. ఎవరూ శాశ్వత పరాజితులు కారు. వివిధ సమూహాలు ఒకరితో ఒకరు శాంతియుతంగా జీవించవచ్చు. భారత్ వంటి వైవిధ్యత దేశంలో ప్రజాస్వామ్యమే మన దేశాన్ని కలిపి ఉంచుతుంది.

ఈ మూడు వాదనలు ప్రభుత్వ, సమాజ జీవిత నాణ్యతపై ప్రజాస్వామ్య ప్రభావానికి సంబంధించినవి. అయితే ప్రజాస్వామ్యం ప్రభుత్వానికి ఏమి చేస్తుంది అనే దానికంటే పౌరులకు ఏమి చేస్తుంది అనేది ప్రజాస్వామ్యానికి అనుకూలంగా చేసే బలమైన వాదన. ప్రజాస్వామ్యం మెరుగైన నిర్ణయాలు, జవాబుదారీ ప్రభుత్వాన్ని తీసుకురాకపోయినా ఇతర ప్రభుత్వాల కంటే మెరుగైనది. **ప్రజాస్వామ్యం పౌరుల గౌరవాన్ని పెంచుతుంది.** మనం పైన చర్చించినట్లుగా ప్రజాస్వామ్యం రాజకీయ సమానత్వం అనే సూత్రంపై ఆధారపడి ఉంది.

AP SCERT

అత్యంత పేద, అత్యల్ప విద్యావంతులు, ధనవంతులు, విద్యావంతులు సమాన హోదాను కలిగి ఉంటారని ఇది గుర్తిస్తుంది. ప్రజలు పాలకులకు విధేయులు కారు, వారికి వారే పాలకులు. వారు తప్పులు చేసినప్పటికీ వారి చర్యలకు వారే బాధ్యత వహిస్తారు.

చివరగా, ప్రజాస్వామ్యం ఇతర ప్రభుత్వ రూపాల కంటే మెరుగైనది ఎందుకంటే ఇది తన స్వంత తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశ మిస్తుంది. మనం పైన చూసినట్లుగా ప్రజా స్వామ్యంలో తప్పులు జరగవని గ్యారెంటీ లేదు. ఏ ప్రభుత్వ రూపమైనా దానికి హామీ ఇవ్వదు. ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రయోజనం ఏమిటంటే ఇలాంటి తప్పులు ఎక్కువ కాలం దాగవు. ఈ తప్పులపై బహిరంగ చర్చకు అవకాశం ఉంది. తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంది. పాలకులు తమ నిర్ణయాలైనా మార్చుకోవాలి లేదా వారే మార్చబడతారు. ప్రజాస్వామ్యేతర ప్రభుత్వంలో ఇలా జరగదు.

మనం దానిని సమీక్షిద్దాం. ప్రజాస్వామ్యంతో మనం అన్నింటినీ పొందలేము, అన్ని సమస్యలకు ఇది పరిష్కారం కాదు. కానీ మనకు తెలిసిన ఇతర ప్రత్యామ్నాయాల కంటే ఇది ఉత్తమమైది. ఇది మంచి నిర్ణయాలకు అవకాశమిస్తుంది, ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తుంది, వివిధ రకాల ప్రజలు కలిసి జీవించడానికి అనుమతిస్తుంది. వీటిలో కొన్నింటిని సాధించడంలో విఫలమైనప్పటికీ తన తప్పులను సవరించుకోవడానికి అవకాశమిస్తుంది, పౌరులందరికీ మరింత గౌరవాన్ని అందిస్తుంది. అందుకే ప్రజాస్వామ్యాన్ని ఉత్తమ ప్రభుత్వ రూపంగా పరిగణిస్తారు.

ఈ వ్యంగ్య చిత్రం కెనడాలో 2004 పార్లమెంటరీ ఎన్నికలకు ముందు ప్రచురించబడింది. లిబరల్ పార్టీ మరోసారి గెలుస్తుందని వ్యంగ్య చిత్రకారునితో సహా అందరూ ఊహించారు. ఫలితాలు వచ్చినపుడు లిబరల్ పార్టీ ఓడిపోయింది. ఈ వ్యంగ్య చిత్రంలోని వాదము ప్రజాస్వామ్యానికి అనుకూలమా? లేదా వ్యతిరేకమా?

ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.



©Cam Cardow, *The Ottawa Citizen*, Canada, Cagle Cartoons Inc. 30 May 2004.

AP SCERT

రాజేష్, ముజఫర్ ఒక కథనాన్ని చదివారు. ఏ ప్రజాస్వామ్యం మరొక ప్రజాస్వామ్యంతో యుద్ధం చేయదని ఇది తెలియజేసింది. రెండు ప్రభుత్వాలలో ఒకటి ప్రజాస్వామ్యేతరమైనది అయినప్పుడు మాత్రమే యుద్ధాలు జరుగుతాయి. ఇది ప్రజాస్వామ్యానికి గొప్ప ప్రయోజనమని ఈ వ్యాసం చెబుతుంది. వ్యాసం చదివిన తరువాత రాజేష్, ముజఫర్‌ల స్పందనలు భిన్నంగా ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచి వాదన కాదని రాజేష్ అన్నాడు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది. భవిష్యత్తులో ప్రజాస్వామ్యాల మధ్య యుద్ధాలు జరగవచ్చు. కానీ ఇది ఎంతమాత్రం యాదృచ్ఛికంగా జరిగింది కాదని ముజఫర్ అన్నాడు. యుద్ధం జరిగే అవకాశాలను తగ్గించే విధంగా ప్రజాస్వామ్యాలు నిర్ణయాలు తీసుకుంటాయి. **ఈ రెండింటిలో ఏ వాదనను మీరు సమర్థిస్తారు. ఎందుకు?**

**మీ పురోగతి పరిశీలించుకోండి**

యాభై సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలపై వ్యాఖ్యానిస్తూ ఆర్.కె లక్ష్మణ్ ఈ ప్రసిద్ధ వ్యంగ్య చిత్రాన్ని గీసారు. గోడమీద ఎన్ని చిత్రాలను మీరు గుర్తించారు? ఈ వ్యంగ్య చిత్రంలో ఉన్న సామాన్య వ్యక్తిలాగే సమాజంలోని సామాన్య ప్రజలంతా ఉంటారా?

ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.

## 1.4 ప్రజాస్వామ్య విస్తృత అర్థం

ఈ అధ్యాయంలో మనము ప్రజాస్వామ్యం యొక్క అర్థాన్ని పరిమిత, వివరణాత్మక భావనతో చూశాము. ప్రజాస్వామ్యాన్ని ఒక ప్రభుత్వ రూపంగా మనము అవగాహన చేసుకున్నాము. ప్రజాస్వామ్యాన్ని నిర్వచించే ఈ విధానం ప్రజాస్వామ్యానికి ఉండ వలసిన కనీస లక్షణాలను గుర్తించడానికి మనకు సహాయపడుతుంది. మన కాలంలో ప్రజాస్వామ్యం యొక్క సాధారణ రూపం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. మీరు ఇప్పటికే దీని గురించి మునుపటి తరగతులలో చదివారు. మనం ప్రజాస్వామ్యం అని పిలుచుకునే దేశాల్లో ప్రజలందరూ పరిపాలించరు. అధిక సంఖ్యాకులు ప్రజలందరి తరఫున నిర్ణయాలు తీసుకుంటారు. ఈ అధిక సంఖ్యాకులు కూడా ప్రత్యక్షంగా పరిపాలించరు. ఈ అధిక సంఖ్యాకులు తాము ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా పరిపాలిస్తారు. ఇది అవసరం. ఎందుకనగా.....

- ఆధునిక ప్రజాస్వామ్యాలలో జనాభా ఎక్కువగా ఉండుటవలన భౌతికంగా ఒకేచోట కలిసి కూర్చొని సమిష్టి నిర్ణయం తీసుకోవడం అసాధ్యం.
- వారు చేయగలిగినప్పటికీ, పౌరులకు అన్ని నిర్ణయాలలో పాల్గొనడానికి సమయం, కోరిక లేదా నైపుణ్యాలు లేవు.

ఇది మనకు ప్రజాస్వామ్యం గురించి స్పష్టమైన కనీస అవగాహనను ఇస్తుంది. ప్రజాస్వామ్యాలను ప్రజా స్వామ్యేతర దేశాల నుండి వేరు చేయడానికి ఈ స్పష్టత మనకు సహాయపడుతుంది. కానీ ప్రజా స్వామ్యానికి, ఒక మంచి ప్రజాస్వామ్యానికి మధ్య తేడాను తెలుసుకోవడానికి అవకాశం ఇవ్వదు. ప్రభుత్వం యొక్క పనితీరును బట్టే ప్రజాస్వామ్యాన్ని




©R.K. Laxman, *The Times of India*

AP SCERT

అర్థం చేసుకోడానికి ఇది అవకాశం కల్పిస్తుంది. అంతకు మించి చెప్పదు. దీనికోసం మనం ప్రజాస్వామ్యం యొక్క విస్తృత అర్థాన్ని తెలుసుకోవాలి.

కొన్నిసార్లు ప్రభుత్వానికే కాకుండా సంస్థలకు సంబంధించి కూడా ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఉపయోగిస్తాం. ఈ వివరణలను చదవండి :

- *"మాది చాలా ప్రజాస్వామిక కుటుంబం. నిర్ణయం తీసుకోవాల్సినప్పుడల్లా మేమంతా కూర్చుని ఏకాభిప్రాయానికి వస్తాం. మా నాన్న గారి అభిప్రాయానికి ఉన్న గౌరవమే నా అభిప్రాయానికి ఉంటుంది".*
- *"తరగతి గదిలో విద్యార్థులను మాట్లాడనివ్వని, ప్రశ్నలు అడగనివ్వని టీచర్లను నేను ఇష్టపడను. ప్రజాస్వామ్య స్వభావం గల టీచర్లను నేను ఇష్టపడతాను".*
- *"ఒక నాయకుడు, అతని కుటుంబ సభ్యులే ఈ పార్టీలో ప్రతి విషయాన్ని నిర్ణయిస్తారు. వారు ప్రజాస్వామ్యం గురించి ఎలా మాట్లాడగలరు?"*

ప్రజాస్వామ్యం అనే పదం ప్రధానంగా నిర్ణయాలు తీసుకునే విధానానికి సంబంధించింది. ఈ విషయాన్ని పరిశీలిద్దాం. ఒక ప్రజాస్వామ్య నిర్ణయంలో ఆ నిర్ణయం వలన ప్రభావితులైన వారందరితో సంప్రదించడం, వారి అంగీకారాన్ని తీసుకోవడం జరుగుతుంది. ఈ నిర్ణయం తీసుకోవడంలో ఎక్కువ శక్తి వంతులకు, తక్కువ శక్తివంతులకు ఒకే విధమైన ప్రాధాన్యత ఉంటుంది. ఇది ఒక ప్రభుత్వానికి, ఒక కుటుంబానికి, లేదా ఏదైనా ఇతర సంస్థకు కూడా వర్తిస్తుంది. అందువల్ల ప్రజాస్వామ్యం అనేది జీవితంలో ఏ రంగానికైనా వర్తించే సూత్రం.

కొన్నిసార్లు ప్రజాస్వామ్యం అనే పదాన్ని ప్రస్తుతం ఉన్న ఏ ప్రభుత్వాన్ని వివరించడానికి కాకుండా అన్ని ప్రజాస్వామ్య దేశాలు లక్ష్యంగా పెట్టుకొని మార్పుచెందాల్సిన ఒక ఆదర్శ ప్రమాణాన్ని ఏర్పరచడానికి మనం వాడతాం.

- "ఏ ఒక్కరూ ఆకలితో పస్తులుండనప్పుడు మాత్రమే ఈ దేశంలో నిజమైన ప్రజాస్వామ్యం ఉన్నట్లు."
- "ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు నిర్ణయం తీసుకోవడంలో సమాన పాత్ర పోషించగలగాలి. దీనికోసం మీకు కావలసింది కేవలం ఓటు హక్కు మాత్రమే కాదు. ప్రతీ పౌరుడికి సమాన సమాచార అందుబాటు, ప్రాథమిక విద్య, వనరులు సమాన అందుబాటు, అత్యంత నిబద్ధత అవసరం."

మనం ఈ ఆదర్శాలనే ముఖ్యంగా తీసుకుంటే ప్రపంచంలో ఏ దేశం కూడా ప్రజాస్వామ్యం కాదు. అయితే ప్రజాస్వామ్యాన్ని ఒక ఆదర్శంగా అవగాహన చేసుకుంటే మనం ప్రజాస్వామ్యానికి ఎందుకు అంత విలువనిస్తామో అర్థమవుతుంది. ఇది ప్రస్తుత ప్రజాస్వామ్యపు పనితీరును నిర్ధారించడానికి, దాని బలహీనతలను గుర్తించడానికి మనకు సహాయపడుతుంది. ఇది కనీస ప్రజాస్వామ్యం, మంచి ప్రజాస్వామ్యం మధ్య తేడాను గుర్తించడంలో మనకు సహాయపడుతుంది.

ఈ పుస్తకంలో ప్రజాస్వామ్యం గురించిన ఈ విస్తృత భావనతో మనం ముందుకు వెళ్ళడం లేదు. ఒక ప్రభుత్వ రూపంగా ప్రజాస్వామ్యపు కొన్ని మౌలిక సంస్థాగత లక్షణాలపై ఇక్కడ దృష్టి సారించడం జరిగింది. రాబోయే సంవత్సరం మీరు ప్రజాస్వామ్య సమాజం గురించి, ప్రజాస్వామ్యాన్ని మూల్యాంకనం చేసే పద్ధతులను గురించి మరింత చదువుతారు.

ఈ దశలో ప్రజాస్వామ్యం జీవితంలోని అనేక రంగాలకు వర్తిస్తుందని, ప్రజాస్వామ్యం అనేక రూపాలను తీసుకోవచ్చని మనం గమనించాలి. సమాన ప్రాతిపదికన సంప్రదింపులు అనే ప్రాథమిక సూత్రాన్ని ఆమోదించినంత కాలం ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవడానికి వివిధ మార్గాలు ఉండవచ్చు. నేటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం యొక్క అత్యంత సాధారణ రూపం ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా పాలన. మీరు దాని గురించి మూడవ అధ్యాయంలో మరింత చదువుతారు. కానీ సమూహం చిన్నదైతే ప్రజాస్వామ్య సమూహం నిర్ణయాలు తీసుకోవడానికి ఇతర పద్ధతులు ఉండవచ్చు. ప్రజలందరూ కలిసి కూర్చొని నేరుగా నిర్ణయాలు తీసుకోవచ్చు. గ్రామంలో గ్రామ సభ ఇలానే జరగాలి. నిర్ణయాలు తీసుకునే ఇతర ప్రజాస్వామ్య మార్గాల గురించి మీరు ఆలోచించగలరా?

## కృత్యము

మీ అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంటరీ నియోజకవర్గంలో అర్హత కలిగిన మొత్తం ఓటర్ల సంఖ్యను కనుగొనండి. మీ ప్రాంతంలో అతిపెద్ద స్టేడియంలో ఎంతమంది వ్యక్తులు సరిపోతారో తెలుసుకోండి. మీ పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్లందరూ ఒకచోట కూర్చుని అర్థవంతమైన చర్చలు జరపడం సాధ్యమేనా?



మా గ్రామంలో గ్రామ సభ ఎప్పుడూ సమావేశం కాదు. అది ప్రజాస్వామ్యమా?

AP SCERT

ఏ దేశమూ పరిపూర్ణ ప్రజాస్వామ్యం కాదు అని దీని అర్థం. ఈ అధ్యాయంలో మనం చర్చించిన ప్రజాస్వామ్యం యొక్క లక్షణాలు ప్రజాస్వామ్యం యొక్క కనీస పరిస్థితులను మాత్రమే అందిస్తాయి. అది ఒక ఆదర్శ ప్రజాస్వామ్యమని భావించవలసిన అవసరం లేదు. ప్రతి ప్రజాస్వామ్యం ప్రజాస్వామిక నిర్ణయాధికారం యొక్క ఆదర్శాలను గ్రహించడానికి ప్రయత్నించాలి. ఇది ఒక్కసారిగా సాధించబడదు. ప్రజాస్వామ్యయుత నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను కాపాడుకుని బలోపేతం చేసుకోవడానికి నిరంతర ప్రయత్నం అవసరం. పౌరులుగా మన భాధ్యతలను నిర్వర్తించే విధానాన్ని బట్టి మన దేశం ఉన్నతమైన ప్రజాస్వామ్యమా? అధమమైన ప్రజాస్వామ్యమా అనేది నిర్ణయమవుతుంది. ఇదే ప్రజాస్వామ్యం యొక్క బలం, బలహీనత. ఒక దేశం యొక్క భవిష్యత్తు కేవలం పాలకుల పనితీరు బట్టే కాక పౌరులుగా మనం ఏమి చేస్తున్నామనే దానిపై ప్రధానంగా ఆధారపడి ఉంటుంది.

ఇదే ప్రజాస్వామ్యానికి, ఇతర ప్రభుత్వాలకు మధ్యగల తేడాను తెలియజేస్తుంది. రాచరికము, నియంతృత్వము, ఏకపక్ష పరిపాలన లాంటి ఇతర ప్రభుత్వ రూపాలలో పౌరులందరూ రాజకీయాలలో పాల్గొనవలసిన అవసరం లేదు. వాస్తవానికి చాలా ప్రజాస్వామ్యేతర ప్రభుత్వాలు తమ పౌరులు రాజకీయాలలో పాల్గొనకూడదని భావిస్తాయి. పౌరులందరూ రాజకీయాలలో చురుకుగా పాల్గొనడంపై ప్రజాస్వామ్యం యొక్క విజయం ఆధారపడి ఉంటుంది. అందుకే ప్రజాస్వామ్య అధ్యయనం ప్రజాస్యామ్య రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించాలి.

## అభ్యాసాలు

1. ఇక్కడ నాలుగు దేశాల గురించి కొంత సమాచారం ఉంది. ఈ సమాచారం ఆధారంగా, మీరు ఈ ప్రతీ దేశాన్ని ఎలా వర్గీకరిస్తారు. వీటిలో ప్రతిదానికి ఎదురుగా 'ప్రజాస్వామ్య," అప్రజాస్వామ్య' లేదా 'చెప్పలేము' అని వ్రాయండి.
   - ఎ దేశం A: దేశం యొక్క అధికారిక మతాన్ని అంగీకరించని వ్యక్తులకు ఓటు హక్కు ఉండదు.
   - బి దేశం B: గత 20 సంవత్సరాలుగా ఒకే పార్టీ ఎన్నికల్లో గెలుస్తూ వచ్చింది.
   - సి దేశం C: గత మూడు ఎన్నికల్లో అధికార పార్టీ ఓడిపోయింది.
   - డి దేశం D: స్వతంత్ర ఎన్నికల సంఘం లేదు.
2. ఇక్కడ నాలుగు దేశాల గురించి కొంత సమాచారం ఉంది. ఈ సమాచారం ఆధారంగా మీరు ప్రతీ దేశాన్ని ఎలా వర్గీకరిస్తారు. వీటిలో ప్రతిదానికి ఎదురుగా 'ప్రజాస్వామ్య', 'అప్రజాస్వామ్య' లేదా 'చెప్పలేము' అని వ్రాయండి.
   - ఎ దేశం P: ఆర్మీ చీఫ్ అనుమతి లేకుండా పార్లమెంటు సైన్యం గురించి చట్టాన్ని చేయలేదు.
   - బి దేశం Q: న్యాయవ్యవస్థ అధికారాలను తగ్గించే చట్టాన్ని పార్లమెంటు ఆమోదించదు.
   - సి దేశం R: దేశ నాయకులు దాని పొరుగు దేశం నుండి అనుమతి తీసుకోకుండా మరొక దేశంతో ఎటువంటి ఒప్పందంపై సంతకం చేయలేరు.
   - డి దేశం S: దేశం గురించిన అన్ని ప్రధాన ఆర్థిక నిర్ణయాలను సెంట్రల్ బ్యాంక్ అధికారులు తీసుకుంటారు. వీటిని మంత్రులు కూడా మార్చలేరు.
3. వీటిలో ఏది ప్రజాస్వామ్యానికి అనుకూలమైన వాదన **కాదు**? ఎందుకు?
   - ఎ ప్రజాస్వామ్యంలో ప్రజలు స్వేచ్ఛగా, సమానంగా ఉంటారు.
   - బి ప్రజాస్వామ్యాలు ఇతరులకన్నా మెరుగైన పద్ధతిలో సంఘర్షణను పరిష్కరిస్తాయి.
   - సి ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రజలకు మరింత జవాబుదారీగా ఉంటుంది.
   - డి ప్రజాస్వామ్యాలు ఇతరులకన్నా ఎక్కువ సంపన్నమైనవి.

AP SCERT

4. ఈ వివరణలలో ప్రతి ఒక్క అంశం ప్రజాస్వామ్య, అప్రజాస్వామ్య అంశాన్ని కలిగి ఉంది. ప్రతి స్టేట్‌మెంట్‌కు రెండింటిని విడివిడిగా రాయండి.

ఎ ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా కొన్ని చట్టాలను పార్లమెంటు ఆమోదించాల్సి ఉంటుందని ఒక మంత్రి చెప్పారు.

బి పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిన నియోజకవర్గంలో రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

సి పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యం కేవలం 10 శాతానికి చేరుకుంది. దీంతో మహిళా సంఘాలు మహిళలకు మూడింట ఒక వంతు సీట్లు కావాలని డిమాండ్ చేశాయి.

5. ప్రజాస్వామ్య దేశంలో కరువు వచ్చే అవకాశం తక్కువ ఉంది అని వాదించడానికి వీటిల్లో సరైన కారణం కానిది ఏది?

ఎ ప్రతిపక్ష పార్టీలు ఆకలి, ఆకలి చావులపై దృష్టిని పెట్టేలా చేయగలవు.

బి స్వేచ్ఛా సమాచార వ్యవస్థ దేశంలో వివిధ ప్రాంతాలలో కరువుతో బాధపడుతున్న వారి వివరాలను వెల్లడిస్తాయి.

సి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో ఉంది.

డి ప్రజలు ఏ మతాన్నైనా విశ్వసించడానికి, ఆచరించడానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు.

6. జిల్లాలో 40 గ్రామాలకు తాగునీరందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదు. ఈ గ్రామస్తులు సమావేశమయ్యారు. వారి అవసరాన్ని తీర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి అనేక పద్ధతులను ఆలోచించారు. వీటిలో ఏది ప్రజాస్వామ్య పద్ధతి కాదు?

ఎ నీరు జీవించే హక్కులో భాగమని న్యాయస్థానంలో కేసు దాఖలు చేయడం

బి అన్ని పార్టీలకు సందేశం ఇవ్వడానికి వచ్చే ఎన్నికలను బహిష్కరించడం.

సి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బహిరంగ సభలు నిర్వహించడం.

డి నీరు తెచ్చుకోవడానికి ప్రభుత్వ అధికారులకు డబ్బులు చెల్లించడం.

7. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉన్న క్రింది వాదనలకు ప్రతిస్పందనను వ్రాయండి:

ఎ దేశంలో సైన్యం అత్యంత క్రమశిక్షణ, అవినీతి రహిత సంస్థ. కాబట్టి సైన్యం దేశాన్ని పాలించాలి.

బి అధిక సంఖ్యాకుల పాలన అంటే అమాయకుల పాలన. వారు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ మనకు విజ్ఞుల పాలన అవసరం.

సి ఆధ్యాత్మిక విషయాలలో మత పెద్దలు మనకు మార్గనిర్దేశం చేయాలని మనం కోరుకుంటే, రాజకీయాల్లో కూడా మనకు మార్గనిర్దేశం చేయడానికి వారిని ఎందుకు ఆహ్వానించకూడదు?. దేశాన్ని మత పెద్దలు పాలించాలి.

8. ప్రజాస్వామ్యం ఒక విలువ అని తెలిపే విధంగా ఈ క్రింది వివరణలు ఉన్నాయా? ఎందుకు?

ఎ తండ్రి తన కుమార్తెతో : నీ వివాహం గురించి నీ అభిప్రాయాన్ని నేను వినాలనుకోవడం లేదు. మన కుటుంబంలో తల్లిదండ్రులు చెప్పే మాట ప్రకారమే పిల్లలు పెళ్లి చేసుకుంటారు.

బి ఉపాధ్యాయుడు విద్యార్థితో: తరగతి గదిలో నన్ను ప్రశ్నలు అడిగి నా ఏకాగ్రతకు భంగం కలిగించవద్దు.

సి ఉద్యోగి అధికారితో : చట్టం ప్రకారం మా పని గంటలు తగ్గించాలి.

AP SCERT

## అభ్యాసాలు

9. దేశం గురించిన ఈ క్రింది వాస్తవాలను పరిగణించండి. మీరు దానిని ప్రజాస్వామ్యంగా పిలుస్తారో లేదో నిర్ణయించండి. మీ నిర్ణయానికి మద్దతు ఇవ్వడానికి కారణాలను తెలియజేయండి.
   - ఎ దేశంలోని పౌరులందరికీ ఓటు హక్కు ఉంది. ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు.
   - బి దేశం అంతర్జాతీయ సంస్థల నుండి రుణం తీసుకుంది. రుణం ఇవ్వడానికి ప్రభుత్వం విద్య, ఆరోగ్యంపై దాని ఖర్చులు తగ్గించాలి అనేది షరతుల్లో ఒకటి
   - సి ప్రజలు ఏడు కంటే ఎక్కువ భాషలు మాట్లాడతారు. కానీ విద్య ఒక భాషలో మాత్రమే అందుబాటులో ఉంది. అది ఆ దేశంలోని 52 శాతం మంది ప్రజలు మాట్లాడే భాష.
   - డి ఈ విధానాలను వ్యతిరేకిస్తూ దేశంలో శాంతియుత ప్రదర్శనలు, దేశవ్యాప్త సమ్మెలకు అనేక సంస్థలు పిలుపునిచ్చాయి. ఈ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది.
   - ఇ దేశంలో రేడియో, టెలివిజన్లు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయి. అన్ని వార్తాపత్రికలు ప్రభుత్వ విధానాలు, నిరసనల గురించి ఏవైనా వార్తలను ప్రచురించడానికి ప్రభుత్వం నుండి అనుమతి పొందాలి.

10. 2004లో USAలో ప్రచురించబడిన ఒక నివేదిక ఆ దేశంలో పెరుగుతున్న అసమానతలను సూచించింది. ఆదాయంలో అసమానతల ప్రభావం ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యంలో ప్రతిబింబించాయి. అది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రభావితం చేసేలా వారి సామర్థ్యాలను కూడా రూపొందించింది. నివేదిక నొక్కి వక్కాణించినది:
   - నల్లజాతి కుటుంబ ఆదాయం $ 100 ఉండాలి, శ్వేతజాతి కుటుంబ ఆదాయం $ 162. తెల్లజాతి కుటుంబానికి సగటు నల్లజాతి కుటుంబం ఆదాయం కంటే పన్నెండు రెట్లు ఎక్కువ సంపద ఉంటుంది.
   - అధ్యక్ష ఎన్నికలలో '$ 75,000 కంటే ఎక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలలోని 10 మంది వ్యక్తులలో దాదాపు 9 మంది ఓటు వేశారు. ఈ వ్యక్తులు వారి ఆదాయం పరంగా జనాభాలో పై 20%లో ఉన్నారు. మరోవైపు $ 15,000 కంటే తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాల నుండి 10 మందిలో 5 మంది మాత్రమే ఓటు వేశారు. ఆదాయపరంగా వారు జనాభాలో దిగువ 20%లో ఉన్నారు.
   - రాజకీయ పార్టీలకు దాదాపు 95% సహకారం ధనికుల నుండి వస్తుంది. ఇది వారి అభిప్రాయాలు, సమస్యలను వ్యక్తం చేయడానికి వారికి అవకాశం కల్పిస్తుంది. చాలా మంది పౌరులకు ఈ అవకాశం అందుబాటులో లేదు.
   - పేద వర్గాలు రాజకీయాల్లో తక్కువగా పాల్గొంటున్నందున పేదరికం నుండి బయటపడటం, ఉద్యోగం పొందడం, విద్య, వైద్యం, గృహాలు వంటి వారి సమస్యలను ప్రభుత్వం వినడం లేదు. వ్యాపారవేత్తలు, ధనవంతుల సమస్యలను గురించి రాజకీయ నాయకులు చాలా తరచుగా వింటారు.

   ఈ నివేదికలో ఇవ్వబడిన సమాచారాన్ని ఉపయోగించి 'ప్రజాస్వామ్యం, పేదరికం 'పై ఒక వ్యాసం రాయండి. కానీ భారతదేశం నుండి ఉదాహరణలు ఉపయోగించాలి.

AP SCERT




చాలా వార్తాపత్రికలలో సంపాదకీయాలకు ఒక పేజీ ఉంటుంది. ఆ పేజీలో వార్తాపత్రిక సమకాలీన అంశాల గురించి తన స్వంత అభిప్రాయాలను ప్రచురిస్తుంది. వార్తాపత్రిక ఇతర రచయితల, మేధావుల అభిప్రాయాలను, పాఠకులు వ్రాసిన లేఖలను కూడా ప్రచురిస్తుంది. ఏదైనా ఒక వార్తాపత్రికను ఒక నెల పాటు అనుసరించండి. ఆ పేజీలో ప్రజాస్వామ్యంతో సంబంధం ఉన్న సంపాదకీయాలు, వ్యాసాలు, లేఖలను సేకరించండి. వీటిని క్రింది వర్గాలుగా వర్గీకరించండి:

- ప్రజాస్వామ్యం యొక్క రాజ్యాంగ, చట్టపరమైన అంశాలు
- పౌరుల హక్కులు
- ఎన్నికల, పార్టీ రాజకీయాలు
- ప్రజాస్వామ్యంపై విమర్శలు

అధ్యాయం - 2

# రాజ్యాంగ రూపకల్పన

AP SCERT

## అవలోకనం

ప్రజాస్వామ్యంలో పాలకులు తమ ఇష్టానుసారం పాలించడానికి అవకాశం లేదని గత అధ్యాయంలో మనం గమనించాము. ఇక్కడ పౌరులు, ప్రభుత్వము అనుసరించాల్సిన కొన్ని ప్రాథమిక నియమాలు ఉన్నాయి. ఇటువంటి నియమాలన్నింటి సముదాయాన్నే రాజ్యాంగం అంటారు. దేశ అత్యున్నత చట్టంగా రాజ్యాంగం పౌరులకు గల హక్కులు, ప్రభుత్వానికి గల అధికారాలు, ప్రభుత్వం ఎలా పనిచేయాలో నిర్ణయిస్తుంది.

ఈ అధ్యాయములో మనము ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ నిర్మాణాన్ని గూర్చి కొన్ని ప్రాథమిక ప్రశ్నలు అడుగుతాము. మనకు రాజ్యాంగం ఎందుకు అవసరం? రాజ్యాంగాలు ఎలా రూపొందించబడ్డాయి? వాటిని ఎవరు, ఏవిధంగా రూపకల్పన చేస్తారు? ప్రజాస్వామ్య దేశాలలో రాజ్యాంగానికి రూపునిచ్చే విలువలు ఏవి? ఒకసారి రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తర్వాతి కాలంలో మనం మార్పులు చేయగలమా?

ఇటీవలి కాలంలో ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని తయారుచేసుకున్న దేశంగా దక్షిణాఫ్రికాను ఉదాహరణగా చెప్పవచ్చు. దక్షిణాఫ్రికాలో ఏమి జరిగిందో, అక్కడి ప్రజలు రాజ్యాంగాన్ని రూపొందించుకొనే పనిని ఎలా కొనసాగించారో గమనించడం ద్వారా మనము ఈ అధ్యాయాన్ని ప్రారంభిద్దాము. దీని తరువాత భారత రాజ్యాంగము ఎలా రూపొందించబడింది, దాని ప్రాథమిక విలువలు ఏమిటి, పౌరుల జీవన విధానానికి, ఉత్తమ ప్రభుత్వ నిర్వహణకు రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియ ఎలా దోహదపడిందో తెలుసుకుంటాము.



నెల్సన్ మండేలా

## 2.1 దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్య రాజ్యాంగం

"నేను శ్వేతజాతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, నల్లజాతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా కూడా పోరాడాను. ప్రజలంతా సామరస్యంగా, సమాన అవకాశాలతో కలిసి జీవించే ప్రజాసామ్య, స్వేచ్ఛా సమాజాన్ని నేను ఆశిస్తున్నాను. ఈ ఆదర్శాల కోసం జీవించాలని, వాటిని సాధించాలని నేను కోరు కుంటున్నాను. ఇందుకు అవసరమైతే మరణించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను."

ఈ మాటలు నెల్సన్ మండేలావి. దక్షిణా ఫ్రికాలోని శ్వేతజాతి ప్రభుత్వం **రాజద్రోహ నేరం** క్రింద ఇతనిని శిక్షించడానికి ప్రయత్నించింది. అతను దేశంలో గల **జాతి వివక్ష** (అపార్థీడ్) పాలనను ఎదిరించినందుకు గానూ అతనికి, మరో ఏడుగురు రాజకీయ నాయకులకు 1964లో జీవితఖైదు శిక్ష విధించింది. నాటి నుండి 28సంవత్సరాల పాటు దక్షిణాఫ్రికాలోని రాబెన్ ద్వీపంలో గల భయంకరమైన జైలులో శిక్షను అనుభవించాడు.

1

వర్ణ వివక్ష కాలం (1953) నాటి ఉద్రిక్త పరిస్థితి తీవ్రతను తెలియ జేసే ఒక సైన్‌బోర్డ్




2

దర్బన్ బీచ్‌లో ఇంగ్లీషు, ఆఫ్రికా, జులు భాషలలో వ్రాయబడ్డ బోర్డు. ఇంగ్లీషులో దీని అర్థం : **దర్బన్ నగరం దర్బన్ బీచ్** ఉప చట్టంలోని 37వ సెక్షన్ ప్రకారం బీచ్‌లో ఈ స్నానపు ప్రాంతం శ్వేతజాతి సమూహ సభ్యుల ఉపయోగార్థం కేటాయించబడింది.

### వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాటం

ప్రత్యేకంగా దక్షిణాఫ్రికాలో గల జాతివివక్ష విధానానికి అపార్థీడ్ అని పేరు. ఈ విధానాన్ని ఐరోపాకు చెందిన శ్వేతజాతి వారు దక్షిణాఫ్రికాలో ప్రవేశపెట్టారు. 17,18 శతాబ్దాలలో ఐరోపా ఖండం నుండి వచ్చిన వర్తక కంపెనీలు తమ బలం, ఆయుధాలతో భారతదేశాన్ని ఆక్రమించిన విధంగా ఈ ప్రాంతాన్ని కూడా ఆక్రమించారు. కానీ భారత్ వలే కాకుండా అధిక మొత్తంలో శ్వేతజాతి వారు దక్షిణాఫ్రికాలో స్థిరపడి స్థానిక పాలకులుగా మారారు. జాతి వివక్ష విధానం (అపార్థీడ్) ద్వారా ప్రజలను విభజించి, వారి చర్మం రంగు ఆధారంగా వారు గుర్తింపు పొందేటట్లు చేసారు. స్థానిక దక్షిణాఫ్రికా ప్రజలు నల్లని రంగు కలవారు. మొత్తం జనాభాలో మూడింట నాలుగువంతులు ఉన్న వీరిని 'నల్లని వారు' (Blacks) అని పిలిచారు. ఈ రెండు జాతులే కాకుండా 'మిశ్రమ వర్ణం' (Coloured) అని పిలవబడే ప్రజలు, భారతదేశం నుండి వలస వచ్చిన ప్రజలు ఉన్నారు. శ్వేతజాతి ప్రజలు శ్వేతేతరులను హీనంగా చూసేవారు. ఈ శ్వేతేతరులకు ఓటు వేసే హక్కు లేదు.

ఈ జాతి వివక్ష (అపార్థీడ్) విధానము నల్లజాతీయులను ప్రధానంగా అణచివేసింది. వీరు శ్వేత జాతీయుల ప్రాంతాల నుండి వెలివేయబడ్డారు. అనుమతి ఉంటేనే శ్వేతజాతీయుల ప్రాంతాలలో పనిచేయగలరు. రైళ్ళు, బస్సులు, టాక్సీలు, హోటళ్ళు, స్కూళ్ళు, కళాశాలలు, గ్రంథాలయాలు, సినిమా హాళ్ళు, కళాక్షేత్రాలు, ఈతకొలనులు, ప్రభుత్వ మరుగుదొడ్లు వంటివన్నీ శ్వేత, నల్లజాతివారికి వేరు వేరుగా ఉండేవి.

2




John Mullen, *Wikipedia*, GNU Free Documentation License

AP SCERT

దీనినే వేరుచేయుట (అపార్థీడ్) అంటారు. శ్వేతజాతి వారు ఆరాధించే చర్చిల సందర్శనకు కూడా వీరు అనుమతించబడేవారు కాదు. నల్లజాతివారు సంఘాలను ఏర్పాటుచేయరాదు. లేదా ఈ భయంకర వివక్షకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయరాదు.

1950 నుండి నల్లజాతీయులు, మిశ్రమ వర్ణం వారు, భారతీయులు జాతి వివక్ష వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. వీరు నిరసన ప్రదర్శనలు, సమ్మెలు ఆరంభించారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ANC) అనేది వేర్పాటు విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అనేక సంస్థలను ఒకే గొడుగు క్రిందకు తీసుకొనివచ్చి నాయకత్వం వహించిన సంస్థ. ఇందులో కమ్యునిస్టు పార్టీ, అనేక కార్మిక సంఘాలు ఉన్నాయి. అనేక మంది సున్నిత మనస్కులైన శ్వేత జాతీయులు కూడా జాతి వివక్షను వ్యతిరేకించడానికి ANCలో చేరి ఈ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. అనేక దేశాలు జాతి వివక్షను అన్యాయంగా, జాత్యహంకారంగా ప్రకటించాయి. కానీ శ్వేత జాతీయుల ప్రభుత్వం వేలాది మంది నల్ల జాతీయులను, మిశ్రమ వర్ణాల వారిని నిర్బంధించి, చిత్ర హింసలకు గురిచేసి చంపడం ద్వారా పాలన కొనసాగించినది.

## కృత్యము

- నెల్సన్ మండేలా జీవితము, పోరాటం పై ఒక పోస్టరును రూపొందించండి.
- అవకాశముంటే అతని ఆత్మకథ The long walk to freedom లో కొన్ని భాగాలను తరగతి గదిలో చదవండి.

### నూతన రాజ్యాంగం వైపుగా

జాతి వివక్షకు వ్యతిరేకంగా నిరసనలు, పోరాటాలు పెరిగినందున అణచివేత విధానాల ద్వారా నల్లజాతీయులను ఇక ఎంతోకాలం తమ పాలన క్రింద కొనసాగించలేమని శ్వేతజాతి ప్రభుత్వం గ్రహించింది. ఫలితంగా తన విధానాలను మార్చుకుంది. వివక్షాపూరిత చట్టాలను రద్దు చేసారు, రాజకీయ పార్టీలపై నిషేధాన్ని, ప్రచార మాధ్యమాలపై ఆంక్షలను ఎత్తివేసారు. 28 సంవత్సరాల జైలు జీవితం అనంతరం స్వేచ్ఛాజీవిగా నెల్సన్ మండేలా బయటకు వచ్చారు. చివరికి 1994, ఏప్రిల్ 26 అర్థరాత్రి ప్రపంచంలో నూతన ప్రజాస్వామ్య దేశంగా దక్షిణాఫ్రికా ఆవిర్భవించింది. దీనికి సంకేతంగా దక్షిణాఫ్రికా రిపబ్లిక్ నూతనజెండాను ఆవిష్కరించింది. జాతి వివక్షను అనుసరించిన ప్రభుత్వ శకం ముగిసి, బహుళజాతి ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది.

ఇది ఎలా సాధ్యమయింది? ఈ అసాధారణ పరివర్తనపై దక్షిణాఫ్రికా మొదటి అధ్యక్షుడు మండేలా మాటలను విందాం.

*"జాతి వివక్ష (అపార్థీడ్) నుండి ప్రజాస్వామ్యానికి శాంతియుత పరివర్తన చెందడానికి చర్చలు జరపడంలో చారిత్రక శత్రువులు విజయం సాధించాయి. ఎందుకంటే ఇతరులలో దాగిఉన్న సహజసిద్ధ మంచితనాన్ని అంగీకరించడానికి మేము సిద్ధ పడ్డాము. దక్షిణాఫ్రికా ప్రజలు మంచితనంపై తమ నమ్మకాన్ని ఎప్పటికీ వదిలిపెట్టరు. మానవులపై వారికి గల ఈ విశ్వాసం మన ప్రజాస్వామ్యానికి మూల స్థంభము".*

నూతన ప్రజాసామ్య దేశంగా దక్షిణాఫ్రికా ఆవిర్భవించిన తరువాత అధికారంలో ఉన్నపుడు శ్వేతజాతీయులు చేసిన అకృత్యాలను క్షమించాలని నల్లజాతి నాయకులు తోటి నల్లజాతీయులకు విజ్ఞప్తి చేసారు. మానవ హక్కులు, సాంఘిక న్యాయము, ప్రజాస్వామ్య విలువలు, అన్ని జాతులు, పురుషులు, స్త్రీల సమానత్వం మీద ఆధారపడిన ఒక నూతన దక్షిణాఫ్రికాను మనం నిర్మిద్దామని వారు తెలిపారు. అణచివేత, క్రూరమైన హత్యల ద్వారా పాలించిన వారు, స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించినవారు ఉమ్మడి రాజ్యాంగాన్ని రూపొందించడానికి కలిసి కూర్చున్నారు.

రెండు సంవత్సరాల పాటు చర్చలు, వాదోపవాదాలు జరిపిన పిమ్మట వారు ప్రపంచంలోని అత్యుత్తమ రాజ్యాంగాలలో ఒకటిగా పేర్కొనదగిన రాజ్యాంగాన్ని తయారుచేసారు. ఏ దేశంలోనూ లేని విస్తృతమైన హక్కులను ఈ రాజ్యంగము తమ దేశ పౌరులకు కల్పించింది. సమస్యల పరిష్కారం కోసం జరిపే అన్వేషణలో ఎవరినీ మినహాయించకూడదని, ఏ సమూహాన్ని విరోధులుగా చూడరాదని వారిరువురూ కలిసి నిర్ణయించుకున్నారు. గతంలో వారు ఏమి చేసినా, ఏ అంశానికి ప్రాతినిధ్యం వహించినా కూడా ప్రతి ఒక్కరూ పరిష్కారంలో భాగం కావాలని వారు అంగీకరించారు. దక్షిణాఫ్రికా రాజ్యాంగ పీఠిక (పేజీ 213 చూడండి) ఈ స్ఫూర్తిని వెల్లడిచేస్తుంది.



అధిక సంఖ్యాకులైన నల్లజాతి వారు శ్వేతజాతీయుల అణచివేత, దోపిడీకి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయిస్తే దక్షిణాఫ్రికాలో ఏమి జరిగి ఉండేది?

AP SCERT




*Wikipedia*, GNU Free Documentation License

దక్షిణాఫ్రికా రాజ్యాంగం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులకు ప్రేరణనిచ్చింది. 1994 వరకు అత్యంత అప్రజాస్వామిక దేశమని యావత్ ప్రపంచం ఖండించిన దేశం నేడు ప్రజాస్వామ్యానికి నమూనాగా కనిపిస్తున్నది. కలిసి పనిచేయాలనే దక్షిణాఫ్రికా ప్రజల దృఢ సంకల్పము, తమ చేదు అనుభవాలను రంగుల హరివిల్లుగా మార్చుకోవాలనే సద్భావనే దక్షిణాఫ్రికా ప్రజలకు ఈ మార్పును సాధ్యమయ్యేలా చేసింది. దక్షిణాఫ్రికా రాజ్యాంగాన్ని గూర్చి మాట్లాడుతూ మండేలా ఇలా అన్నారు:

*"దక్షిణాఫ్రికా రాజ్యాంగం గతం, భవిష్యత్ రెండింటి గురించి తెలియజేస్తుంది. ఒకవైపు దక్షిణాఫ్రికా వాసులుగా జాత్యహంకారం, క్రూరత్వం, అణచివేత ధోరణి గల గతాన్ని ఎప్పటికీ పునరావృతం కాకుండా గంభీరమైన ఒప్పందం చేసుకోవడం, మరోవైపు అంతకన్నా ముఖ్యమైనది రూపాంతరం చెందిన మనదేశం వాస్తవంగా పూర్తిభావాలతో ప్రజలందరూ అనగా నల్లజాతీయులు, శ్వేతజాతీయులు, స్త్రీలు, పురుషులు భాగస్వాములు కావడం."*

ఈ చిత్రం నేటి దక్షిణాఫ్రికా స్ఫూర్తిని ప్రతిఫలిస్తుంది. దక్షిణాఫ్రికా ప్రజలు తమను తాము ఇంద్రధనస్సు జాతిగా పిలుచుకుంటారు. ఎందుకో మీరు ఊహించగలరా?

దక్షిణాఫ్రికాను గూర్చి మరిన్ని వివరాల కోసం చూడండి. https://www.gov.za

**మీ పురోగతి పరిశీలించుకోండి**

స్వాతంత్ర్యం కోసం దక్షిణాఫ్రికా పోరాట కథ మీకు భారత జాతీయ ఉద్యమాన్ని గుర్తుచేస్తుందా? క్రింది అంశాలలో రెండింటి మధ్య సారూప్యతలు, అసమానతల జాబితాను తయారుచేయండి

- వలసవాద స్వభావం
- వివిధ సమూహాల మధ్య సంబంధం
- నాయకత్వం : గాంధీ / మండేలా,
- పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ : ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ / ఇండియన్ నేషనల్ కాంగ్రెస్
- పోరాట పద్ధతి

## 2.2 మనకు రాజ్యాంగం ఎందుకు అవసరం?

మనకు రాజ్యాంగం ఎందుకు అవసరం, అది ఏమి చేస్తుంది అన్న విషయాలను అర్థం చేసుకోవడానికి దక్షిణాఫ్రికా దేశం ఒక మంచి ఉదాహరణ. ఈ నూతన ప్రజాస్వామ్యంలో అణచివేతకు పాల్పడిన వారు, అణచివేతకు గురైనవారు కలిసి జీవించాలని యోచిస్తున్నారు. ఒకరినొకరు విశ్వసించడం అంత సులభం కాదు. వివరి భయాలు వారికున్నాయి. వారు తమ ప్రయోజనాలను కాపాడుకోవాలని కోరుకున్నారు. అధిక సంఖ్యాకులైన నల్ల జాతివారు ప్రజాస్వామ్య సూత్రమైన మెజారిటీ పాలన విషయంలో రాజీపడరాదని కోరుకున్నారు. వారు గణనీయమైన స్థాయిలో సామాజిక, ఆర్థిక హక్కులను కోరుకున్నారు. శ్వేతజాతి మైనారిటీ వారు తమ విశేషాధికారాలను, ఆస్థిని కాపాడుకోడానికి ఆసక్తి చూపించారు.

AP SCERT

సుదీర్ఘ చర్చల అనంతరం ఇరువర్గాలు ఒక రాజీకి అంగీకరించాయి. మెజారిటీ పాలన, ఒక వ్యక్తి – ఒక ఓటు అనే సూత్రానికి శ్వేత జాతీయులు అంగీకరించారు. పేదలు, కార్మికులకు కొన్ని ప్రాథమిక హక్కులను ఇవ్వడానికి కూడా వారు అంగీకరించారు. అధిక సంఖ్యాకుల పాలన నిరంకుశ పాలనగా ఉండరాదని నల్లజాతీయులు అంగీకరించారు. అల్ప సంఖ్యాకులైన శ్వేతజాతీయుల ఆస్తిని అధిక సంఖ్యాకులైన నల్లజాతీయులు స్వాధీనం చేసుకోబోరని మాట ఇచ్చారు. అయితే ఈ రాజీ అంత సులభతరం కాదు. దీనిని ఎలా అమలుచేయబోతున్నారు? వారు ఒకరినొకరు విశ్వసించగలిగినప్పటికీ భవిష్యత్‌లో వీరి మధ్య గల నమ్మకం విచ్ఛిన్నం కాదనే హామీ ఏమిటి?

అటువంటి పరిస్థితిలో ఇరువర్గాల మధ్య నమ్మకాన్ని పెంపొందించడానికి, కొనసాగించడానికి ఇరువురూ కట్టుబడి ఉండే విధంగా కొన్ని నియమాలను నిర్దేశించారు. భవిష్యత్‌లో పాలకులను ఎలా ఎన్నుకోవాలో ఈ నియమాలు తెలియజేస్తాయి. ఇవి ఎన్నికైన ప్రభుత్వాలు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో కూడా నిర్ణయిస్తాయి. అంతిమంగా ఈ నియమాలు పౌరుల హక్కులను నిర్ణయిస్తాయి. గెలిచినవారు వీటిని సులభంగా మార్చలేనప్పుడు మాత్రమే ఈ నియమాలు పని చేస్తాయి. దక్షిణాఫ్రికా ప్రజలు చేసింది ఇదే. వారు కొన్ని ప్రాథమిక నియమాలపై అంగీకారానికి వచ్చారు. ఈ నియమాలే అత్యున్నతమైనవనీ, ఏ ప్రభుత్వమూ వీటిని విస్మరించజాలదని కూడా అంగీకరించారు. ఇటువంటి ప్రాథమిక నియమాల కూర్పునే రాజ్యాంగం అంటారు.

రాజ్యాంగాన్ని తయారుచేయుట దక్షిణాఫ్రికాకు మాత్రమే ప్రత్యేకం కాదు. ప్రతి దేశంలోనూ విభిన్న సమూహాల ప్రజలు జీవిస్తుంటారు. వారి మధ్య గల సంబంధం దక్షిణాఫ్రికాలోని శ్వేత, నల్ల జాతీయుల మధ్య గల సంబంధాలంత చెడ్డవి కాకపోవచ్చు. కానీ ప్రపంచమంతటా ప్రజలకు విభిన్న అభిప్రాయాలు, అభిరుచులు ఉంటాయి. ప్రజాస్వామ్య దేశమైనా, కాకపోయినా ప్రపంచంలో చాలా దేశాలకు ఈ మౌలిక నియమాలు ఉండవలసిన అవసరం ఉంది. ఇది కేవలం ప్రభుత్వాలకే వర్తించేది కాదు. ఏ సంఘానికైనా రాజ్యాంగం అవసరం. అది మీ ప్రాంతంలో గల క్లబ్ కావొచ్చు, సహకార సంఘం, లేదా రాజకీయ పార్టీ కావొచ్చు. వీటన్నింటికీ రాజ్యాంగం అవసరం.

## కృత్యము

మీ ప్రాంతంలో గల క్లబ్ లేదా సహకార సంఘం లేదా యూనియన్ లేదా రాజకీయ పార్టీని సంప్రదించండి. వారి నిబంధనల పుస్తక కాపీని తీసుకోండి. (వీటిని సాధారణంగా సంఘ నియమాలు అంటారు). దానిని చదవండి. ఈ నియమాలు ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయా? ఎటువంటి వివక్షత చూపకుండా అవి ఏ వ్యక్తికైనా సభ్యత్వం ఇస్తాయా?

ఈ విధంగా ఒక దేశ రాజ్యాంగం అనేది ఆ దేశంలో కలిసి జీవించే ప్రజలందరూ అంగీకరించి రాసుకున్న నియమాల కూర్పు. రాజ్యాంగం ఒక భూభాగంలో నివసించే వ్యక్తుల (పౌరుల) మధ్య సంబంధాన్ని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాన్ని నిర్ణయించే అత్యున్నత చట్టం. రాజ్యాంగం చాలా చేస్తుంది:

- మొదటిది: వివిధ రకాల వ్యక్తులు కలిసి జీవించడానికి అవసరమైన విశ్వాసాన్ని, సమన్వయ స్థాయిని కల్పిస్తుంది.
- రెండవది: ప్రభుత్వం ఏవిధంగా ఏర్పాటు చేయబడుతుందో నిర్దేశిస్తుంది. ఏ నిర్ణయాన్ని ఎవరు తీసుకునే అధికారం ఉందో నిర్దేశిస్తుంది.
- మూడవది: ఇది ప్రభుత్వ అధికారాలపై పరిమితులను విధిస్తుంది, పౌరులకుగల హక్కులు ఏమిటో మనకు తెలియజేస్తుంది.
- నాలుగవది: ఇది ఉత్తమ సమాజాన్ని సృష్టించడం గురించిన ప్రజల ఆకాంక్షలను వ్యక్తపరుస్తుంది.

రాజ్యాంగాలున్న అన్ని దేశాలూ ప్రజాస్వామ్య దేశాలే కానవసరం లేదు. అయితే ప్రజాస్వామ్య దేశాలన్నింటికి రాజ్యాంగాలు ఉంటాయి. గ్రేట్ బ్రిటన్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటం అనంతరం అమెరికన్లు తమకు తాము రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. విప్లవం తరువాత ఫ్రాన్స్ ప్రజలు ఒక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని ఆమోదించారు. నాటి నుండి అన్ని ప్రజాస్వామ్య దేశాలకు లిఖిత రాజ్యాంగం ఉండడం ఒక ఆచారంగా మారింది.



ఇది న్యాయం కాదు! అన్ని ప్రాథమిక అంశాలూ అప్పటికే నిర్ణయించబడితే భారతదేశంలో రాజ్యాంగ సభను ఏర్పాటుచేయడంలో ప్రయోజనం ఏమిటి?

AP SCERT

## 2.3 భారత రాజ్యాంగాన్ని రూపొందించడం



**సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ (1875–1950)**
**జననం** : గుజరాత్. హోం శాఖామంత్రి. మధ్యంతర ప్రభుత్వంలో సమాచార, ప్రసార శాఖా మంత్రి. న్యాయవాది. బర్డోలి రైతు సత్యాగ్రహ నాయకుడు. స్వదేశీ సంస్థానాల విలీనంలో నిర్ణయాత్మక పాత్ర పోషించి తదుపరి ఉపప్రధానిగా చేసారు.



**అబుల్ కలాం అజాద్ (1888–1958)**
**జననం**: సౌదీ అరేబియా విద్యావేత్త. రచయిత. వేదాంత వేత్త, అరబిక్ భాషా పండితుడు. జాతీయోద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన కాంగ్రెస్ నాయకుడు. ముస్లిం వేర్పాటువాద రాజకీయాలను వ్యతిరేకించారు. మొదటి కేంద్ర మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రి.



**టి.టి.కృష్ణమాచారి (1899–1974)**
**జననం**: తమిళనాడు రాజ్యాంగ రచనా సంస్థ సభ్యుడు, వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు. తరువాత కేంద్ర ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసారు.

All sketches by Rajeev Kumar

దక్షిణాఫ్రికాలో వలే భారతదేశంలో కూడా అత్యంత సంక్లిష్ట పరిస్థితుల మధ్య రాజ్యాంగాన్ని రూపొందించారు. భారత్ వంటి అతిపెద్ద, వైవిధ్యపూరిత దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడం అంత సులువైన అంశం కాదు. ఆ సమయంలో భారతదేశ ప్రజలు పాలితుల స్థితి నుండి పౌరుల స్థాయికి చేరుకుంటున్నారు. మతపరమైన విభేదాల ప్రాతిపదికన జరిగిన విభజన నుండి దేశం ఆవిర్భవించింది. ఇది భారత్, పాకిస్థాన్ ప్రజలకు బాధాకరమైన అనుభవం.

విభజన సంబంధిత హింసలో సరిహద్దు కిరువైపులా కనీసం పది లక్షల మంది మరణించారు. అదే సమయంలో మరొక సమస్య వచ్చింది. స్వదేశీ సంస్థానాలు భారత్‌లో విలీనం కావాలా లేదా పాకిస్థాన్‌తో విలీనం కావాలా లేదా స్వతంత్రంగా కొనసాగాలా అన్న విషయాన్ని బ్రిటిష్ వారు స్వదేశీ సంస్థానాల పాలకులకు విడిచి పెట్టారు. ఈ స్వదేశీ సంస్థానాల విలీనం చాలా కష్టమైన, అనిశ్చితితో కూడుకున్న విషయం. రాజ్యాంగాన్ని రచిస్తున్నప్పుడు దేశభవిష్యత్తు ఇప్పటిలా సురక్షితంగా కనబడలేదు. రాజ్యాంగ నిర్మాతలకు దేశం యొక్క అప్పటి పరిస్థితిని గూర్చి, భవిష్యత్‌ను గూర్చి ఆందోళన ఉండేది.

### కృత్యము

మీ నాన్నమ్మ, తాతలతో లేదా మీ ప్రాంతంలోని ఇతర పెద్దలతో మాట్లాడండి. దేశవిభజన లేదా స్వాతంత్ర్యం లేదా రాజ్యాంగం గురించి వారికేమైనా జ్ఞాపకం ఉందా అని అడగండి. ఆ సమయంలో దేశం గురించి వారి భయాలు, ఆశలు ఏమిటి? తరగతి గదిలో వీటిని చర్చించండి.

### రాజ్యాంగానికి మార్గం

ఇన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, భారత రాజ్యాంగ నిర్మాతలకు ఒక పెద్ద అవకాశం ఉన్నది. దక్షిణాఫ్రికా వలే కాకుండా ప్రజాస్వామ్య భారతదేశం ఎలా ఉండాలనేదానిపై వారు ఏకాభిప్రాయాన్ని తీసుకురావలసిన అవసరం లేకుండా పోయింది. ఈ ఏకాభిప్రాయం చాలా వరకు స్వాతంత్ర్య పోరాట సమయంలోనే రూపుదిద్దుకుంది. మన జాతీయ ఉద్యమం కేవలం పరాయి పాలనకు వ్యతిరేకంగా మాత్రమే జరిగిన పోరాటం కాదు. ఇది మన దేశాన్ని పునరుజ్జీవింప చేయడానికి, సమాజాన్ని, రాజకీయాలను మార్చడానికి కూడా జరిపిన పోరాటం. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం అనుసరించవలసిన మార్గాల గురించి జాతీయ నాయకుల మధ్య తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఉండేవి. అలాంటి విభేదాలు ఈనాడూ ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని ప్రాథమిక భావనలను దాదాపు అందరు అంగీకరించారు.

1928 నాటికే మోతిలాల్ నెహ్రూ, మరో ఎనిమిది మంది కాంగ్రెస్ నాయకులు దేశానికి ఒక రాజ్యాంగాన్ని రూపొందించారు. 1931లో భారత జాతీయ కాంగ్రెస్ **కరాచీ సమావేశంలో** స్వాతంత్ర్య భారతరాజ్యాంగం ఎలా ఉండాలనే దానిపై ఒక తీర్మానాన్ని చేసింది. ఈ రెండు పత్రాలూ సార్వత్రిక వయోజన ఓటు హక్కును, స్వేచ్ఛ, సమానత్వపు హక్కును, మైనారిటీల హక్కులను పరిరక్షించడాన్ని చేర్చాయి. ఈ విధంగా రాజ్యాంగం పై చర్చించడానికి రాజ్యాంగ సభ సమావేశం కాకముందే కొన్ని ప్రాథమిక విలువలను నాయకులందరూ అంగీకరించారు.

వలస పాలన యొక్క రాజకీయ సంస్థలతో ఉన్న పరిచయం కూడా సంస్థాగత రూపకల్పనపై ఒక ఒప్పందానికి రావడానికి సహాయపడింది. బ్రిటీష్ పాలన జనాభాలో కొందరికి మాత్రమే ఓటు హక్కు కల్పించింది. దాని ఆధారంగా బ్రిటీష్ వారు బలహీనమైన చట్ట సభలను ప్రవేశపెట్టారు. 1937లో బ్రిటీష్ ఇండియా అంతటా ప్రాంతీయ శాసనసభలు, మంత్రిత్వ శాఖలకు ఎన్నికలు జరిగాయి. ఇవి పూర్తిగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కావు. కానీ శాసనసభలలో పనిచేయడం ద్వారా భారతీయులు పొందిన అనుభవం తమ సొంత సంస్థలను స్థాపించడానికి, వాటిలో పనిచేయడానికి చాలా

AP SCERT

ఉపయోగపడింది. అందుకే భారత రాజ్యాంగం భారత ప్రభుత్వ చట్టం-1935 వంటి వలస చట్టాల నుండి అనేక సంస్థాగత వివరాలు, విధానాలను స్వీకరించడం జరిగింది.

రాజ్యాంగ చట్రంపై సంవత్సరాల తరబడి చేసిన ఆలోచనలు, చర్చలు మరొక ప్రయోజనాన్ని కలిగించాయి. మనకు అవసరమైనంతమేరకు మాత్రమే మన నాయకులు ఇతర దేశాల నుండి నేర్చుకోవడానికి తగిన ఆత్మవిశ్వాసాన్ని సాధించారు. వారిలో అనేకమంది ఫ్రెంచి విప్లవ ఆదర్శాలు, బ్రిటన్‌లోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, అమెరికాలోని హక్కుల బిల్లుల నుండి ప్రేరణ పొందారు. రష్యాలోని సామ్యవాద విప్లవం అనేకమంది భారతీయులలో సామాజిక, ఆర్థిక సమానత్వం అధారంగా ఒక వ్యవస్థను రూపొందించాలనే ఆలోచనను రేకిత్తించింది. అయినప్పటికీ వారు ఇతరులు చేసిన వాటిని కేవలం అనుకరించలేదు, ఈ అంశాలు మన దేశానికి సరిపడతాయా? అని అడుగడుగునా ప్రశ్నించేవారు. ఈ అంశాలన్నీ మన రాజ్యాంగ రూపకల్పనకు దోహదపడ్డాయి.

## రాజ్యాంగం సభ

అలా అయితే రాజ్యాంగ నిర్మాతలు ఎవరు? రాజ్యాంగాన్ని రూపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిన కొందరు నాయకులను గూర్చి సంక్షిప్తంగా ఇక్కడ మీరు తెలుసుకుంటారు.

### కృత్యము

ఇక్కడ పేర్కొనబడని మీ రాష్ట్ర లేదా ప్రాంతానికి చెందిన రాజ్యాంగ సభ సభ్యులను గూర్చి మరింత తెలుసుకోండి. అతని ఫోటోను సేకరించండి లేదా అతని నమూనా చిత్రాన్ని గీయండి. ఇక్కడ ఉపయోగించిన శైలిని అనుసరించి అతను లేదా ఆమెపై ఒక చిన్న కథనం రాయండి. పేరు (జనన, మరణ సంవత్సరాలు), పుట్టిన ప్రదేశం (ప్రస్తుత రాజకీయ సరిహద్దులను అనుసరించి), రాజకీయ కార్యకలాపాల సంక్షిప్త వివరణ, రాజ్యాంగ సభ తరువాత పోషించిన పాత్ర.

రాజ్యాంగం అనే పత్రాన్ని రాయడం రాజ్యాంగ పరిషత్ అని పిలువబడే ఎన్నికైన ప్రతినిధుల సభ ద్వారా జరిగింది. రాజ్యాంగ పరిషత్‌కు 1946 జూలైలో ఎన్నికలు జరిగాయి. దీని మొదటి సమావేశం 1946 డిశంబర్‌లో జరిగింది. వెనువెంటనే దేశం భారత్, పాకిస్థాన్‌లుగా విడిపోయింది. రాజ్యాంగ సభ కూడా భారత రాజ్యాంగ సభ, పాకిస్థాన్ రాజ్యాంగ సభగా విభజించబడింది. భారత రాజ్యాంగాన్ని 299 మంది సభ్యులు కలిగిన రాజ్యాంగ పరిషత్ రచించింది. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న ఆమోదించింది. అయితే ఇది 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. దీనికి గుర్తుగా మనం ప్రతీ సంవత్సరం జనవరి 26వ తారీఖును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం.

ఆరు దశాబ్దాల కంటే ముందు రాజ్యాంగసభ రూపొందించిన రాజ్యాంగాన్ని మనం ఎందుకు అంగీకరించాలి? మేము ఇప్పటికే పైన ఒక కారణాన్ని చెప్పాము. రాజ్యాంగం అందులోని సభ్యుల అభిప్రాయాలను మాత్రమే ప్రతిబింబించదు. అది నాటి కాలపు విస్తృత ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరుస్తుంది. ప్రపంచంలోని అనేక దేశాలు తమ రాజ్యాంగాలను పునఃలిఖించుకోవలసివచ్చింది. ఎందుకంటే అందలి ప్రాథమిక నియమాలు అన్ని ప్రధాన సామాజిక సమూహాలు లేదా రాజకీయ పార్టీలకు ఆమోద యోగ్యం కాలేదు. మరికొన్ని దేశాలలో రాజ్యాంగం కేవలం కాగితం ముక్కగానే మిగిలింది. ఎవరూ దీనిని ఖచ్చితంగా అనుసరించరు. మన రాజ్యాంగ అనుభవం దీనికి భిన్నం. గత అర్ధశతాబ్ద కాలంలో అనేక సమూహాలు రాజ్యాంగంలోని కొన్ని నిబంధనలను ప్రశ్నించాయి. కాని ఏ పెద్ద సామాజిక వర్గం లేదా రాజకీయ పార్టీ కూడా రాజ్యాంగం యొక్క చట్టబద్ధతను ప్రశ్నించలేదు. ఇది ఏ రాజ్యాంగానికైనా అసాధారణ విజయం.

రాజ్యాంగాన్ని ఆమోదించడానికి గల రెండవ కారణం రాజ్యాంగసభ భారతదేశ ప్రజలకు ప్రాతినిథ్యం వహించుటయే. నాటి కాలంలో సార్వజనీన వయోజన ఓటుహక్కు లేదు. కాబట్టి రాజ్యాంగ పరిషత్ ప్రత్యక్షంగా భారత ప్రజలచే ఎంపిక కాబడలేదు.



**రాజేంద్రప్రసాద్**
(1884-1963)
జననం: బీహార్
రాజ్యాంగ సభ అధ్యక్షుడు. న్యాయవాది. చంపారన్ సత్యాగ్రహంలో తన పాత్రను పోషించారు. జాతీయ కాంగ్రెస్‌కు మూడు సార్లు అధ్యక్షత వహించారు. మొదటి భారత రాష్ట్రపతి.



**జైపాల్ సింగ్**
(1903-1970)
జననం : జార్ఖండ్
క్రీడాకారుడు, విద్యావేత్త, మొదటి జాతీయ హాకీ జట్టుకు నాయకుడు, ఆదివాసి మహాసభకు వ్యవస్థాపక అధ్యక్షుడు, జార్ఖండ్ పార్టీ స్థాపకుడు.



**హెచ్.సి. ముఖర్జీ**
(1887-1956)
జననం: బెంగాల్
రాజ్యంగ సభ వైస్‌చైర్మన్. ప్రముఖ రచయిత. నాయకుడు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యుడు. బెంగాల్ శాసనసభ సభ్యుడు. పశ్చిమ బెంగాల్ గవర్నర్.

AP SCERT



**జి. దుర్గాబాయి దేశ్‌ముఖ్**
(1909–1981)
జననం: ఆంధ్రప్రదేశ్
న్యాయవాది. మహిళల విముక్తి కోసం పోరాడిన సామాజిక కార్యకర్త. ఆంధ్రమహిళా సభ వ్యవస్థాపకులు. కాంగ్రెస్ నాయకురాలు. తరువాత కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు వ్యవస్థాపక ఛైర్‌పర్సన్.

పైన చెప్పిన విధంగా అప్పటికి ఉన్న ప్రాంతీయ అసెంబ్లీ సభ్యులచే ఇది ప్రధానంగా ఎన్నుకోబడింది. ఇది దేశంలోని అన్ని ప్రాంతాల న్యాయమైన నైసర్గిక భాగస్వామ్యాన్ని నిర్ధారించింది. భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ అయిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ రాజ్యాంగంపై ఆధిపత్యం చెలాయించింది. కాని కాంగ్రెస్ పార్టీ వివిధ తరగతుల రాజకీయ సమూహాలు, అభిప్రాయాలను ప్రతిబింబిస్తుంది. కాంగ్రెస్‌తో ఏకీభవించని పలువురు సభ్యులు రాజ్యాంగ సభలో ఉన్నారు. సామాజిక పరంగా కూడా వివిధ భాషాసమూహాలు, కులాలు, తరగతులు, మతాలు, వృత్తుల సభ్యులకు రాజ్యాంగ సభ ప్రాతినిధ్యం వహించింది. ఒకవేళ సార్వజనీన వయోజన ఓటుహక్కు ద్వారా రాజ్యాంగ సభ ఎన్నికైన పుటికీదాని కూర్పు దీనికి భిన్నంగా ఏమీ ఉండకపోవచ్చు.

చివరిగా రాజ్యాంగ పరిషత్ పనిచేసిన తీరు రాజ్యాంగానికి పవిత్రతను చేకూర్చింది. రాజ్యాంగసభ క్రమపద్ధతిలో, పారదర్శకంగా, ఏకాభిప్రాయంతో పనిచేసింది. మొదట కొన్ని ప్రాథమిక సూత్రాలు నిర్ణయించబడి అంగీకరించబడ్డాయి. అప్పుడు డా. బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన ఒక ముసాయిదా కమిటీ ముసాయిదా రాజ్యాంగాన్ని చర్చకు సిద్ధం చేసింది. ముసాయిదా రాజ్యాంగంలోని ప్రతీ నిబంధనపై కూలంకషంగా పలు దఫాలుగా చర్చలు జరిగాయి. రెండు వేలకు పైగా సవరణలు పరిగణన లోకి తీసుకోబడ్డాయి. సభ్యులు మూడు సంవత్సరాల నిడివిలో 114 రోజులపాటు చర్చించారు. రాజ్యాంగ సభలో సమర్పించబడిన ప్రతీ పత్రం, మాట్లాడిన ప్రతీపదం రికార్డ్ చేయబడింది, భద్రపరచబడింది. వీటిని 'రాజ్యాంగ సభ చర్చలు' అంటారు. దీనిని ముద్రించినప్పుడు ఈ చర్చలు 12 పెద్ద సంపుటా లుగా వెలువడ్డాయి. ఇవి నిబంధనల వెనుక గల హేతుబద్ధతను తెలియజేస్తాయి. రాజ్యాంగం యొక్క మూలతత్వాన్ని అర్థం చేసుకోవటానికి ఉపయోగ పడతాయి.

**మీ పురోగతి పరిశీలించుకోండి**

ఇక్కడి ప్రక్క నిలువు వరుసలో ఇవ్వబడిన భారత రాజ్యాంగ నిర్మాతలందరి గురించిన సమాచారాన్ని చదవండి.
ఈ సమాచారాన్ని మీరు బట్టీపట్టవలసిన అవసరంలేదు.
కింది ప్రకటనలకు మద్దతు ఇవ్వడానికి వీటి నుండి కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.
1. ఈ సభలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు చాలా మంది ఉన్నారు.
2. ఈ సభ విభిన్న సామాజిక వర్గాలను ప్రతిబింబిస్తుంది.
3. ఈ సభ సభ్యులు భిన్న భావజాలాలను విశ్వసించారు.



**బల్దేవ్ సింగ్**
(1901–1961)
జననం: హర్యానా. ఒక విజయవంతమైన వ్యాపారవేత్త. పంజాబ్ అసెంబ్లీలో పాంథిక్ అకాలీపార్టీ నాయకుడు. రాజ్యాంగ పరిషత్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థి. కేంద్ర కేబినెట్‌లో రక్షణ శాఖా మంత్రి.

## 2.4 భారతం రాజ్యాంగం యొక్క మార్గదర్శక విలువలు

ఈ పుస్తకంలో మనం వివిధ విషయాలపై రాజ్యాంగంలో గల ఖచ్చితమైన నిబంధనలను అధ్యయనం చేస్తాము. ఈ దశలో రాజ్యాంగపు సమగ్ర తత్వాన్ని అర్థం చేసుసుకుంటూ ముందుకు వెళదాము. దీనిని మనం రెండు విధాలుగా చేయవచ్చు. రాజ్యాంగంపై ప్రముఖ నాయకుల అభిప్రాయాలను చదవడం ద్వారా దీనిని అర్థం చేసుకోవడం ఒక పద్ధతి. రాజ్యాంగం తన తత్వాన్ని గురించి తానే ఏమి వివరిస్తుంది అనేది అధ్యయనం చేయడం కూడా అంతే ప్రధానమైనది. రాజ్యాంగ పీఠిక చెప్పేది ఇదే. వీటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

### కల, వాగ్దానం

మీలో కొందరు రాజ్యాంగ నిర్మాతలలో ఒక పేరు లేకపోవడాన్ని గమనించి ఉండవచ్చు. ఆయనే మహాత్మా గాంధీ. అతను రాజ్యాంగ పరిషత్ సభ్యుడు కాదు. అయినప్పటికీ అతని ఆశయాలను అనుసరించే అనేక మంది సభ్యులు రాజ్యాంగసభలో ఉన్నారు. రాజ్యాంగం ఏ లక్ష్యాలను సాధించాలని తాను ఆశిస్తున్నాను అనే విషయాన్ని 1931లో తన యంగ్ ఇండియా పత్రికలో పేర్కొన్నారు.

AP SCERT

"భారతదేశాన్ని బానిసతత్వం నుండి, కొంత మంది వ్యక్తుల ఆధిపత్యం నుండి విముక్తిని కల్పించేదిగా రాజ్యాంగం ఉండేలా నేను శ్రమిస్తాను. నిరుపేదలు కూడా ఈ దేశం తమదని, ఈ దేశ నిర్మాణంలో తమ అభిప్రాయాలకు కూడా విలువ ఉందని భావించే విధంగా నేను కృషిచేస్తాను. ఉన్నత వర్గాలు, నిమ్న వర్గాలు లేని దేశం కోసం, సమాజంలోని అన్ని వర్గాలు సంపూర్ణ సామరస్యంతో ఉండే భారతదేశం కోసం కృషిచేస్తాను. ఆ దేశంలో అస్పృశ్యతకు, మత్తు పానీయాలు, మత్తు పదార్థాలకు చోటు ఉండదు. పురుషులకు ఉండే అన్ని హక్కులు స్త్రీలకు కూడా ఉంటాయి... పై అంశాలలో ఏది లోపించినా నేను సంతృప్తి చెందను.



రాజ్యాంగ నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించిన డా. అంబేద్కర్ అసమానతలు లేని భారతదేశం కోసం కూడా కలగన్నారు. కాని ఈ అసమానతలను నిర్మూలించే విషయంలో ఆయన ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. మహాత్మా గాంధీని, అతని దృష్టి కోణాన్ని ఈయన తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగ సభనుద్దేశించిన తన ముగింపు ఉపన్యాసంలో తన ఆందోళనను స్పష్టంగా వ్యక్తంచేశారు.

"1950 జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవితంలోకి అడుగుపెట్టబోతున్నాం. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది, సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు ఉంటాయి. రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు, ప్రతీ ఓటుకు ఒకే విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తాం. మన సామాజిక, ఆర్థిక నిర్మాణం కారణంగా మన సామాజిక, ఆర్థిక జీవితంలో ఒక మనిషి - ఒకే విలువ అనే సూత్రాన్ని తిరస్కరించడం కొనసాగిస్తాము. ఈ వైరుధ్యాల జీవితాన్ని మనం ఎంతకాలం కొనసాగిస్తాము? మనం మన సామాజిక, ఆర్థిక జీవితకాలంలో సమానత్వాన్ని ఎంతకాలం నిరాకరిస్తాము? ఈ అసమానతలను ఎక్కువ కాలం కొనసాగిస్తే మన రాజకీయ ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది."

చివరిగా 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి రాజ్యాంగ సభను ఉద్దేశించి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రసిద్ధ ప్రసంగాన్ని చూద్దాం.



**కన్హయ్యలాల్ మాణిక్‌లాల్ మున్షీ**
(1877–1971)
జననం : గుజరాత్
న్యాయవాది, చరిత్రకారుడు. భాషావేత్త. కాంగ్రెస్ నాయకుడు. గాంధేయవాది, కేంద్ర మంత్రివర్గంలో మంత్రి. స్వతంత్ర పార్టీ వ్యవస్థాపకుడు .



**భీం రావ్ రాంజీ అంబేద్కర్**
(1891–1956)
జననం : మధ్యప్రదేశ్
రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు. సామాజిక సంస్కరణవాది. గొప్ప మేధావి. కుల విభజనకు, కుల అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించిన వాడు. స్వాతంత్ర భారతదేశపు మొదటి న్యాయ శాఖా మంత్రి. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు.



**శ్యామా ప్రసాద్ ముఖర్జీ**
(1901–1953)
జననం : పశ్చిమ బెంగాల్
మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమ, సరఫరాల శాఖా మంత్రి. విద్యావేత్త. న్యాయవాది. హిందూ మహాసభలో క్రియాశీలకంగా వ్యవహరించారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు



AP SCERT



**జవహర్ లాల్ నెహ్రూ**
(1889–1964)
జననం: ఉత్తరప్రదేశ్
మధ్యంతర ప్రభుత్వ ప్రధాన మంత్రి. న్యాయవాది. కాంగ్రెస్ నాయకుడు. సామ్యవాద ప్రజాస్వామ్యాలకు సమర్థకుడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకి. భారతదేశ మొదటి ప్రధాని.



**సరోజినీ నాయుడు**
(1879–1949)
జననం: ఆంధ్ర ప్రదేశ్
కవి. రచయిత. రాజకీయ కార్యకర్త. కాంగ్రెస్‌లోని అగ్రశ్రేణి మహిళా నాయకురాలు. తర్వాత ఉత్తర ప్రదేశ్ గవర్నర్



**సోమనాథ్ లాహిరి**
(1901–1984)
జననం: పశ్చిమ బెంగాల్
రచయిత, సంపాదకుడు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. పశ్చిమ బెంగాల్ శాసనసభ సభ్యుడు.

"అనేక సంవత్సరాల క్రితమే ఈ గమ్యం కోసం మనం కలగన్నాము. ఇప్పుడు మనం మన సంకల్పాన్ని పునరాలోచించుకోవలసిన సమయం ఆసన్నమైంది. అది పూర్తిగాను, సంపూర్ణంగాను కాదు. చాలా విస్తృత స్థాయిలో ప్రపంచమంతా నిద్రిస్తున్నప్పుడు భారతదేశం జీవితం కొరకు, స్వేచ్ఛ కొరకు మేల్కొంటుంది. ఇటువంటి క్షణం చరిత్రలో చాలా అరుదుగా వస్తుంది. మనం గతం నుండి నూతన జీవితంలోకి అడుగుపెట్టినప్పుడు, ఒక యుగం ముగిసినప్పుడు, అనేక శతాబ్దాలుగా ఒక జాతి ఆత్మ అణచివేయబడినప్పుడు అది వ్యక్తీకరించబడుతుంది. ఈ పవిత్రమైన సమయంలో భారతదేశానికి, దేశ ప్రజలకు సేవచేయడానికి, మానవాళికి విస్తృత సేవలందించడానికి మనం సంకల్పిందాం...

స్వేచ్ఛ, అధికారం తమతోపాటు బాధ్యతలను తీసుకువస్తాయి. భారత ప్రజల సార్వభౌమాధికారానికి ప్రాతినిథ్యం వహించే సార్వభౌమాధికార సంస్థ అయిన ఈ సభపై ఆ బాధ్యత ఉంది. స్వాతంత్ర్యానికి మునుపే మేము ఈ పురిటినొప్పులను భరించాము. ఈ దుఃఖ జ్ఞాపకాలతో మా హృదయాలు బరువెక్కాయి. ఆ బాధల్లో కొన్ని ఇప్పటికీ కూడా కొనసాగుతున్నాయి. ఏదేమైనా గతం ముగిసింది. ఇప్పుడు మనల్ని భవిష్యత్ పిలుస్తోంది.

ఆ భవిష్యత్ సుఖంగా గడపడానికో లేదా విశ్రాంతి తీసుకోవడానికో కాదు. నిరంతర శ్రమతో కూడుకుని ఉన్నది. తద్వారా మాత్రమే మనం తీసుకున్న, ఈ రోజు తీసుకోబోయే ప్రతిజ్ఞలను నెరవేర్చగలము. భారతదేశ సేవ అంటే కష్టాలను అనుభవిస్తున్న లక్షలాదిమందికి చేసే సేవ. పేదరికం, అజ్ఞానం, అసమానతలను అంతం చేయడమే దీని పరమార్థం. ప్రతీ కన్నునుండి జాలువారే ప్రతీ కన్నీటిబొట్టును తుడవడం మా తరం గొప్ప వ్యక్తి యొక్క ఆశయం. అది శక్తికి మించిన పనే కావచ్చు. కానీ కన్నీళ్ళు, బాధలు ఉన్నంతకాలం మన పని మిగిలే ఉంటుంది.

AP SCERT

**మీ పురోగతి పరిశీలించుకోండి**

పై మూడు వివరణలను జాగ్రత్తగా చదవండి.

- ఈ మూడింటిలోను ఉమ్మడిగా కనిపించే ఆలోచనను గుర్తించగలరా?
- ఆ ఉమ్మడి ఆలోచనను వారు వ్యక్తీకరించే మార్గాలలో తేడాలు ఏమిటి?

## రాజ్యాంగ తత్వం

స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చి, మార్గనిర్దేశం చేసిన విలువలు ఆ పోరాటం ద్వారా మరింత పెంపొందించబడ్డాయి. ఆ విలువలే భారతదేశ ప్రజా స్వామ్యానికి పునాదులుగా ఉన్నాయి. ఆ విలువలే భారత రాజ్యాంగ పీఠికలో పొందుపరచబడ్డాయి. అవే భారత రాజ్యాంగంలోని అన్ని అధికరణాలకు మార్గనిర్దేశం చేస్తాయి. రాజ్యాంగం దాని మౌలిక విలువల సంక్షిప్త వివరణతో ప్రారంభమవుతుంది. దీనినే రాజ్యాంగ పీఠిక అంటారు. అమెరికన్ రాజ్యాంగం నుండి ప్రేరణ పొందిన సమకాలీన ప్రపంచంలోని చాలా దేశాలు తమ రాజ్యాంగాలను పీఠికతో ప్రారంభించాలని నిశ్చయించాయి.

### అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలమైన మేము

మరింత పరిపూర్ణమైన కేంద్రాన్ని ఏర్పరచడానికి, న్యాయాన్ని స్థాపించడానికి, దేశీయ ప్రశాంతతకు భరోసా ఇవ్వడానికి, ఉమ్మడి రక్షణను అందించడానికి, ప్రజలందరి సంక్షేమాన్ని పెంపొందించడానికి మనకు, మన భావితరాలకు స్వేచ్ఛ యొక్క ఆశీర్వాదాలను అందజేసే ఈ రాజ్యాంగం అమెరికా సంయుక్త రాష్ట్రాలకోసం నిర్ణయించబడి స్థాపించబడింది.

దక్షిణాఫ్రికా ప్రజలమైన మేము
గతంలో జరిగిన అన్యాయాలను గుర్తిస్తున్నాము;
మా నేలపై న్యాయం, స్వేచ్ఛ కొరకు బాధలను అనుభవించిన వారిని గౌరవిస్తాము;
మా దేశ నిర్మాణము, అభివృద్ధికి కృషి చేసిన వారికి మర్యాదనిస్తాము;
ఈ దక్షిణాఫ్రికా ఇక్కడ నివసిస్తున్న వారికి, వైవిధ్యతలోను సమైక్యంగా నిలిచిన వారందరికీ చెందుతుందని విశ్వసిస్తున్నాము.
స్వేచ్ఛగా ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులచే ఏర్పడిన గణతంత్ర దేశం యొక్క అత్యున్నత చట్టంగా ఈ రాజ్యాంగాన్ని మేము స్వీకరిస్తున్నాము. కాని -
గతంలోని విభజనలను అధిగమించి ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రాథమిక మానవ హక్కుల ఆధారంగా సమాజాన్ని నిర్మిస్తాము.
ప్రజల అభీష్టంపై ఆధారపడే, ప్రతీ పౌరుడు చట్టం ద్వారా సమానంగా రక్షింపబడే ప్రభుత్వంతో ప్రజాస్వామిక, పారదర్శక సమాజానికి పునాది వేస్తాము.
పౌరులందరి జీవన నాణ్యతను మెరుగుపరుస్తూ ప్రతీ వ్యక్తిని సామర్థ్యం మేర అభివృద్ధి చెందనిస్తాము.
దేశాలతో కూడిన వసుదైక కుటుంబంలో ఒక సార్వభౌమ రాజ్యంగా ఉన్నత స్థానాన్ని పొందే విధంగా ఏకత్వంతో కూడిన ప్రజాస్వామ్య దక్షిణాఫ్రికాను నిర్మిస్తాము.

దేవుడు మన ప్రజలను రక్షించుగాక.

AP SCERT

మన రాజ్యాంగం యొక్క పీఠికను జాగ్రత్తగా చదువుదాం. అందలి ప్రతీ కీలక పదాల అర్థాలను అవగాహన చేసుకుందాం.

ప్రజాస్వామ్యంపై పద్యం వలె రాజ్యాంగ పీఠికను చదువుతాము. ఇది రాజ్యాంగ నిర్మాణం ఏ తాత్విక చింతనల ఆధారంగా రూపొందింపబడిందో వాటన్నింటిని కలిగి ఉంది. ఏదైనా చట్టాన్ని లేదా ప్రభుత్వ చర్యను పరిశీలించడానికి, అంచనా వేయడానికి, అది మంచిదా లేక చెడ్డదా అనేది తెలుసుకోవడానికి ఇది ఒక ప్రామాణికతను అందిస్తుంది. ఇది భారత రాజ్యాంగానికి ఆత్మ వంటిది.

**భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని**
**సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర**
**రాజ్యంగా నిర్మించుకోవడానికి పౌరులందరికీ**
**సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని**
**ఆలోచన, భావప్రకటన, విశ్వాసము**
**ధర్మము, ఆరాధనలలో స్వేచ్ఛను**
**అంతస్తులోను, అవకాశాలలోను సమానత్వాన్ని**
**చేకూర్చుటకు వారందరిలో**
**వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యతను,**
**సమగ్రతను తప్పక సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని**
**పెంపొందించుటకు సత్యనిష్ఠాపూర్వకంగా తీర్మానించుకొని**
**26 నవంబరు 1949 న**
**మన రాజ్యాంగ పరిషత్‌లో పరిగ్రహించి**
**శాసనంగా రూపొందించుకొన్న**
**రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.**

AP SCERT

**గమనిక:** * 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సామ్యవాద', 'లౌకిక' పదాలు ప్రవేశికలో చేర్చబడ్డాయి.

**భారతదేశప్రజలమైన మేము**

తమ ప్రతినిధుల ద్వారా ప్రజలు రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. ఎవరైనా రాజు లేదా విదేశీ శక్తులద్వారా అది అందించబడలేదు.

**సార్వభౌమత్వం**

అంతర్గత, బాహ్య విషయాల్లో నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం ప్రజలకు ఉంది. భారత ప్రభుత్వాన్ని ఏ బాహ్య శక్తి నియంత్రించదు.

**సామ్యవాద**

సమాజంచేత సంపద సృష్టించబడి, సమాజంలో ప్రజలకు సమానంగా పంచాలి. సామాజిక, ఆర్థిక అసమానతలు తలెత్తకుండా ప్రభుత్వం భూమి, పరిశ్రమల యాజమాన్యాన్ని నియంత్రిస్తుంది.

**లౌకిక**

పౌరులు తమకు నచ్చిన మతాన్ని అనుసరించే పూర్తి స్వేచ్ఛ ఉంది. ప్రభుత్వానికి అధికారిక మతమంటూ ఏదీ లేదు. ప్రభుత్వం అన్ని మత విశ్వాసాలను,ఆచారాలను సమానంగా గౌరవిస్తుంది.

**ప్రజాస్వామ్య**

ప్రజలు సమాన రాజకీయ హక్కులను కలిగి, వారి పాలకులను ఎన్నుకొనే, వారు జవాబుదారీగా ఉండేటట్లు చూసే ప్రభుత్వరూపము. కొన్ని ప్రాథమిక సూత్రాలను అనుసరించి ప్రభుత్వం నడుస్తుంది.

**గణతంత్ర**

వారసత్వంగా వచ్చిన వ్యక్తి కాకుండా ఎన్నికైన వ్యక్తి దేశ నాయకుడుగా ఉంటాడు.

**న్యాయం**

కుల, మత, లింగాల ఆధారంగా పౌరులు వివక్షకు గురికారు. సామాజిక అసమానతలు తగ్గించబడతాయి. ప్రభుత్వం అందరి సంక్షేమం, ప్రత్యేకించి వెనుకబడిన వారి సంక్షేమం కోసం పాటుపడుతుంది.

**స్వేచ్ఛ**

పౌరుల ఆలోచనలపైన వాటిని వ్యక్త పరచటంలోను, అమలు చేయటంలోను సహేతుక కారణం లేకుండా ఎటువంటి పరిమితులు విధించబడవు.

**సమానత్వం**

చట్టం ముందు అందరూ సమానమే. సాంప్రదాయ అసమానతలు తొలగి పోవాలి. ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.

**సౌభ్రాతృత్వం**

దేశ ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా ప్రవర్తించాలి,ఏ ఒక్కరూ తోటి వారిని తక్కువగా చూడరాదు.

మీ పురోగతి పరిశీలించుకోండి

అమెరికా సంయుక్త రాష్ట్రాలు, భారతదేశం, దక్షిణాఫ్రికా రాజ్యాంగ పీఠికలను ఒకదానితో మరొకటి పోల్చండి.

- ఈ మూడింటిలోను ఉమ్మడిగా ఉన్న ఆలోచనల జాబితాను రూపొందించండి.
- వీటి మధ్య గల వ్యత్యాసాలలో కనీసం ఒక ప్రధాన వ్యత్యాసాన్ని రాయండి.
- ఈ మూడింటిలో గతాన్ని ప్రస్తావించింది ఎవరు?
- వీటిలో తమకు సహాయం చేయమని దేవునికి మనవి చేయని వారు ఎవరు?

## సంస్థాగత రూపకల్పన

రాజ్యాంగం అంటే కేవలం విలువలు, తాత్విక ప్రకటన మాత్రమే కాదు. మనం పైన గుర్తించినట్లు రాజ్యాంగం ఈ విలువలను సంస్థాగత ఏర్పాట్లలో ప్రతిఫలించేలా చేస్తుంది. భారత రాజ్యాంగం అని పిలవబడే ఈ నివేదికలో ఎక్కువ భాగం ఈ ఏర్పాట్లకు సంబంధించినదే. ఇది చాలా సుదీర్ఘమైన, వివరణాత్మక పత్రం. కాబట్టి దీనిని ఎప్పటికప్పుడు నవీనకరణ చేయడానికి క్రమం తప్పకుండా సవరిస్తూ ఉండాలి. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన వారు దీనిని ప్రజల ఆకాంక్షలు, సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఉంచాలని భావించారు. అందువలన దీనిని ఒక పవిత్రమైన, స్థిరమైన, మార్పులకు లోనుకాని చట్టంగా చూడలేదు. కాబట్టి వారు కాలానుగుణంగా మార్పులను పొందు పరచడానికి నిబంధనలను చేర్చారు. రాజ్యాంగానికి చేసే ఈ మార్పులనే రాజ్యాంగ సవరణలు అంటారు.

రాజ్యాంగం సంస్థాగత ఏర్పాట్లను న్యాయ పరిభాషలో వివరిస్తుంది. మీరు మొదటిసారి రాజ్యాంగాన్ని చదివితే దీనిని అర్థం చేసుకోవడం కష్టం. కానీ ప్రాథమిక సంస్థాగత రూపకల్పనను అర్థం చేసుకోవడం సులభమే. ఇతర రాజ్యాంగాల వలే భారత రాజ్యాంగం దేశాన్ని పరిపాలించే వ్యక్తులను ఎన్నుకునే విధానాన్ని నిర్దేశించింది. ఏ నిర్ణయాలు తీసుకోవడానికి ఎవరికి ఎంత అధికారం ఉంటుందో కూడా ఇది నిర్ణయిస్తుంది. రాజ్యాంగం కొన్ని హక్కులను పౌరులకు అందించింది. వాటిని ప్రభుత్వం అతిక్రమించలేదు. ఈ చర్య ద్వారా ఇది ప్రభుత్వ అధికారాలపై పరిమితులు విధించింది. ఈ పుస్తకంలోని మిగిలిన మూడు అధ్యాయాలు భారత రాజ్యాంగ పనితీరును తెలిపే మూడు అంశాల గురించి వివరిస్తాయి. ప్రతి అధ్యాయంలోను కొన్ని కీలకమైన రాజ్యాంగ నిబంధనలను మనం పరిశీలిస్తాము, అవి ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఎలా పని చేస్తాయో అర్థం చేసుకుంటాము. కానీ ఈ పాఠ్యపుస్తకం భారత రాజ్యాంగంలోని సంస్థాగత రూపకల్పనల ముఖ్యమైన లక్షణాలన్నింటినీ తెలియజెప్పదు. రానున్న సంవత్సరంలో మీ పాఠ్యపుస్తకంలో మరికొన్ని అంశాలు జత చేయబడతాయి.

AP SCERT

### పదకోశం

**జాతి వివక్ష (అపార్థీడ్):** 1948 – 1989 మధ్య జాతి విభజన, నల్లజాతీయుల పట్ల వివక్షత చూపుతూ దక్షిణాఫ్రికా ప్రభుత్వం అనుసరించిన అధికారిక విధానం.

**విభాగం:** ఒక విధానపత్రంలో గల ప్రత్యేక భాగం.

**రాజ్యాంగ సభ:** ఒక దేశానికి రాజ్యాంగాన్ని వ్రాసే ప్రజాప్రతినిధుల సభ

**రాజ్యాంగం:** ఒక దేశం యొక్క అత్యున్నతమైన చట్టం. ఒక దేశంలో రాజకీయాలను, సమాజాన్ని నియంత్రించే ప్రాథమిక నియమాలు ఇందులో ఉంటాయి.

**రాజ్యాంగ సవరణ:** ఒక దేశ రాజ్యాంగంలో అత్యున్నత శాసన వ్యవస్థ ద్వారా చేయబడే సవరణ.

**ముసాయిదా ప్రతి :** ఒక న్యాయ సంబంధ పత్రం యొక్క ప్రాథమిక రూపము.

**తత్వము:** ఒకరి ఆలోచనలు, చర్యలకు సంబంధించిన మూలాధార ప్రాథమిక సూత్రము.

**పీఠిక:** రాజ్యాంగం యొక్క పరిచయ ప్రకటన. ఇది రాజ్యాంగం యొక్క మార్గదర్శక విలువలను, హేతుబద్ధతను తెలియజేస్తుంది.

**దేశద్రోహం:** ఒక దేశపౌరుడైన వ్యక్తి అక్కడి ప్రభుత్వాన్ని కూలదోయడానికి చేసే ప్రయత్నం.

**గమ్యం:** అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సమావేశం లేదా సమావేశ స్థలం.

1. ఇక్కడ కొన్ని తప్పుడు ప్రకటనలు ఇవ్వబడ్డాయి. ప్రతిచోట తప్పును గుర్తించి ఈ అధ్యాయంలో మీరు చదివిన అంశాల ఆధారంగా వాటిని తిరిగి సరిచేసి రాయండి.
   - ఎ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం ప్రజాస్వామ్యంగా ఉండాలా? వద్దా! అనేదానిపై స్వాతంత్ర్య ఉద్యమనాయకులు స్వేచ్ఛాయుతంగా ఉన్నారు.
   - బి రాజ్యాంగంలో గల నిబంధనలన్నింటిపైన భారతరాజ్యాంగసభ సభ్యులు ఒకే విధమైన అభిప్రాయాలను కలిగిఉన్నారు.
   - సి రాజ్యాంగాన్ని కలిగి ఉన్న దేశం ప్రజాస్వామ్య దేశంగానే ఉండాలి.
   - డి రాజ్యాంగం దేశ అత్యున్నత చట్టం. కాబట్టి దీనిని సవరించడం సాధ్యంకాదు.

2. కింది వానిలో దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తయారు చేసినప్పుడు సంఘర్షణకు దారి తీసిన ముఖ్యమైన అంశం ఏది?
   - ఎ దక్షిణాఫ్రికా, దాని పొరుగు దేశాల మధ్య
   - బి స్త్రీ – పురుషులు మధ్య
   - సి అధిక సంఖ్యాకులైన తెల్లజాతీయులు – అల్పసంఖ్యాకులైన నల్లజాతీయుల మధ్య
   - డి అల్పసంఖ్యాకులైన మిశ్రమజాతి వారు – అధిక సంఖ్యాకులైన నల్లజాతీయుల మధ్య.

3. ఈ క్రింది వానిలో ప్రజాస్వామ్య రాజ్యాంగంలో లేని సదుపాయం ఏది?
   - ఎ దేశ అధిపతి యొక్క అధికారాలు
   - బి దేశాధినేత పేరు
   - సి శాసనసభ అధికారాలు
   - డి దేశం పేరు

4. రాజ్యాంగ రూపకల్పనలో వారి పాత్రల ఆధారంగా క్రింది నాయకులను సరిపోల్చండి:

| | |
|---|---|
| ఎ మోతిలాల్ నెహ్రూ | i రాజ్యాంగ సభ అధ్యక్షుడు |
| బి బి.ఆర్. అంబేద్కర్ | ii రాజ్యాంగ సభ సభ్యుడు. |
| సి రాజేంద్రప్రసాద్ | iii రచనాసంఘం అధ్యక్షుడు |
| డి సరోజినీ నాయుడు | iV 1928లో భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని తయారుచేశారు. |

5. 'గమ్యం కోసం కలగన్నాము' అన్న నెహ్రూ ప్రసంగంలోని వాక్యాలను మళ్లీ చదవండి. క్రింది వాటికి సమాధానం ఇవ్వండి:
   - ఎ నెహ్రూ గారు మొదటి వాక్యంలో "పూర్తిగా లేదా సంపూర్ణంగానో కాదు" అనే వ్యక్తీకరణను ఎందుకు ఉపయోగించారు?
   - బి భారత రాజ్యాంగ నిర్మాతలు ఏ ప్రతిజ్ఞ తీసుకోవాలని ఆయన కోరుకున్నారు?
   - సి "ప్రతికన్ను నుండి ప్రతి కన్నీటిబొట్టుని తుడవడం మా తరం యొక్క గొప్పవ్యక్తి యొక్క ఆశయం." అని ఎవరిని ప్రస్తావించారు?

6. రాజ్యాంగంలోని కొన్ని మార్గదర్శక విలువలు, వాటి అర్థం ఇక్కడ ఇచ్చారు. వాటిని సరిగ్గా సరిపోల్చడం ద్వారా తిరిగి వ్రాయండి.

| | |
|---|---|
| ఎ సార్వభౌమాధికారం | i ప్రభుత్వం ఏమతానికీ అనుకూలంగా ఉండదు. |
| బి గణతంత్రం | ii నిర్ణయాలు తీసుకునే అత్యున్నత అధికారం ప్రజలకు ఉంది. |
| సి సోదర భావం | iii దేశాధిపతి ప్రజలచే ఎన్నిక అవుతాడు. |
| డి లౌకికవాదం | iv ప్రజలంతా అన్నదమ్ములు – అక్క చెల్లెళ్ల వలే జీవించాలి. |

AP SCERT

## అభ్యాసాలు

7. నవంబర్ 26న మీ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం ఎలా జరిగింది? సంక్షిప్తంగా నివేదికను తయారు చేయండి.

8. భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా మార్చిన అంశాలను గురించి ఇక్కడ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ అంశాలలో ఒక్కొక్క దానికి మీరు ఎంత ప్రాధాన్యత ఇస్తారు?
   - ఎ భారతదేశంలో ప్రజాస్వామ్యం బ్రిటీష్ పాలకులు అందించిన బహుమతి. బ్రిటీష్ పాలనలో మనము ప్రాతినిధ్య శాసన సభలతో కలిసి పనిచేయడానికి శిక్షణ పొందాము.
   - బి స్వాతంత్ర్య పోరాటం వలసవాద దోపిడీని సవాలు చేసింది. భారతీయులకు వివిధ రకాల స్వేచ్ఛలు నిరాకరించబడ్డాయి. స్వాతంత్ర్య భారతదేశం ప్రజాస్వామ్యయుతంగా ఉండాలే తప్ప మరేరకంగాను ఉండరాదు.
   - సి ప్రజాస్వామ్య విశ్వాసాలు కలిగిన నాయకులను కలిగి ఉండటం మన అదృష్టం. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన అనేక ఇతర దేశాలలో ప్రజాస్వామ్యం తిరస్కరణకు గురికావడం ఈ నాయకులు పోషించిన ముఖ్యపాత్రను తెలుపుతుంది.

9. 1912లో ప్రచురితమైన 'వివాహిత మహిళల' నియమావళి అనే పుస్తకం నుండి తీసుకోబడిన క్రింది అంశాన్ని చదవండి. *'భగవంతుడు స్త్రీ జాతిని శారీరకంగా, మానసికంగా సున్నితంగా, బలహీనంగా మలిచాడు. ఆత్మరక్షణ పరంగా సహాయం కోసం ఎదురుచూసే అసమర్థులుగా చూశాడు. ఆ విధంగా వారు తమ జీవితమంతా తండ్రి, భర్త, కొడుకుల రక్షణలో జీవించేలా భగవంతునిచే ఏర్పరచబడ్డారు. కాబట్టి స్త్రీలు నిరాశచెందకుండా పురుషుల సేవకు బద్ధులుగా తమను తాము అంకితం చేసుకోవాలి'.* ఈ పేరాలో వ్యక్తీకరించబడిన విలువలు మన రాజ్యాంగంలోని విలువలను ప్రతిబింబిస్తున్నాయని మీరు భావిస్తున్నారా? లేదా ఇది రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఉన్నదా?

10. రాజ్యాంగం గురించిన కింది ప్రకటనలను చదవండి. వీటిలో ప్రతి ఒక్కటి ఎందుకు నిజమో ఎందుకు కాదో కారణాలను తెలియజేయండి.
   - ఎ. రాజ్యాంగంలో గల నియమాల సాధికారత, ఇతర చట్టాలలో గల నియమాల సాధికారత ఒకే రకంగా ఉంటాయి.
   - బి. ప్రభుత్వంలోని వివిధ అంగాలు ఎలా ఉండాలో రాజ్యాంగం నిర్దేశిస్తుంది.
   - సి. పౌరుల హక్కులు, ప్రభుత్వ అధికారంపై పరిమితులు రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి.
   - డి. రాజ్యాంగం అనేది సంస్థల గురించే కాని విలువల గురించి కాదు.

---




ఏదైనా రాజ్యాంగ సవరణ లేదా రాజ్యాంగ సవరణ డిమాండ్‌లపై, చర్చపై ప్రచురితమైన సమాచారం కొరకు వార్తా పత్రికలను చదవండి. ఉదాహరణకు చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కోసం రాజ్యాంగ సవరణ డిమాండ్‌పై మీరు దృష్టి సారించవచ్చు. దీనిపై బహిరంగ చర్చ జరిగిందా? అనుకూలంగా ప్రతిపాదించబడిన కారణాలు ఏవి? ఈ రాజ్యాంగ సవరణ గురించి వివిధ పార్టీలు ఏవిధంగా స్పందించాయి? సవరణ జరిగిందా?

AP SCERT





Nehru Memorial Museum and Library, New Delhi

APSCERT

అధ్యాయం – 3

# ఎన్నికల రాజకీయాలు

## పర్యావలోకనం

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ప్రత్యక్షంగా పరిపాలించడం అసాధ్యం కాదని, అవసరం కూడా లేదని మనం మొదటి అధ్యాయంలో తెలుసుకున్నాం. ప్రస్తుత కాలంలో ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా పరిపాలించడం ప్రజాస్వామ్యం యొక్క అతి సాధారణ రూపంగా ఉంది. ఈ అధ్యాయంలో ప్రజా ప్రతినిధులు ఎలా ఎన్నిక అవుతారనే విషయాన్ని పరిశీలిస్తాం. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎందుకు అవసరమో, ఉపయోగకరమో అవగాహన చేసుకుందాం. పార్టీల మధ్య ఎన్నికల పోటీ ప్రజలకు ఎలా మేలు చేస్తుందనే విషయాన్ని మనం అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. ఒక ఎన్నికను ప్రజాస్వామ్యయుతంగా చేసేది ఏది అని మనం అప్పుడు అడుగుదాం. అప్రజాస్వామ్య ఎన్నికల నుంచి ప్రజాస్వామ్య ఎన్నికలను వేరుచేసి చూపడమే ఇక్కడ దీని ప్రాథమిక ఉద్దేశ్యం.

దీని ఆధారంగా భారతదేశంలో ఎన్నికలను మదింపు చేయడానికి ఈ అధ్యాయంలోని మిగిలిన భాగం ప్రయత్నిస్తుంది. వివిధ నియోజకవర్గాల మధ్య సరిహద్దు రేఖలను నిర్ణయించడం మొదలుకొని ఎన్నికల ఫలితాలను ప్రకటించే వరకు ఎన్నికలలోని ప్రతి దశను మనము గమనించవచ్చు. ప్రతి దశలోనూ ఏమి జరగాలని, ఏమి జరుగుతుందని మనం అడగవచ్చు. భారతదేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరుగుతున్నాయా అనే అంశాన్ని అధ్యాయం చివరలో మనము మదింపు చేయవచ్చు. ఇక్కడ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా చూడడంలో ఎన్నికల సంఘం యొక్క పాత్రను మనం పరిశీలిస్తాం.

AP SCERT

## 3.1.ఎన్నికలు ఎందుకు?



ఎక్కువ మంది తమ ఎన్నికల వాగ్దానాలను నెరవేరుస్తున్నారా?

### హర్యానాలో శాసనసభ ఎన్నికలు

అర్ధరాత్రి దాటిపోయింది. ఒక పట్టణ కేంద్రంలో ప్రజా సమూహము ఎంతో ఉత్సుకతతో తమ నాయకుని రాక కొరకు ఎదురు చూస్తున్నారు. నాయకుడు ఏ క్షణంలోనైనా వస్తాడని నిర్వాహకులు పదే పదే హామీ ఇస్తున్నారు.ఆ మార్గం గుండా పోయే ఒక వాహనాన్ని చూసి సమూహంలో ఉన్న ప్రజలందరూ లేచి నిలుచున్నారు. నాయకుడు అక్కడికి చేరుకున్నాడనే ఆశ వారిలో కలిగింది. ఆతడే హర్యానా సంఘర్ష సమితి నాయకుడు శ్రీ దేవిలాల్. ఆ గురువారం రాత్రి అతను కర్నాల్‌లో ఒక బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడవలసి ఉంది 76 సంవత్సరాల వయసున్న నాయకుడు ఆ రోజులలో చాలా తీరిక లేకుండా ఉన్నాడు. అతను రోజును ఉదయం 8 గంటలకు ప్రారంభించి రాత్రి 11 గంటలకు ముగిస్తాడు. ఆ రోజు ఉదయం నుంచి అప్పటికే 9 బహిరంగ సభలకు హాజరయ్యారు. ఈవిధంగా గడచిన 23 నెలల నుంచి బహిరంగ సభలకు హాజరవుతూ ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు.

1987లో హర్యానాలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఒక వార్తాపత్రిక ఇచ్చిన నివేదిక ఇది. 1982 నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నది. అప్పటి ప్రతిపక్ష నాయకుడు చౌదరీ దేవిలాల్ 'న్యాయ్ యుద్ధ్' (న్యాయం కోసం పోరాటం) అనే ఉద్యమాన్ని నడిపించి, 'లోక్ దళ్' అనే కొత్త పార్టీని స్థాపించారు. ఎన్నికలలో అతని పార్టీ కాంగ్రెస్ వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేయడానికి ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసింది. తన పార్టీ ఎన్నికలలో గెలిస్తే రైతులు, చిన్న వ్యాపారస్తుల రుణాలను రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో దేవిలాల్ ప్రకటించారు. తన ప్రభుత్వం యొక్క మొదట చేసేపని ఇదేనని అతను వాగ్దానం చేసారు.

ఉన్న ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషంగా లేరు. వారు దేవిలాల్ వాగ్దానంతో ఆకర్షితులైనారు. ఎన్నికలు జరిగినప్పుడు ప్రజలు లోక్ దళ్ పార్టీ, దాని మిత్ర పక్షాలకు అనుకూలంగా పెద్ద ఎత్తున ఓటు వేశారు. లోక్ దళ్, దాని భాగస్వామ్య పార్టీలు రాష్ట్ర విధానసభలోని 90 స్థానాలలో 76 స్థానాలను గెలుచుకున్నాయి.లోక్ దళ్ స్వంతంగా 60స్థానాలు సాధించి శాసనసభలో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. కాంగ్రెస్ పార్టీ 5 స్థానాలను మాత్రమే గెలుచుకుంది.

ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత పదవిలో ఉన్న ముఖ్యమంత్రి రాజీనామా చేశారు. కొత్తగా ఎన్నికైన లోక్ దళ్ శాసనసభ్యులు దేవిలాల్‌ను తమ నాయకునిగా ఎన్నుకున్నారు. గవర్నర్ దేవిలాల్‌ను ముఖ్యమంత్రిగా ఆహ్వానించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మూడు రోజుల తర్వాత అతను ముఖ్యమంత్రి అయ్యాడు. ముఖ్యమంత్రి అయిన వెంటనే అతని ప్రభుత్వం చిన్న రైతులు, వ్యవసాయం కూలీలు, చిన్న వ్యాపారస్తులు బకాయిపడ్డ రుణాలను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అతని పార్టీ నాలుగు సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించింది. తదుపరి ఎన్నికలు 1991లో జరిగాయి. కానీ ఈసారి అతని పార్టీ ప్రజామద్దతును సాధించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**మీ పురోగతి పరిశీలించుకోండి**

జగదీప్, నవప్రీత్ ఈ కథను చదివి క్రింది నిర్ధారణకు వచ్చారు.ఈ క్రింది వానిలో ఏది సరైనదో ఏది కాదో చెప్పగలవా? (లేదా పై కథలో ఇచ్చిన సమాచారం వాటిని సరైనదో కాదో చెప్పడానికి సరిపోదా?)

- ఎన్నికలు ప్రభుత్వ విధానాలలో మార్పులకు దారితీయగలవు.
- గవర్నర్ దేవిలాల్ ఉపన్యాసాలకు ముగ్ధుడై అతనిని ముఖ్యమంత్రిగా ఆహ్వానించారు.
- పరిపాలించే పార్టీ పట్ల ప్రజలు సంతోషంగా లేరు, తదుపరి ఎన్నికలలో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసారు.
- ఎన్నికలలో గెలిచిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.
- హర్యానాలో ఈ ఎన్నికలు ఎంతో ఆర్థికాభివృద్ధికి దోహదం చేశాయి.
- ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత కూడా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సిన అవసరం లేదు.

AP SCERT

## కృత్యం

మీ రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగాయో మీకు తెలుసా? మీ ప్రాంతంలో గత 5 సంవత్సరాలలో జరిగిన ఇతర ఎన్నికలు ఏవి? ఎన్నికలు (జాతీయ, అసెంబ్లీ, పంచాయితీ మొదలగునవి) ఎప్పుడు జరిగాయి? మీ ప్రాంతం నుంచి ఎన్నికైన వ్యక్తిపేరు, అతని హోదాను రాయండి.(పార్లమెంట్ సభ్యులు / శాసనసభ్యులు)

## మనకు ఎన్నికలు ఎందుకు అవసరం?

ఎన్నికలు ఏ ప్రజాస్వామ్యంలోనైనా క్రమబద్ధంగా నిర్ణీతకాలంలో జరుగుతాయి. ప్రపంచంలో వందకు పైగా దేశాలలో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవడానికి ఎన్నికలు జరుగుతాయి. ప్రజాస్వామ్య దేశాలు కాని దేశాలలో కూడా ఎన్నికలు జరుగుతాయని మనం చదువుకున్నాము.

అయితే మనకు ఎన్నికలు ఎందుకు అవసరము? ఎన్నికలు లేని ప్రజాస్వామ్యమును ఊహించడానికి ప్రయత్నిద్దాం. ప్రజలందరూ ప్రతిరోజూ ఒకచోట కూర్చొని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటే ఎన్నికలు లేకుండా ప్రజా పరిపాలన సాధ్యమవుతుంది. విశాలమైన సమాజంలో అది సాధ్యపడదని మనం మొదటి అధ్యాయంలో తెలుసుకున్నాం. ప్రతి ఒక్కరికీ అన్ని విషయాల మీద కూర్చొని నిర్ణయాలు తీసుకోవడానికి తగిన సమయం, పరిజ్ఞానం లేనందున సాధ్యపడదు. కావున అత్యధిక ప్రజాస్వామ్య దేశాలలో ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా పరిపాలన చేసుకుంటారు.

ఎన్నికలు లేకుండా ప్రజా ప్రతినిధులను ఎంపిక చేయడానికి ఏదైనా ప్రజాస్వామ్యయుతమైన విధానం ఉందా? అనుభవం, వయస్సు ప్రాతిపదికగా ప్రతినిధులను ఎంపిక చేయబడే ప్రదేశం ఒకటి ఉన్నదని ఊహిద్దాం లేదా వారు విద్య, జ్ఞానం ఆధారంగా ఎంపిక చేయబడే ప్రదేశాన్ని ఊహిద్దాం. ఎవరు ఎక్కువ జ్ఞానాన్ని, అనుభవాన్ని కలిగి ఉన్నారనే విషయాన్ని నిర్ణయించడం కష్టంగా ఉంటుంది. ప్రజలు ఈ సమస్యను పరిష్కరించుకొంటారని మనము అనుకుందాం. అలాంటి ప్రదేశం ఎక్కడైనా ఉంటే అక్కడ ఎన్నికలు అవసరం లేదు. అయితే ఈ ప్రదేశాన్ని మనం ప్రజాస్వామ్యం అనవచ్చా? ప్రజలు తమ ప్రతినిధులను ఇష్టపడుతున్నారో లేదో ఎలా తెలుసుకోవచ్చు? ప్రజల అభీష్టం మేరకు ప్రజాప్రతినిధులు పరిపాలించేలా మనం ఎలా చేయగలం? ప్రజలు ఇష్టపడని వారిని తమ ప్రతినిధులుగా కొనసాగకుండా మనం ఎలా చూడగలం? ప్రజలు తమ ప్రతినిధులను నిర్ణీతకాలంలో ఎన్నుకోవడానికి, వారు కోరుకుంటే మార్చుకోవడానికి ఒక యంత్రాంగం అవసరం. ఈ యంత్రాంగాన్ని ఎన్నికలు అంటారు. కావున ప్రస్తుత కాలంలోని ఏ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలోనైనా ఎన్నికలు తప్పనిసరి.

ఎన్నికల్లో ఓటర్లు అనేక ఎంపికలను చేసుకుంటారు.

- వారు తమకోసం చట్టాలు చేసేవారిని ఎంపిక చేసుకుంటారు.
- ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే వారిని, ముఖ్య నిర్ణయాలు తీసుకునే వారిని ఎంపిక చేసుకుంటారు.
- ఏ పార్టీ విధానాలు ప్రభుత్వాన్ని, శాసనాలు చేయడాన్ని నిర్ధారిస్తాయో ఆ పార్టీని ఎన్నుకుంటారు.



ప్రజాస్వామ్య దేశాలకు ఎన్నికలు ఎందుకు అవసరమో మనం చూశాము. కానీ ప్రజాస్వామ్యం లేని దేశాలలో పాలకులు ఎన్నికలను ఎందుకు నిర్వహిస్తారు?

## ఒక ఎన్నికను ప్రజాస్వామ్యయుతంగా చేసేది ఏది?

ఎన్నికలు అనేక విధాలుగా జరుగుతాయి. ప్రజాస్వామ్య దేశాలన్నీ ఎన్నికలను నిర్వహిస్తాయి. అయితే ప్రజాస్వామ్యం కాని దేశాలలో కూడా కొన్ని రకాలైన ఎన్నికలు నిర్వహించుకుంటాయి. ప్రజాస్వామ్యంలోని ఎన్నికలకు, ఇతర ఎన్నికలకు బేధాన్ని ఎలా గుర్తించవచ్చు? మొదటి అధ్యాయంలోనే ఈ ప్రశ్న గురించి క్లుప్తంగా చర్చించాం. ఎన్నికలు జరిగే చాలా దేశాలను ఉదాహరణలుగా చర్చించాం. కానీ వాటి అన్నింటినీ ప్రజాస్వామ్య ఎన్నికలు అనలేము. మనం ఏమి నేర్చుకున్నామో ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకొని ప్రజాస్వామ్య ఎన్నికలకు అవసరమైన కనీస పరిస్థితులను గుర్తిద్దాం.

- మొదటది: ప్రతి ఒక్కరూ ఎంపిక చేసుకోగలిగేలా ఉండాలి. దీని అర్థం ఏమంటే ప్రతి ఒక్కరికీ ఒక ఓటు ఉండాలి, ప్రతి ఓటుకు సమానమైన విలువ ఉండాలి.

AP SCERT

- రెండవది: దేని నుంచి ఎంపిక చేసుకోవాలో స్పష్టంగా ఉండాలి. పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికలలో పోటీ చేయడానికి స్వేచ్ఛ ఉండాలి, ఓటర్లకు నిజమైన ఎంపిక కోసం స్వేచ్ఛ ఇవ్వాలి.
- మూడవది: ఎంపిక నిర్ణీత కాలవ్యవధులలో ఇవ్వాలి. ప్రతి నిర్ణీతకాలం తరువాత క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించాలి.
- నాలుగవది: ప్రజలు ఎంపిక చేసుకున్న వ్యక్తి తప్పనిసరిగా ఎన్నుకోబడాలి.
- ఐదవది: ప్రజలు వాస్తవంగా కోరుకున్న వారిని ఎంపిక చేసుకునేలా ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయ బద్ధంగా జరగాలి.

ఇవన్నీ చాలా తేలికగా, సులభమైన పరిస్థితుల లాగా కనిపించవచ్చు. అయితే ఈ పరిస్థితులు కూడా లేని దేశాలు చాలా ఉన్నాయి. ఈ అధ్యాయంలో పై పరిస్థితులను మన దేశంలో జరుగుతున్న ఎన్నికలకు అన్వయించి వాటిని ప్రజాస్వామ్య ఎన్నికలు అనవచ్చా అనే విషయాన్ని పరిశీలిద్దాం.

## రాజకీయ పరమైన పోటీ ఉండడం మంచిదేనా?

ఎన్నికలు పై విధంగా రాజకీయ పరమైన పోటీని తెలియజేస్తాయి. ఈ పోటీ పలు రూపాలలో ఉంటుంది. వాటిలో రాజకీయ పార్టీలకు మధ్య ఉండే పోటీ చాలా స్పష్టంగా ఉంటుంది. ఎన్నికలు నియోజకవర్గ స్థాయిలో చాలామంది అభ్యర్థుల మధ్య పోటీని తీసుకువస్తాయి. వారి మధ్య పోటీ లేకపోతే ఎన్నికలకు ఎటువంటి అర్థం ఉండదు.

అయితే రాజకీయ పరమైన పోటీ ఉండడం మంచి దేనా? ఎన్నికల పోటీ కొన్ని లోపాలను స్పష్టంగా కలిగిఉంది. ఇది ప్రతి ప్రాంతంలో వర్గ పోరును, అనైక్యతను సృష్టిస్తుంది. మీ ప్రాంతంలో పార్టీ రాజకీయాల గురించి ప్రజలు తరచుగా ఫిర్యాదు చేయడాన్ని వింటూ ఉంటారు. వివిధ రాజకీయ పార్టీలు, నాయకులు తరచుగా ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటారు. పార్టీలు, అభ్యర్థులు ఎన్నికలలో గెలవడానికి చవకబారు జిమ్మిక్కులను ఉపయోగిస్తుంటారు. ఎన్నికల పోటీలో ఈ విధమైన ఒత్తిడి దీర్ఘకాలిక విధానాలను తయారు చేయుటలో ఉపయోగపడదని కొంతమంది ప్రజల అభిప్రాయం. దేశానికి సేవ చేయాలనుకునే కొంతమంది మంచి వ్యక్తులు ఈ రంగంలోకి ప్రవేశించుటలేదు. అనారోగ్యకరమైన పోటీలోకి నెట్టబడతామనే ఆలోచనలతో చాలామంది దీనిని ఇష్టపడటం లేదు.

మన రాజ్యాంగ నిర్మాతలకు ఈ సమస్యలు గురించి అవగాహన ఉంది. అయినప్పటికి వారు ఎన్నికలలో భవిష్యత్ నాయకులను ఎంపిక చేసుకోవడానికి స్వేచ్ఛాయుత పోటీనే కోరుకున్నారు. దీర్ఘకాలంలో ఈ వ్యవస్థ బాగా పని చేయడానికే వారు అలా చేశారు. ఆదర్శ ప్రపంచంలో రాజకీయ నాయకులు ప్రజలకు ఏది మంచో తెలుసుకుని, ప్రజలకు సేవ చేయాలనే తపనతో ప్రభావితులవుతూ ఉంటారు. రాజకీయ పరమైన పోటీ అలాంటి ఆదర్శ ప్రపంచంలో అవసరం లేదు. అయితే వాస్తవ జీవితంలో అలా జరగటం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులు మిగిలిన వృత్తి నిపుణుల వలె తమ రాజకీయ జీవితాన్ని ముందుకు తీసుకెళ్ళాలనే తపనతోఉన్నారు. వారు అధికారాన్ని సంపాదించాలని లేదా అధికారంలోనే ఉండాలని, హోదాలను తామే అనుభవించాలని కోరుకుంటారు. ప్రజలకు సేవ చేయాలని కూడా వారు కోరుకోవచ్చు. అయితే ఇది వారియొక్క స్వభావంపై పూర్తిగా ఆధారపడిఉండుట ప్రమాదకరంగా ఉంటుంది. ప్రజలకు ఎప్పుడు సేవ చేయాలనిపిస్తే అప్పుడు వారికి ఏమి చేయాలో తెలియకపోవచ్చు లేదా ప్రజలు వాస్తవంగా ఏమి కోరుకుంటున్నారనే దానితో వారి ఆలోచనలు కలవకపోవచ్చు.

ఈ రకమైన వాస్తవ జీవన పరిస్థితిని ఎలా చక్కదిద్ద వచ్చు? రాజకీయ నాయకుల యొక్క జ్ఞానాన్ని, ప్రవర్తనను మెరుగుపరచడం అనేది ఒక మార్గం. ప్రజలకు సేవ చేసే రాజకీయ నాయకులను గౌరవించడం, చేయని వారిని శిక్షించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడం మరొక ఆచరణాత్మక మార్గం. బహుమతులను, శిక్షలను ఎవరు నిర్ణయిస్తారు? దానికి సులువైన సమాధానం: ప్రజలు. ఎన్నికల పోటీ ఏమి చేస్తుందో అదే ఇది. నిర్ణీత కాలంలో జరిగే ఎన్నికల పోటీలు రాజకీయ పార్టీలకు, నాయకులకు ప్రోత్సాహకాలను అందిస్తాయి. ప్రజలు లేవనెత్తాలనుకున్న సమస్యలను తాము లేవనెత్తితే ప్రజాదరణ పొంది తరువాత ఎన్నికలలో వారు గెలిచే అవకాశాలు పెరుగుతాయని రాజకీయ నాయకులకు తెలుసు. అయితే తాము చేసే పనులతో ఓటర్లను తృప్తి పరుచుటలో విఫలమైతే వారు మరొకసారి గెలవలేరు.



ఆహా! ఎన్నికలు పరీక్షలు లాంటివి. అందులో రాజకీయ నాయకులు, పార్టీలు ఉత్తీర్ణులవుతారో లేదా ఫెయిలవుతారో తెలిసిపోతుంది. కానీ పరీక్షలు పెట్టేదెవరు?

AP SCERT

ఒక రాజకీయ పార్టీ కేవలం అధికారంలో ఉండాలనే బలమైన కోరికతో ఉంటే అది తప్పనిసరిగా ప్రజలకు సేవ చేయాల్సి ఉంటుంది. మార్కెట్ ఎలా పనిచేస్తుందో ఇది కూడా అంతే. ఒక షాపు యజమానికి తన లాభంపైనే ఆసక్తి ఉంటే వినియోగదారులకు మంచి సేవలు అందించాల్సి ఉంటుంది. అలా అతను చేయకపోతే వినియోగదారుడు వేరే దుకాణానికి వెళ్ళిపోతాడు. అదే విధంగా రాజకీయ పోటీ కొన్ని విభజనలను సృష్టించడానికి, కొంత వికృత తత్వానికి కారణమవ్వచ్చు. అయితే ఇది రాజకీయ పార్టీలను, నాయకులను ప్రజలకు అంతిమంగా సేవ చేసేలా చేస్తుంది.

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**







పై రెండు వ్యంగ్య చిత్రాలను జాగ్రత్తగా చదువండి. ప్రతిదానిలో ఉన్న సందేశాన్ని మీ సొంతమాటల్లో వ్రాయండి. మీ ప్రాంతంలో ఈ రెండు సందేశాలలో ఏది వాస్తవానికి దగ్గరగా ఉంది అనే దానిపై తరగతి గదిలో చర్చించండి. ఓటర్లకు రాజకీయ నాయకులకు మధ్య సంబంధాన్ని ఎన్నికలు ఎలా ప్రభావితం చేస్తాయో తెలియజేసే వ్యంగ్య చిత్రాన్ని గీయుండి.

## 3.2 మన ఎన్నికల విధానం ఏమిటి?

భారతదేశంలో ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధమైనవని మనం చెప్పగలమా? ఈ ప్రశ్నకు సమాధానంగా భారతదేశంలో ఎన్నికలు ఎలా జరుగుతాయో పరిశీలిద్దాం. ప్రతీ ఐదు సంవత్సరాల తరువాత లోక్ సభ, విధానసభ(అసెంబ్లీ)లకు ఎన్నికలు క్రమబద్ధంగా నిర్వహిస్తారు. 5 సంవత్సరాల తరువాత ఎన్నికైన ప్రజా ప్రతినిధులందరి **పదవీకాలం** ముగుస్తుంది. లోక్‌సభ లేదా విధాన సభ రద్దు చేయబడుతుంది. అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలు ఒకే రోజున గానీ కొద్ది రోజుల వ్యవధిలో గానీ జరుగుతాయి. వీటిని సాధారణ ఎన్నికలు అంటారు. కొన్ని సందర్భాలలో సభ్యుడు మరణించుట వలన లేదా రాజీనామా చేయుట వలన ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేయుటకు ఒక నియోజకవర్గంలో ఎన్నిక జరుగుతుంది. దీనినే ఉప ఎన్నిక అంటారు. ఈ అధ్యాయంలో మనము సాధారణ ఎన్నికలు గురించి తెలుసుకుందాం.

### ఎన్నికల నియోజకవర్గాలు

హర్యానాలో ప్రజలు 90 మంది శాసనసభ్యులను ఎన్నుకొన్న విషయాన్ని నీవు చదివావు. అది ఎలా జరిగిందా అని నీవు ఆశ్చర్యపోవచ్చు. హర్యానాలో ఉన్న ప్రతీ వ్యక్తి 90 మంది శాసనసభ్యులకు ఓటు వేశారా? బహుశా అలా జరగదని నీకు తెలిసే ఉంటుంది. మనదేశంలో ఒక ప్రాంత ఆధారిత ప్రాతినిధ్య వ్యవస్థను మనం అనుసరిస్తున్నాం. ఎన్నికల కొరకు దేశాన్ని అనేక ప్రాంతాలుగా విభజిస్తారు. వీటినే ఎన్నికల నియోజకవర్గాలుగా పిలుస్తారు. ఆ ప్రాంతంలో ఉండే వ్యక్తులు ఒక ప్రతినిధిని ఎన్నుకుంటారు.

AP SCERT

లోక్ సభ ఎన్నికల కొరకు దేశాన్ని 543 నియోజక వర్గాలుగా విభజించారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఎన్నికైన ప్రతినిధిని పార్లమెంట్ సభ్యుడు లేదా ఎం.పి. గా పిలుస్తారు. ప్రతి ఓటు సమానమైన విలువ కలిగి ఉండటం ప్రజాస్వామ్య లక్షణాలలో ఒకటి. అందువలనే భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి నియోజకవర్గంలో ఇంచుమించుగా సమానమైన జనాభా నివసిస్తూ ఉంటారు.

అదేవిధంగా ప్రతి రాష్ట్రం కొన్ని నిర్దిష్టమైన సంఖ్యలో శాసనసభ నియోజకవర్గాలుగా విభజించ బడి ఉంటుంది. ఇక్కడ ఎన్నికైన ప్రతినిధిని శాసన సభ్యుడు లేదా ఎమ్.ఎల్.ఏ గా పిలుస్తారు.

ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో చాలా శాసనసభ నియోజకవర్గాలు ఉంటాయి. పంచాయితీ,పురపాలక ఎన్నికలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రతి గ్రామాన్ని, పట్టణాన్ని నియోజకవర్గాల మాదిరిగా అనేక 'వార్డులు'గా విభజిస్తారు. గ్రామంలోనైనా, పట్టణములోనైనా ప్రతి వార్డు ఒక సభ్యుణ్ణి ఎన్ను కుంటుంది. ఒక్కోసారి ఈ నియోజకవర్గాలనే 'స్థానాలు'గా పరిగణిస్తారు. ఎందుకంటే ప్రతి నియోజక వర్గం శాసనసభకు ఒక స్థానాన్ని కలిగి ఉంటుంది. హర్యానాలో లోక్‌దళ్ 60 స్థానాలు గెలిచింది అని చెప్పినప్పుడు హర్యానాలో రాష్ట్ర శాసనసభలో లోక్‌దళ్ అభ్యర్థులు 60 శాసనసభ నియోజవర్గాలలో గెలిచారని అర్థం. ఈ విధంగా రాష్ట్ర శాసనసభలో లోక్‌దళ్ 60 మంది శాసనసభ్యులను కలిగి ఉన్నది.

### గుల్బర్గా లోక్ సభ నియోజకవర్గం




### కర్నాటక లోని గుల్బర్గా (కలబురగి) జిల్లా




- గుల్బర్గా లోక్‌సభ నియోజకవర్గ సరిహద్దులు మరియు గుల్బర్గా (కలబురగి) జిల్లా సరిహద్దులు ఒకే రకంగా ఎందుకు లేవు? మీ లోక్‌సభ నియోజక వర్గానికి సంబంధించిన ఇలాంటి మాన చిత్రాన్ని గీయుము.
- గుల్బర్గా లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్ని అసెంబ్లీ స్థానాలు కలవు? మీ నియోజకవర్గంలో కూడా అన్నే స్థానాలు ఉన్నాయా?

AP SCERT

## రిజర్వ్ నియోజకవర్గాలు

మన రాజ్యాంగం ప్రతి పౌరునకు అతను/ఆమె యొక్క ప్రతినిధిని ఎన్నుకోవడానికి లేదా తామే ప్రతినిధులుగా ఎన్నుకోబడడానికి హక్కును కల్పిస్తుంది. అయితే అందరితో పాటు బహిరంగ ఎన్నికల పోటీలో కొన్ని బలహీన వర్గాలకు లోక్ సభలో కానీ, రాష్ట్ర శాసనసభలో కానీ సరైన అవకాశం రాకపోవచ్చని రాజ్యాంగ నిర్మాతలు ఆందోళన చెందారు. వారికి ఎన్నికలలో పోటీ చేసి ఇతరులపై గెలవడానికి అవసరమైన వనరులు, విద్య, పరిచయాలు లేకపోవచ్చు. బాగా పలుకుబడి, వనరులు ఉన్నవారు అలాంటి వారిని గెలవనీయకుండా అడ్డుకోవచ్చు. అదేగనుక జరిగితే మన పార్లమెంట్, విధాన సభలలో మన జనాభాలో ప్రముఖ వర్గపు వాణిని వినిపించడానికి స్థానం లేకుండా పోతుంది. అది మన ప్రజాస్వామ్యాన్ని తక్కువ ప్రాతినిధ్యం వహించేదిగానూ మరియు బలహీన ప్రజాస్వామ్యయుతంగానూ చేస్తుంది.

కావున మన రాజ్యాంగ నిర్మాతలు బలహీన వర్గాలకు రిజర్వ్ నియోజకవర్గాలను కేటాయించే ప్రత్యేక విధానము గురించి ఆలోచన చేశారు. కొన్ని నియోజకవర్గాలను షెడ్యూల్డ్ కులాల(SC) వారికి, షెడ్యూల్డ్ తెగల (ST) వారికి ప్రత్యేకంగా కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలకు కేటాయించిన నియోజకవర్గంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారే అభ్యర్థిగా నిలబడాలి. అదేవిధంగా షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేసిన నియోజకవర్గంలో షెడ్యూల్డ్ తెగలకు చెందినవారే పోటీ చేయాలి. ప్రస్తుత లోక్ సభలో 84 నియోజకవర్గాలు షెడ్యూల్డ్ కులాలు వారికి 47 స్థానాలు షెడ్యూల్డ్ తెగల వారికి (జనవరి 26, 2019 నాటికి) కేటాయించారు. ఈ సంఖ్య మొత్తం జనాభాలో వారికి కేటాయించిన వాటా నిష్పత్తికి అనుగుణంగా ఉన్నది. ఈ విధంగా షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారికి న్యాయబద్ధంగా కేటాయించిన స్థానాలను ఏ ఇతర సామాజికవర్గం వారు పొందలేరు.

ఈ రిజర్వేషన్ విధానమును తరువాత కాలంలో జిల్లా, స్థానిక స్థాయిలలో ఇతర బలహీన వర్గాలకు కూడా విస్తరించారు. చాలా రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంతాలలో (పంచాయతీలు), పట్టణ ప్రాంతాలు (పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు)లోని స్థానిక సంస్థలలో ఇతర బలహీన వర్గాల (ఓ.బి.సి.) వారికి స్థానాలను ప్రత్యేకంగా కేటాయించారు. అయినప్పటికీ ప్రత్యేకంగా కేటాయించిన స్థానాల సంఖ్య ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి తేడా ఉంటుంది. అదేవిధంగా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో 3 వంతులలో 1 వంతు స్థానాలు స్త్రీలకు ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది.

## ఓటర్ల జాబితా

నియోజకవర్గాలు ఒకసారి నిర్ణయించబడిన తరువాత ఎవరు ఓటు వేయాలి, ఎవరు ఓటు వేయకూడదు అని నిర్ణయించడం తదుపరి చర్య అవుతుంది. ఈ నిర్ణయాన్ని చివరిరోజు వరకు ఎవరికీ వదిలి వేయరాదు. ప్రజాస్వామ్యంలోని ఎన్నికలలో అర్హులైన ఓటర్ల జాబితాను ఎన్నికలకు ముందే తయారు చేసి ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి. ఈ జాబితానే అధికారికంగా ఎన్నికల జాబితా అంటారు. సాధారణంగా దీనిని ఓటర్ల జాబితాగా పిలుస్తాం.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు ఓటర్ల జాబితాను అనుసంధానించడం ముఖ్యమైన చర్యగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ ప్రతినిధులను ఎన్నుకోవడానికి సమాన అవకాశం కలిగి ఉండాలి. సార్వత్రిక వయోజన ఓటుహక్కు గురించి మనము ముందే చదువుకున్నాం. ఆచరణలో దీని అర్థం ప్రతి ఒక్కరూ ఒక ఓటు కలిగి ఉండడం, అదేవిధంగా ప్రతి ఓటుకు ఒకే విలువ ఉండడం. సరైన కారణం లేకుండా ఎవరి ఓటుహక్కు నిరాకరించరాదు. పౌరులు వేర్వేరు విధాలుగా ఉండవచ్చు. కొందరు ధనవంతులుగా ఉంటారు. కొందరు పేదవారుగా ఉంటారు. కొందరు ఉన్నత విద్యావంతులుగా ఉంటారు. కొందరు అంత విద్యావంతులు కాక పోవచ్చు లేదా కొందరికి అసలు విద్య ఉండక పోవచ్చు. కొందరు సాధు స్వభావం కలవారుగా ఉంటారు. ఇతరులు అదేవిధంగా ఉండకపోవచ్చు. అయితే అందరూ సొంత అభిప్రాయాలు, అవసరాలు కలిగి ఉన్న వ్యక్తులే. అందువలన వారిపై ప్రభావాన్ని చూపే నిర్ణయాలపై తమ అభిప్రాయాన్ని సమానంగా చెప్పేందుకు వారంతా అర్హత కలిగి ఉన్నారు.

మన దేశంలో 18 సంవత్సరాలు, ఆపైన వయసు గల వ్యక్తులందరూ ఓటు వేయడానికి అర్హులే. ప్రతి పౌరునికి కులం, మతం, లింగంతో సంబంధం లేకుండా ఓటు హక్కు ఉంది. నేరస్థులు, మానసిక ఆరోగ్యం సరిగా లేని వారికి అరుదైన



నారీ శక్తి వందన్ అధినియం, 2023 (మహిళా రిజర్వేషన్ చట్టం 2023) ప్రకారం, పంచాయితీల మాదిరిగానే పార్లమెంటు మరియు శాసనసభలలో కూడా మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయబడ్డాయని మీకు తెలుసా?

AP SCERT

## లోక్ సభ నియోజకవర్గాలు

| | | |
|---|---|---|
| మొత్తం నియోజకవర్గాలు | | 543 |
| సాధారణ | (తెలుపు) | 412 |
| రిజర్వ్‌డ్ (షెడ్యూల్డ్ కులాలు) | (ఎరుపు) | 84 |
| రిజర్వ్‌డ్ (షెడ్యూల్డ్ తెగలు) | (ఆకుపచ్చ) | 47 |



భారత ఎన్నికల సంఘం

| రాష్ట్రాలు | నియోజకవర్గాలు |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 25 |
| అరుణాచల్ ప్రదేశ్ | 2 |
| అస్సాం | 14 |
| బీహార్ | 40 |
| చత్తీస్‌ఘర్ | 11 |
| గోవా | 2 |
| గుజరాత్ | 26 |
| హర్యానా | 10 |
| హిమాచల్ ప్రదేశ్ | 4 |
| జార్ఖండ్ | 14 |
| కర్ణాటక | 28 |
| కేరళ | 20 |
| మధ్యప్రదేశ్ | 29 |
| మహారాష్ట్ర | 48 |
| మణిపూర్ | 2 |
| మేఘాలయ | 2 |
| మిజోరం | 1 |
| నాగాలాండ్ | 1 |
| ఒడిస్సా | 21 |
| పంజాబ్ | 13 |
| రాజస్థాన్ | 25 |
| సిక్కిం | 1 |
| తమిళనాడు | 39 |
| తెలంగాణ | 17 |
| త్రిపుర | 2 |
| ఉత్తరప్రదేశ్ | 80 |
| ఉత్తరాఖండ్ | 5 |
| పశ్చిమ బెంగాల్ | 42 |

| కేంద్రపాలిత ప్రాంతాలు | |
|---|---|
| అండమాన్, నికోబార్ దీవులు | 1 |
| ఛండీగర్ | 1 |
| దాద్రా, నగర్ హవేలి | 1 |
| డామన్, డయు | 1 |
| ఢిల్లీ | 7 |
| జమ్ము & కాశ్మీర్ | 5 |
| లడక్ | 1 |
| లక్షద్వీప్ | 1 |
| పుదుచ్చేరి | 1 |

భారతదేశ పటాన్ని చూసి, ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయుము.

- మీ రాష్ట్రంలో, మీ సమీపంలోని రెండు పొరుగు రాష్ట్రాలలోని లోక్ సభ నియోజకవర్గాల సంఖ్య ఎంత?
- ఏ రాష్ట్రాలు ముప్పై కన్నా ఎక్కువ లోక్ సభ స్థానాలు కలిగి ఉన్నాయి?
- కొన్ని రాష్ట్రాలలో ఎక్కువ సంఖ్యలో లోక్ సభ నియోజకవర్గాలు ఎందుకు ఉన్నాయి?
- కొన్ని నియోజకవర్గాలు వైశాల్యంలో ఎందుకు పెద్దవి, మరికొన్ని ఎందుకు చిన్నవి?
- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కేటాయించిన నియోజకవర్గాలు దేశమంతటా విస్తరించి ఉన్నాయా లేదా కొన్ని ప్రాంతాలలోనే ఎక్కువగా ఉన్నాయా?

సందర్భాలలో మాత్రమే ఓటు హక్కును నిరాకరించవచ్చు. అర్హతలు గల ఓటర్లు అందరినీ ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ప్రభుత్వం యొక్క బాధ్యత. కొత్తగా నిర్ణీత వయసు వచ్చిన వారందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలి. వేరే ప్రాంతానికి వెళ్ళిన వారిని, చనిపోయిన వారందరినీ తొలగించాలి. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పూర్తిగా మార్పులు, చేర్పులతో సరికొత్త ఓటర్ల జాబితా ఉండేలా చూడాలి. గత కొద్ది సంవత్సరాలు నుంచి ఎన్నికల ఫోటో గుర్తింపుకార్డు (**EPIC**) విధానం ప్రవేశపెట్టబడినది. ఓటర్ల జాబితాలో ఓటు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ కార్డును ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఓటు వేయడానికి వెళ్ళేటప్పుడు ఓటర్లు ఈ కార్డును తమతో పాటు తీసుకొని వెళ్ళాలి. తద్వారా ఒకరి ఓటును వేరొకరు వేయుట జరగదు. అయితే ఓటు వేయడానికి ఈ కార్డు తప్పనిసరి కాదు. ఓటు వేయడానికి రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు గుర్తింపును నిరూపించే ఇతర పత్రాలను చూపించ వచ్చు.

## అభ్యర్థులు నామినేషన్ వేయుట

ప్రజాస్వామ్య ఎన్నికలలో ప్రజలకు నిజంగా ఎంపిక చేసుకొనే అవకాశం ఉన్నదనే విషయాన్ని మనం పై అంశాల ద్వారా గమనించాం. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎవరికీ ఎటువంటి ఆంక్షలు లేనప్పుడే ఇది సాధ్యమవుతుంది. మన వ్యవస్థ మనకు ఈ అవకాశాన్ని కల్పించింది. ఎవరైతే ఓటరు అవుతారో వారు ఎన్నికలలో అభ్యర్థి కూడా కావచ్చు. తేడా ఏమిటంటే అభ్యర్థి కావాలంటే కనీస వయసు 25 సంవత్సరాలు నిండి ఉండాలి. ఓటరు కావాలంటే 18 సంవత్సరాలు ఉంటే సరిపోతుంది. నేరస్థుల మీద కొన్ని రకాలైన ఇతర ఆంక్షలు ఉన్నాయి. అయితే కొన్ని అతి తీవ్రమైన కేసులకు మాత్రమే ఇవి వర్తిస్తాయి. రాజకీయ పార్టీలు తమ పార్టీ మద్దతు, గుర్తు పొందే అభ్యర్థులను పోటీలో నిలబెడతాయి. ఈ విధంగా పార్టీ తరపున నామినేషన్ పొందడాన్ని **పార్టీ టిక్కెట్టు** అంటారు.

ఎన్నికలలో పోటీ చేయాలనుకున్న ప్రతి వ్యక్తి 'నామినేషన్ పత్రాన్ని' తప్పనిసరిగా పూర్తి చేసి, కొంత డబ్బును 'సెక్యూరిటీ డిపాజిట్' గా చెల్లించాలి. సుప్రీంకోర్టు యొక్క ఆదేశానుసారం ధృవీకరణ ప్రకటన ఇవ్వడం అనే కొత్త విధానం అమలులోకి వచ్చింది. ప్రతి అభ్యర్థి ఈ క్రింది పూర్తి వివరాలతో కూడిన చట్టపరమైన ధృవీకరణ ప్రకటన ఇవ్వాలి:

- అభ్యర్థిపై పెండింగులో ఉన్న తీవ్రమైన క్రిమినల్ కేసుల గురించి
- అభ్యర్థి మరియు అతను/ఆమె కుటుంబం యొక్క ఆస్తులు, అప్పులకు సంబంధించిన వివరాలు
- అభ్యర్థి యొక్క విద్యార్హతలకు సంబంధించిన వివరాలు

ఈ సమాచారాన్ని తప్పనిసరిగా అందరికీ తెలియ జేయాలి. అభ్యర్థి ఇచ్చే ఈ సమాచారం ఆధారంగా ఓటర్లకు అతని గురించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించబడింది.

### అభ్యర్థుల విద్యార్హతలు

దేశంలో ఏదైనా ఉద్యోగం చేయడానికి ఏదో ఒక విద్యార్హతలు అవసరమైనప్పుడు ముఖ్యమైన పదవులు నిర్వహించే వారికి విద్యార్హతలు ఎందుకు అవసరం లేదు?

- అన్ని రకాలైన ఉద్యోగాలకు విద్యార్హతలతో పని లేదు. ఉదాహరణకు భారత క్రికెట్ జట్టులోకి ఎంపిక కావడానికి డిగ్రీలు ఉన్నంత మాత్రాన సరిపోదు. క్రికెట్ ఆడే సామర్థ్యం ఉంటే సరిపోతుంది. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులకు ప్రజల యొక్క ఆందోళనలు, సమస్యలు అర్థం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండి, వారి అభిరుచులకు ప్రాతినిధ్యం వహించడమే తగిన అర్హత అవుతుంది. వారు అలా చేయగలుగుతున్నారా లేదా అనే విషయాన్ని లక్షల మంది పరీక్షకులు ప్రతి ఐదేళ్లకో సారి పరీక్ష చేస్తుంటారు.
- ఒకవేళ విద్య అవసరం అనుకుంటే విద్యార్హతలకు ఎంత ప్రాధాన్యత ఇస్తారు అనే విషయాన్ని ప్రజలకే వదిలి వేయాలి.
- మన దేశంలో ఒక విద్యార్హత పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. దానితోపాటు ఇంకో కారణం కూడా ఉంది. అది ఎక్కువమంది దేశ పౌరులకు ఎన్నికలలో పోటీ చేసే హక్కును లేకుండా చేస్తుంది. ఉదాహరణకు బి.ఏ, బి.కామ్, బి.యస్సి వంటి డిగ్రీని అభ్యర్థులకు తప్పనిసరి చేస్తే 90శాతం మంది పైగా పౌరులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులవుతారు.



అభ్యర్థులు తమ ఆస్తికి సంబంధించిన సవివరమైన ప్రకటనను ఎందుకు ఇవ్వాల్సి వస్తుంది?

AP SCERT

## ELECTORAL ROLL -2018 STATE (S16) మిజోరం

| No. Name and Reservation Status of Assembly Constituency : | 7 - TUIVAWL (ST) | Part Number 14 |
|---|---|---|
| No. Name and Reservation Status of Parliamentary Constituency (ies) in which the assembly constituency is located : | 1 - MIZORAM (ST) | |

### 1 . DETAILS OF REVISION

Year of Revision : 2018
Qualifying Date : 01/01/2019
Type of Revision : Special Summary Revision
Date of Publication : 28/12/2018

**Roll Identification:**

Basic Roll of Intensive Revision, 2005 integrated with all supplements preceeding Special Summary Revision, 2019

### 2 . DETAILS OF PART AND POLLING AREA

No. & Name of Sections in the part :

1 Vervek

| | | |
|---|---|---|
| **Main Village/Town** | : | **VERVEK** |
| **PostOffice** | : | **DARLAWN** |
| **Block** | : | **DARLAWN** |
| **PoliceStation** | : | **SAKAWRDAI** |
| **Subdivision** | : | **SAKAWRDAI** |
| **District** | : | **AIZAWL** |
| **Pincode** | : | **796111** |

### 3 . POLLING STATION DETAILS

| No. and Name of Polling Station : | 14VERVEK | Type of Polling Station (Male/Female/General) | General |
|---|---|---|---|
| Address of Polling Station : | Govt. Primary School, Village Name :VERVEK Post Office :DARLAWN District:AIZAWL | Number of Auxiliary Polling Stations in this part : | 0 |

### 4 . NUMBER OF ELECTORS

| Starting Serial No. | Ending Serial No. | Net Electors | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Male | With Photo | Without Photo | Female | With Photo | Without Photo | Total | With Photo | Without Photo |
| 1 | 181 | 93 | 93 | 0 | 88 | 88 | 0 | 181 | 181 | 0 |

AP SCERT

Assembly constituency 7 - TUIVAWL Part No. - 14

Section No. & Name: 1 Vervek District - AIZAWL PIN- 796111

| | | |
|---|---|---|
| 1 KDJ0178376<br>Name : Lawrkhuma<br>Father's Name : Khawma<br>House No : 1<br>Age : 60 Sex : Male | 2 KDJ0178566<br>Name : Thanseii<br>Husband's Name : Lawrkhuma<br>House No : 1<br>Age : 50 Sex : Female | 3 KDJ0203133<br>Name : Nghakliana<br>Father's Name : Lawrkhuma<br>House No : 1<br>Age : 31 Sex : Male |
| 4 KDJ0196766<br>Name : Hmingchhuangi<br>Father's Name : Lawrkhuma<br>House No : 1<br>Age : 28 Sex : Female | 5 TXU0025494<br>Name : Malsawmzuali<br>Father's Name : Lawrkhuma<br>House No : 1<br>Age : 24 Sex : Female | 6 KDJ0177931<br>Name : Lalrinmawia<br>Father's Name : Lawrkhuma<br>House No : 2<br>Age : 42 Sex : Male |
| 7 KDJ0178483<br>Name : Lalthapuii<br>Husband's Name : L. Rinmawia<br>House No : 2<br>Age : 28 Sex : Female | 8 TXU0051458<br>Name : Jessy Vanlaldiki<br>Father's Name : Zomawia<br>House No : 2<br>Age : 21 Sex : Female | 9 KDJ0178160<br>Name : Thanzuala<br>Father's Name : Lalrema<br>House No : 3<br>Age : 52 Sex : Male |

ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన ప్రధాన అంశాలను ప్రతిబింబించేలా క్రింది వాటిని జతపరచండి.

| అంశాలు | ఎన్నికల వ్యవస్థ లక్షణాలు |
|---|---|
| సార్వత్రిక వయోజన ఓటు హక్కు | ప్రతి నియోజకవర్గంలో ఇంచు మించు సమానమైన జనాభా ఉండాలి. |
| బలహీన వర్గాలకు ప్రాతినిథ్యం | 18 సంవత్సరాలు లేదా ఆపైన ఉన్న వారందరూ ఓటు వేయడానికి అర్హులు. |
| బహిరంగ రాజకీయ పోటీ | ఎవరైనా పార్టీ ఏర్పాటుచేసుకోవచ్చు లేదా ఎన్నికలలో పోటీ చేయవచ్చు. |
| ఒక ఓటు ఒకే విలువ | షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రత్యేక ప్రాతినిథ్యం. |

**మీ పురోగతి పరిశీలించుకోండి**

## ఎన్నికల ప్రచారం

ప్రజలకు తమ ప్రతినిధులను, ప్రభుత్వాన్ని, తాము కోరుకున్న విధానాలను ఎంపిక చేసుకొనే అవకాశం కల్పించడమే ఎన్నికల యొక్క ముఖ్య ఉద్దేశం. కావున ఎవరు మంచి ప్రతినిధి అనే విషయంలోనూ, ఏ పార్టీ మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది అనే విషయంలోనూ లేదా ఏది మంచి విధానం అనే విషయంలోనూ స్వేచ్ఛతో కూడిన బహిరంగ చర్చ అవసరం. ఎన్నికల ప్రచార సందర్భంలో ఇది జరుగుతుంది.

ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల తేదీకి మధ్య రెండు వారాల కాల వ్యవధిలో మనదేశంలో అలాంటి ప్రచారాలు నిర్వహించబడతాయి. ఈ కాలంలో అభ్యర్థులు ఓటర్లను కలవడం, రాజకీయ నాయకులు ఎన్నికల సభలను ఉద్దేశించి మాట్లాడటం, రాజకీయ పార్టీలు తమ మద్దతుదారులను సమీకరించడం వంటివి చేస్తాయి. వార్తా పత్రికలు, టెలివిజన్ వార్తలన్నీ ఈ కాలంలో ఎన్నికలకు సంబంధించిన కథనాలు, చర్చలతో నిండి ఉంటాయి. అయితే ఎన్నికల ప్రచారం ఈ రెండు వారాలకు మాత్రమే పరిమితం కాలేదు. వాస్తవంగా రాజకీయ పార్టీలు ఎన్నికలు జరగడానికి కొన్ని నెలల ముందు నుంచే సమాయత్తమవుతూ ఉంటాయి.

### కృత్యము

గత లోక్‌సభ ఎన్నికలలో మీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఏ విధంగా జరిగింది ? పార్టీలు, అభ్యర్థులు ఏమి చెప్పారో, ఏమి చేశారో ఒక జాబితా తయారు చేయుము.

ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు కొన్ని పెద్ద సమస్యల వైపుకి ప్రజల దృష్టిని మరల్చేలా చేస్తాయి. ప్రజలను ఆ సమస్య వైపుకు ఆకర్షించి దాని ఆధారంగా తమ పార్టీకి ఓటు వేసేలా కోరతాయి. వేరు వేరు ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన కొన్ని బాగా విజయవంతమైన నినాదాలను ఒకసారి పరిశీలిద్దాం.

- ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ 1971 లోక్ సభ ఎన్నికలలో **'గరీబీ హఠావో' (పేదరికాన్ని నిర్మూలిద్దాం)** అనే నినాదాన్ని ఇచ్చింది. దేశం నుంచి పేదరికాన్ని పారద్రోల డానికి ప్రభుత్వ విధానాలన్నింటిలోనూ తగిన విధంగా మార్పులు చేస్తామని వాగ్దానం చేసింది.
- **'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'** అనే నినాదాన్ని 1977 లోక్ సభ ఎన్నికలలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలోని జనతాపార్టీ ఇచ్చింది. అత్యవసర పరిస్థితి సమయంలో చేసిన విపరీత మార్పులను రద్దు చేస్తామని, పౌర స్వేచ్ఛలను పునరుద్ధరిస్తామని వాగ్దానం చేసింది.
- 1977లో జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో వామపక్ష కూటమి **"దున్నే వాడిదే భూమి"** అనే నినాదాన్ని ఉపయోగించుకుంది.
- 1983లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎన్.టి.రామారావు **'తెలుగువారి ఆత్మగౌరవం కాపాడండి'** అనే నినాదాన్ని ఉపయోగించారు.

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తాము కోరుకున్న విధంగా ప్రచారం చేసుకొనే అవకాశాన్ని వారికే వదిలి వేయడం చాలా ఉత్తమం.

AP SCERT

అయితే ప్రతీ రాజకీయపార్టీ, అభ్యర్థి పోటీ చేయడానికి స్వేచ్ఛ, సమానమైన అవకాశాన్ని పొందేందుకు కొన్నిసార్లు ప్రచారాన్ని నియంత్రించుట అవసరం. మన ఎన్నికల చట్టం ప్రకారం ఏ రాజకీయ పార్టీ అయినా అభ్యర్థి అయినా

- ఓటర్లకు లంచం ఇవ్వడము లేదా వారిని బెదిరించడము చేయరాదు.
- కులము, మతం పేరుతో ఓట్లు వేయమని అభ్యర్థించరాదు.
- ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వ వనరులు, కార్యాలయాలు ఉపయోగించరాదు.
- లోక్‌సభ ఎన్నికలలో నియోజవర్గంలో 25 లక్షలకు మించి లేదా అసెంబ్లీ ఎన్నికలలో నియోజకవర్గంలో 10 లక్షలకు మించి ఖర్చు చేయరాదు.

అలా చేస్తే వారి ఎన్నికను ఎన్నికైనట్లు ప్రకటించిన తరువాత కూడా రద్దు చేయవచ్చును. ఈ చట్టాలకు అదనంగా ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రవర్తనా నియమావళిని మన రాజకీయ పార్టీలు అంగీకరించాయి. దీని ప్రకారం ఏ పార్టీ లేదా అభ్యర్థి కూడా:




- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ వాహనాలు, చిహ్నాలు, అధికారులను ఉపయోగించరాదు.
- ఎన్నికల ప్రకటన ఒకసారి వచ్చిన తరువాత మంత్రులు ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేయడం, పెద్ద విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం, ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని వాగ్దానాలు ఇవ్వడం చేయరాదు.

## పోలింగ్, ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో చివరిదశ ఓటర్లు ఓట్లు వేసే రోజు. సాధారణంగా ఆ రోజును ఎన్నికల రోజు అంటారు. ఓటర్ల జాబితాలో పేరు గల ప్రతి వ్యక్తి సాధారణంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన స్థానిక పాఠశాలలో గాని, ప్రభుత్వ కార్యాలయానికి గాని వెళ్ళవచ్చు. ఒకసారి ఓటరు పోలింగ్ బూతు లోపలికి వెళ్లిన తరువాత ఎన్నికల అధికారులు అతను/ఆమెను గుర్తించి అతను/ఆమె వేలిపై సిరా మార్కు వేసి ఓటు వేయడానికి అనుమతిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఎన్నిక న్యాయంగా జరిగేలా చూడటానికి ప్రతి అభ్యర్థి తరపున ఒక ఏజెంటును అనుమతిస్తారు.

### ఎన్నికలు మనదేశంలో మితిమీరిన ఖర్చుతో కూడుకున్నవా?

ఎన్నికల నిర్వహణ కోసం భారతదేశంలో పెద్ద మొత్తంలో సొమ్మును ఖర్చు చేస్తున్నారు. ఉదాహరణకు 2014లో లోక్ సభ ఎన్నికల నిర్వహణకు ₹ 3500 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఓటర్ల జాబితాలోని ప్రతిఒక్కరికి సుమారు ₹ 40 రూపాయల పైన ఖర్చు చేసినట్లు అంచనా వేయబడింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఖర్చు చేసినది మొత్తం ప్రభుత్వం ఖర్చు చేసినదాని కంటే ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం, పార్టీలు, అభ్యర్థులు ఖర్చు చేసిన మొత్తం ₹30,000 కోట్లు అనగా ప్రతిఒక్క ఓటరు పైన ఖర్చు ₹ 500 రూపాయలుగా ఉంది.

ఎన్నికలు ప్రజలపై భారమనే అభిప్రాయం కొంత మంది వ్యక్తపరుస్తున్నారు. ఎందువలన అనగా భారతదేశం లాంటి పేదదేశంలో ప్రతి 5 ఏళ్ళకు ఒకసారి ఎన్నికలు నిర్వహించడం భారంగా ఉంటుంది. ఈ ఖర్చును కొన్ని ఇతర ఖర్చులతో పోలుద్దాము.

- మన ప్రభుత్వం 2005లో ఫ్రాన్స్ నుంచి 6 న్యూక్లియర్ సబ్ మెరైన్‌లను కొనాలని నిర్ణయించింది. ప్రతి సబ్ మెరైన్ యొక్క ఖర్చు 3 వేలకోట్లు.
- 2010లో కామన్వెల్త్ గేమ్స్ క్రీడలకు ఢిల్లీ ఆతిథ్యం ఇచ్చింది. దీనియొక్క అంచనా ఖర్చు సుమారు ₹ 20 వేలకోట్లు.

ఎన్నికలు మితిమీరిన ఖర్చుతో కూడుకున్నాయా? మీరు నిర్ణయించండి.

AP SCERT

**గుల్బర్గాలో ఎన్నికల ఫలితము**

ఇంతకుముందు మనము ఉదాహరణగా తీసుకొన్న గుల్బర్గానే పరిశీలిద్దాం. 2014లో ఈ నియోజక వర్గంలో 8 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మొత్తం అర్హులైన ఓటర్ల సంఖ్య 17.21 లక్షలు. వీనిలో 9.98 లక్షలమంది తమ ఓటును ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లిఖార్జున్ ఖర్గే 5.07 లక్షల ఓట్లను సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో ఇది 50.82శాతం. అతను మిగిలిన వారికన్నా ఎక్కువ ఓట్లు సాధించారు కనుక అతనిని గుల్బర్గా లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

**2014 లోక్ సభ సాధారణ ఎన్నికల్లో గుల్బర్గా నియోజకవర్గ ఎన్నికల ఫలితము**

| అభ్యర్థి | పార్టీ | పోలైన ఓట్లు | ఓట్ల శాతం |
|---|---|---|---|
| డి.జి.సాగర్ | JD(S) | 15690 | 1.57 |
| మల్లిఖార్జున్ ఖర్గే | INC | 507193 | 50.82 |
| దండి మహాదేవ్ | BSP | 11428 | 1.14 |
| రేవు నాయక్ బెలంగి | BJP | 432460 | 43.33 |
| బి.టి.లలితానాయక్ | AAAP | 9074 | 0.91 |
| ఎస్. ఎం. శర్మ | SUCI | 4943 | 0.50 |
| శంకర్ జాదవ్ | BHPP | 2877 | 0.29 |
| రాము | IND | 4085 | 0.41 |
| ఎవరూ కాదు | NOTA | 9888 | 0.99 |

- ఎన్నికలలో వాస్తవంగా ఓట్లు వేసిన ఓటర్ల శాతం ఎంత?
- ఎన్నికలలో గెలవడానికి పోలైన ఓట్లలో సగం కంటే ఎక్కువ ఓట్లు పొందడం అవసరమా?



పోలింగ్ కేంద్రంలోనూ, లెక్కింపు కేంద్రంలోనూ పార్టీ ఏజెంట్లు ఎందుకు ఉంటారు?

ఇంతకు ముందు బ్యాలెట్ పేపర్ మీద స్టాంపు వేయడం ద్వారా ఓటర్లు తాము ఎవరికీ ఓటు వేయాలనుకొన్నారో తెలియజేసేవారు. బ్యాలెట్ పేపర్ మీద పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, పార్టీ పేరు, గుర్తులు ఉంటాయి. ప్రస్తుత రోజులలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (**EVM**) ఓట్లను నమోదు చేయుటకు ఉపయోగిస్తున్నారు. ఈ యంత్రం అభ్యర్థుల పేర్లను, పార్టీ గుర్తులను చూపిస్తుంది. స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులను కలిగి ఉంటారు. ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నారో వారి పేరు ఎదురుగా ఉన్న మీట నొక్కడమే ఓటరు చేయాల్సిన పని.

ఎన్నిక ప్రక్రియ ఒకసారి ముగిసిన తరువాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సీలు వేసి, భద్రమైన ప్రదేశానికి తీసుకువెళ్తారు. కొద్దిరోజుల తర్వాత నిర్ణయించబడిన రోజున ఒక నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అన్నింటినీ తెరిచి ప్రతి అభ్యర్థి ఎన్ని ఓట్లు సాధించాడో లెక్కిస్తారు. లెక్కింపు ప్రక్రియ సక్రమంగా జరగడానికి అందరు అభ్యర్థుల ఏజెంట్లు అక్కడ ఉంటారు. ఒక నియోజకవర్గంలో ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థిని గెలిచినట్లుగా ప్రకటిస్తారు. సాధారణ ఎన్నికలలో ఓట్ల లెక్కింపు సాధారణంగా ఒకే రోజున ఒకే సమయాన అన్ని ప్రదేశాలలో జరుగుతుంది. టెలివిజన్ ఛానల్స్ రేడియో, వార్తా పత్రికలు ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ప్రసారం చేస్తాయి. లెక్కింపు మొదలైన కొద్ది గంటలలో అన్ని ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు, తదుపరి ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేయబోతోంది స్పష్టమౌతుంది.

క్రింది వాటిలో ఉచిత, అనుచిత ఎన్నికల ప్రవర్తనలను గుర్తించుము.

- ఎన్నికకు వారం రోజుల ముందు ఒక మంత్రి తన నియోజకవర్గంలో జెండా ఊపి కొత్త రైలును ప్రారంభించారు.
- ఒక అభ్యర్థి తాను గెలిస్తే తన నియోజకవర్గానికి క్రొత్త రైలును తెస్తానని వాగ్దానం చేసినది.
- ఒక అభ్యర్థి యొక్క మద్దతుదారులు ఓటర్లను దేవాలయానికి తీసుకువెళ్లి తమకే ఓటు వేయమని ప్రమాణం చేయించారు.
- ఒక అభ్యర్థి మద్దతుదారులు మురికివాడలలో తమకే ఓటు వేయమని అడుగుతూ దుప్పట్లను పంచారు.

**మీ పురోగతి పరిశీలించుకోండి**

AP SCERT

## 3.3. భారతదేశంలో ఎన్నికలను ప్రజాస్వామ్యయుతంగా చేసేది ఏది?

ఎన్నికలలో అనుచిత ప్రవర్తనల గురించి మనము ఎక్కువగా చదివి ఉన్నాము. వార్తాపత్రికలు, టీవి ఛానల్స్ నివేదికలు అలాంటి ఆరోపణలను గురించి తరచుగా తెలియజేస్తాయి. వాటిలో అత్యధిక నివేదికలు ఈ క్రింది వాటి గురించినవే :

- ఓటర్ల జాబితాలో తప్పుడు పేర్లను, లేని పేర్లను చేర్చడం, నిజమైన పేర్లను తొలగించడం.
- ప్రభుత్వ సదుపాయాలను, అధికారులను అధికార పార్టీ దుర్వినియోగం చేయడం.
- పెద్ద పార్టీలు, ధనవంతులైన అభ్యర్థులు డబ్బును అతిగా ఖర్చు చేయడం.
- పోలింగ్ జరిగే రోజున ఓటర్లను భయపెట్టడం, రిగ్గింగ్ చేయడం.

వీటిలో చాలా నివేదికలు సరైనవే. ఇలాంటి నివేదికలు చదవడానికి లేదా చూడడానికి మనకు ఏ మాత్రం సంతోషంగా ఉండదు. అయితే అవి అదృష్టవశాత్తూ ఎన్నికల యొక్క ప్రధాన ఉద్దేశాన్ని అతిక్రమించే స్థాయిలో లేవు. మనము ఒక మౌలిక ప్రశ్న అడిగితే అది స్పష్టం అవుతుంది. ఏ పార్టీ అయినా ప్రజల మద్దతు లేకుండా కేవలం ఎన్నికలలో అనుచిత ప్రవర్తనలు చేయడం ద్వారా అధికారంలోకి రాగలదా? ఇది చాలా మౌలిక మైన ప్రశ్న. ఈ ప్రశ్న యొక్క వివిధ అంశాలను పరిశీలిద్దాం.

భారత ఎన్నికల సంఘం గురించి మరిన్ని వివరాల కోసం https://eci.gov.in సందర్శించుము.



ఎన్నికల సంఘానికి అన్ని అధికారాలు ఎందుకు ఉన్నాయి? ఇది ప్రజాస్వామ్యానికి మంచిదేనా?

### స్వతంత్ర ఎన్నికల సంఘం

ఎన్నికలు న్యాయబద్ధంగా జరిగాయా, జరగలేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఎన్నికలు ఎవరు నిర్వహిస్తారు అనే అంశాన్ని పరిశీలించి తేలికగా నిర్ణయించవచ్చు. వారు ప్రభుత్వంనుండి స్వతంత్రంగా ఉన్నారా? లేదా అధికారపార్టీ లేక ప్రభుత్వం వారిని ప్రభావితం చేయగలరా, లేదా వారిపై ఒత్తిడి చేస్తుందా? ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించడానికి వారికి తగిన అధికారాలు ఉన్నాయా? వారు ఈ అధికారాలను వాస్తవంగా ఉపయోగించు కుంటున్నారా?

మన దేశంలో ఈ ప్రశ్నలన్నింటికి పూర్తి సానుకూల సమాధానం వస్తుంది. మనదేశంలో స్వతంత్ర, అత్యంత శక్తివంతమైన ఎన్నికలసంఘం ఎన్నికలను నిర్వహిస్తుంది. న్యాయవ్యవస్థ మాదిరిగానే దీనికి **స్వతంత్ర ప్రతిపత్తి** ఉంటుంది. ఎన్నికల ప్రధాన అధికారిని భారత రాష్ట్రపతి నియమిస్తారు. అయితే ఒకసారి నియమించబడిన తరువాత అతను రాష్ట్రపతికి గానీ, ప్రభుత్వానికి గానీ జవాబుదారీ కాదు. అధికారంలో ఉన్న పార్టీ, ప్రభుత్వం చెప్పినట్లు ఎన్నికల సంఘం చేయకపోయినా ఎన్నికలసంఘ ప్రధాన అధికారిని తొలగించుట పూర్తిగా అసాధ్యము.

ప్రపంచంలోని అతికొద్ది ఎన్నికల సంఘాలకు మాత్రమే భారత ఎన్నికలసంఘం లాంటి విస్తృతమైన అధికారాలు కలవు.

- ఎన్నికల ప్రకటన చేసినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించేవరకు ఎన్నికల సంఘం ప్రతి అంశాన్ని నిర్వహిస్తుంది, నియంత్రిస్తుంది.
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అది అమలు చేస్తుంది. ఏ అభ్యర్థి అయినా లేదా పార్టీ ఆయినా దానిని అతిక్రమిస్తే శిక్షిస్తుంది.
- ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలను పాటించాలని ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. ఎన్నికలలో తమ గెలుపు అవకాశాలను పెంచుకోవడానికి ప్రభుత్వం యొక్క అధికారం ఉపయోగించకుండా, దుర్వినియోగం కాకుండా నివారించవచ్చు లేదా ప్రభుత్వ అధికారు లను బదిలీ చేయవచ్చు.
- ఎన్నికల విధులు నిర్వర్తించే సమయంలో ప్రభుత్వ అధికారులందరు ప్రభుత్వ నియంత్రణలో కాకుండా ఎన్నికలసంఘం నియంత్రణలోనే పనిచేస్తారు.

గత 25 సంవత్సరాలలో ఎన్నికల సంఘం తన అధికారాలన్నింటిని వాడుకొని విస్తరించుకోవడము కూడా ప్రారంభించింది. ప్రభుత్వము, పరిపాలనలో జరిగే తప్పులను తీవ్రంగా మందలించడం ఎన్నికల సంఘానికి సర్వ సాధారణమైనది. ఎన్నికల అధికారులు కొన్ని పోలింగ్ కేంద్రాలలో లేదా మొత్తం నియోజకవర్గంలో ఎన్నికలు న్యాయంగా జరగలేదని భావిస్తే తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఆదేశిస్తారు. అధికారంలో ఉన్న పార్టీలకు ఎన్నికల సంఘం చేసేది ఇష్టం లేకపోవచ్చు. అయినా వారు శిరసావహించాల్సిందే. ఎన్నికల సంఘం స్వతంత్రముగా శక్తివంతముగా లేకపోతే ఇది జరిగి ఉండకపోవచ్చు.

AP SCERT

14 వ లోక్ సభను ఏర్పాటు చేస్తూ ఎన్నికల సంఘం (ఇ.సి.) ప్రకటన జారీ చేసింది.

ఎన్నికల ఖర్చులకు సంబంధించిన మార్గ దర్శకాలను ఇ.సి. కట్టుదిట్టం చేసింది.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించడానికి ఇ.సి. గుజరాత్‌ను మరోసారి సందర్శించనుంది.

క్రిమినల్ నాయకులను ఎన్నికలలో పోటీచేయకుండా నిషేధించాలని హైకోర్టు ఇ.సి.ని కోరింది.

ఎన్నికల సంస్కరణలపై హోంమంత్రిత్వశాఖ సలహాను ఎన్నికలసంఘం తిరస్కరించింది.

బీహార్ ఎన్నికలలో ఫోటో గుర్తింపు కార్డులు తప్పని సరి కాదు.

ఎన్నికల సంఘం హర్యానా కొత్త డీ.జి.పి నియామకాన్ని ఆమోదించింది.

రాజకీయ ప్రకటనలను నియంత్రించడానికి అధికారం కావాలని ఎన్నికలసంఘం కోరుతుంది.

ఎగ్జిట్ పోల్స్‌ను నిషేధించడానికి తక్షణ ప్రణాళిక లేదని ఎన్నికలసంఘం పేర్కొంది.

398 కంటే ఎక్కువ కేంద్రాలలో తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఎన్నికలసంఘం ఆదేశించింది.

రహస్యంగా చేసే ఎన్నికల ఖర్చులపై ఎన్నికల సంఘం దేగకన్ను ఉంచబోతుంది.

పై ముఖ్యాంశాలను చదివి ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా జరిగేలా చూడడానికి ప్రతి సందర్భంలోనూ ఎన్నికల సంఘం ఏ అధికారాలను ఉపయోగించుకున్నదో గుర్తించండి.

**మీ పురోగతి పరిశీలించుకోండి**

## ప్రజా భాగస్వామ్యము

ప్రజలందరు ఎన్నికలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారా లేదా అనేది ఎన్నికల ప్రక్రియ యొక్క నాణ్యతను నిర్ధారించుకోవడానికి మరొక మార్గం. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, న్యాయంగా జరగక పోతే ప్రజలు ఎన్నికలలో పాల్గొనడం కొనసాగించరు. ఇప్పుడు ఈ చార్టులను చదివి భారతదేశంలో ప్రజల భాగస్వామ్యం గురించి కొన్ని తీర్మానాలు చేయండి.

**1.** ఎన్నికలలో ప్రజల భాగస్వామ్యాన్ని ఓటింగ్ సరళి యొక్క సంఖ్యల ద్వారా అంచనా వేయవచ్చు. అర్హులైన మొత్తం ఓటర్లలో ఎంతమంది వాస్తవంగా ఓటు వేశారు అనేది ఓటింగ్ సరళి తెలియజేస్తుంది. ఐరోపా, ఉత్తర అమెరికాలో గత 15 సంవత్సరాలలో ఓటింగ్ సరళి తగ్గింది. మన భారతదేశంలో ఓటింగ్ సరళి స్థిరంగా ఉంది లేదా వాస్తవంగా పెరిగింది.

**1. భారతదేశము మరియు యు.కె లో ఓటింగ్ సరళి.**




AP SCERT

**2.** భారతదేశంలో ధనవంతులు, కొన్ని ప్రత్యేక వర్గాల వారితో పోలిస్తే పేదవారు, నిరక్షరాస్యులు మరియు అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఓటు హక్కును ఉపయోగించుకుంటున్నారు. ఈ పరిస్థితి పశ్చిమ ప్రజాస్వామ్య దేశాలలో భిన్నంగా ఉంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ధనవంతులు, తెల్లవారి కంటే పేదప్రజలు, ఆఫ్రికా అమెరికన్లు, స్పానిష్ భాష మాట్లాడే లాటిన్ అమెరికన్లు చాలా తక్కువగా ఓటు వేస్తారు.

**4.** కొన్ని సంవత్సరాలుగా ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాలలో ఓటర్ల ఆసక్తి పెరుగుతున్నది. 2004 ఎన్నికలలో 1/3 వంతు కంటే ఎక్కువ ఓటర్లు ప్రచారానికి సంబంధించిన కార్య కలాపాలలో పాల్గొన్నారు. సగం మందికి పైగా ఓటర్లు ఒక రాజకీయ పార్టీకి లేదా ఇతర రాజకీయ పార్టీలకు తాము దగ్గరగా ఉన్నట్లు గుర్తించారు. ప్రతి ఏడుగురు ఓటర్లలో ఒకరు ఏదో ఒక రాజకీయ పార్టీలో సభ్యులై ఉన్నారు.

**2. 2004 ఎన్నికలలో భారతదేశం, అమెరికాలలో సామాజిక వర్గాల వారీగా ఓటింగ్ సరళి (శాతం)**




మూలం : భారతదేశానికి సంబంధించిన గణాంకాలు,2004 జాతీయ ఎన్నికల అధ్యయనం CSDS నుండి, అమెరికాకు సంబంధించిన గణాంకాలు, మిచిగన్ యూనివర్శిటీ, జాతీయ ఎన్నికల అధ్యయనం నుండి

**3.** భారతదేశంలోని సాధారణ ప్రజలు ఎన్నికలకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తారు. తమకు అనుకూలమైన విధానాలు, కార్యక్రమాలను అమలు చేసేందుకు రాజకీయ పార్టీలపై ప్రజలు ఎన్నికల ద్వారా ఒత్తిడి తేవచ్చని భావిస్తారు. భారతదేశంలో పరిస్థితులను నడిపించుటలో తన ఓటుకు ప్రాధాన్యత ఉంటుందని కూడా వారు భావిస్తారు.

**4. భారతదేశంలో ఏదైనా ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపంలో పాల్గొన్నవారు**

**ఆధారం: జాతీయ ఎన్నికల అధ్యయనం CSDS (1996 – 2004)**




**3. నీ యొక్క ఓటు మార్పు తెస్తుందని నీవు అనుకుంటున్నావా?**




మూలం : జాతీయ ఎన్నికల అధ్యయనం 2004, సి.ఎస్.డి.ఎస్

## కృత్యము

నీ కుటుంబ సభ్యులలో అర్హులైన ఓటర్లను గత ఎన్నికలలో లోక్‌సభకు లేదా రాష్ట్ర శాసనసభకు ఓటు వేశారో లేదో అడగండి. అలా వేయకపోతే ఎందుకు వేయలేదో అడగండి. ఓటు వేస్తే ఏ అభ్యర్థికి మరియు ఏ పార్టీకి ఎందుకు ఓటు వేశారో అడగండి. ర్యాలీ లేదా ఎన్నికల సభకు హాజరుకావడం లాంటి ఎన్నికలకు సంబంధించిన ఏ ఇతర కార్యకలాపంలో నైనా పాల్గొన్నారో లేదో కూడా అడగండి.

## ఎన్నికల ఫలితాన్ని అంగీకరించడం

ఎన్నికల స్వేచ్ఛ, నిష్పక్షపాతానికి సంబంధించిన చివరి పరీక్ష ఫలితాలలోనే ఉంటుంది. ఎన్నికలు స్వేచ్ఛగా లేదా నిష్పక్షపాతంగా జరగకపోతే ఫలితం ఎల్లప్పుడూ శక్తివంతమైన వారికే అనుకూలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితులలో అధికార పార్టీలు ఓడిపోవు.

AP SCERT

సాధారణంగా రిగ్గింగ్ జరిగిన ఎన్నికల ఫలితాన్ని ఓడిపోయే పార్టీ అంగీకరించదు.

భారతదేశంలో ఎన్నికల ఫలితాలు తెలియచేప్పేవి ఏమిటంటే :

- భారతదేశంలో జాతీయ, రాష్ట్రస్థాయిల ఎన్నికలలో **అధికారపార్టీలు** వరుసగా ఓడిపోతూనే ఉన్నాయి. వాస్తవానికి గత 25 సంవత్సరాలలో జరిగిన ప్రతి మూడు ఎన్నికల్లో రెండింటిలో అధికారపార్టీ ఓడిపోయింది.
- అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పదవిలో ఉన్న లేదా ఎన్నికైన ప్రజాప్రతినిధి చాలా అరుదుగా ఎన్నికలలో ఓడిపోతారు. భారతదేశంలో సుమారుగా పదవిలో ఉన్న సగం మంది పార్లమెంటు, శాసనసభ సభ్యులు ఎన్నికల్లో ఓడిపోతారు.
- ఎన్నికలలో ఓట్లు కొనడానికి బాగా ఖర్చు పెట్టడంలో పేరు పొందినవారు, నేరస్తులతో సంబంధం ఉన్నవారు ఎన్నికలలో తరచుగా ఓడిపోతారు.
- కొన్ని వివాదాస్పదమైన ఎన్నికలు మినహా ఎన్నికల ఫలితాలన్నింటిని ప్రజలు ఇచ్చిన తీర్పుగా ఓడిపోయిన పార్టీలు సాధారణంగా అంగీకరిస్తాయి.

## స్వేచ్ఛ, నిష్పక్షపాత ఎన్నికలకు సవాళ్లు

పై విషయాలన్నింటి ద్వారా ఒక సులువైన ముగింపుకు రావచ్చు. భారతదేశంలో ఎన్నికలు మౌలికంగా స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరుగుతాయి. ఏ పార్టీ ఎన్నికలలో గెలుస్తుందో అదే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఎందుకనగా ప్రజలు వాటి ప్రత్యర్థుల కన్నా ఎక్కువగా ఆ పార్టీని ఎంపిక చేసుకున్నారు. ప్రతీ నియోజక వర్గ విషయం లోనూ ఇది వాస్తవం కాకపోవచ్చు. చాలా కొద్దిమంది అభ్యర్థులు ధనబలం, అక్రమ మార్గాల మీద ఆధారపడి గెలువవచ్చు. కానీ మొత్తం మీద సాధారణ ఎన్నికల యొక్క తీర్పు ప్రజల ప్రాధాన్యతలను తెలియజేస్తుంది. మనదేశంలో గత 60 సంవత్సరాలలో ఈ విషయంలో చాలా తక్కువ మినహాయింపులు ఉన్నాయి. ఇదే భారతదేశంలోని ఎన్నికలను ప్రజాస్వామ్యయుతంగా చేసింది.

అయినప్పటికీ మనము లోతైన ప్రశ్నలు వేస్తే పరిస్థితి భిన్నంగా కనిపించవచ్చు. ప్రజల యొక్క ప్రాధాన్యతలు వాస్తవమైన పరిజ్ఞానం ఆధారంగా ఉన్నాయా? ఓటర్లు వారికి కావలసిన వారిని నిజంగా ఎంపిక చేసుకోగలుగుతున్నారా? ఎన్నికలు నిజంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే రంగమా? సాధారణ పౌరునకు ఎన్నికలలో గెలుస్తామనే ఆశ ఉన్నదా? ఈ రకమైన ప్రశ్నలు భారతదేశ ఎన్నికల లోని చాలా పరిమితులను మరియు అవరోధాలను మన దృష్టికి తీసుకొని వస్తాయి. వీటిలో కొన్ని.




విలేకర్ల సమావేశం నుంచి ఒక నాయకుడు బయటకు వస్తున్నాడు. "సరియైన, గెలిచే సత్తా ఉన్న కుటుంబాలకే టికెట్లు ఇచ్చామని చెప్పాల్సిన అవసరం ఏముంది?" కుటుంబ రాజకీయాలు కొన్ని రాష్ట్రాలకు, పార్టీలకు సంబంధించినవని నీవు అనుకుంటున్నావా?

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**



శీర్షిక: 'ఎన్నికల ప్రచారాలు' ఈ వ్యంగ్య చిత్రం లాటిన్ అమెరికా దృక్పథంలో గీయబడింది. భారతదేశము, ప్రపంచములోని ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఇది వర్తిస్తుందా?

©Nerilicon, *El Economista*, Cagle Cartoons Inc.

AP SCERT

ఎన్నికలకు ముందు తరువాత ఓటరు యొక్క పరిస్థితిని తెలియజేసే ఖచ్చితమైన చిత్రము ఇదేనా? ప్రజాస్వామ్యంలో ఇది ఎల్లప్పుడూ తప్పనిసరిగా జరుగుతుందా? ఇది జరగని సందర్భాలను నీవు ఊహించగలవా?

**ఈ వ్యంగ్య చిత్రాన్ని చదవండి.**



R.K. Laxman, *The Times of India*

AP SCERT

- ఎక్కువ డబ్బు ఉన్న రాజకీయపార్టీలు, అభ్యర్థులకు గెలుస్తామనే నమ్మకం లేకపోవచ్చు. అయితే వారుచిన్న రాజకీయపార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల కన్నా అన్యాయంగా ప్రయోజనం పొందుతారు.
- దేశంలోని కొన్ని ప్రాంతాలలో నేరపూరిత సంబంధం ఉన్న అభ్యర్థులు ఎన్నికల పోటీ నుంచి ఇతరులను బయటకు నెట్టవచ్చు, ప్రధాన పార్టీల నుండి టిక్కెట్లు సాధించవచ్చు.
- కొన్ని కుటుంబాలు రాజకీయ పార్టీలపై ఆధిపత్యం చెలాయిస్తాయి. టిక్కెట్లు ఈ కుటుంబాల బంధువులకు ఇస్తున్నారు.
- ఎన్నికలు చాలా తరచుగా సామాన్య పౌరులకు ఎంపిక చేసుకొనే అవకాశం ఇవ్వడం లేదు. ఎందువలన అంటే పెద్ద రాజకీయ పార్టీలన్నీ తమ విధానాలలో, ఆచరణలో పూర్తిగా ఒకే విధంగా ఉన్నాయి.
- చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు పెద్ద పార్టీలతో పోలిస్తే ఎక్కువ నష్టం జరుగుతున్నది.

ఈ సమస్యలు మన భారతదేశములోనే గాక ప్రపంచంలో ప్రజాస్వామ్యము బాగా వేళ్లూనుకున్న దేశాలలో కూడా ఉన్నది. ఈ తీవ్రమైన సమస్యలు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్నవారికి ఆందోళన కలిగిస్తాయి. అందువలనే పౌరులు, సామాజిక కార్యకర్తలు మరియు సంస్థలు ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు కావాలని బలంగా కోరుతున్నారు. కొన్ని సంస్కరణలను నీవు చెప్పగలవా? ఈ సమస్యలను ఎదుర్కోవడానికి సాధారణ పౌరుడు ఏమి చేయగలడు?

**మీ పురోగతి పరిశీలించుకోండి**

భారతదేశంలో ఎన్నికల గురించి కొన్ని వాస్తవాలు క్రింద ఉన్నాయి. ఇవి మన ఎన్నికల వ్యవస్థ యొక్క బలము లేక బలహీనతలలో దేనిని తెలియజేస్తుందో చెబుతూ ప్రతి విషయంపైన వ్యాఖ్యానించుము.

- 16వ లోక్ సభలో 12 శాతం మంది మహిళా సభ్యులు ఉన్నారు.
- ఎన్నికలు ఎప్పుడు జరగాలనే దాని గురించి ప్రభుత్వం ఇచ్చే సలహాను ఎన్నికలసంఘం తరచుగా తిరస్కరిస్తుంది.
- 16 వ లోక్ సభలో ఒక కోటికి మించి ఆస్తి కలిగియున్న సభ్యులు 440 మందికి పైనే ఉన్నారు.
- ఎన్నికలలో ఓడిపోయిన తరువాత తాము ప్రజల తీర్పును గౌరవిస్తానని ముఖ్యమంత్రి అన్నారు.

## పదకోశం

**ప్రవర్తనా నియమావళి :-** ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు పాటించాల్సిన మార్గదర్శకాలు, నియమాల సముదాయము.

**నియోజకవర్గము:-** ఒక భౌగోళిక ప్రాంతంలోని శాసన నిర్మాణ సంస్థలకు ప్రతినిధులను ఎన్నుకొనే ఓటర్లు.

**ఇంకంబెంట్:-** ప్రస్తుతం రాజకీయ పదవిలో ఉన్న వ్యక్తి. సాధారణంగా ఎన్నికల్లో ఓటర్ల ఎంపిక అధికారంలో ఉన్న పార్టీ లేదా అభ్యర్థికి, వారిని వ్యతిరేకించే వారి మధ్య జరుగుతుంది.

**లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్ :-** తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను ఓటు వేయమని అభ్యర్థించే అవకాశం ఎన్నికలలో పోటీ చేసే అన్ని పార్టీలు, అభ్యర్థులకు సమానముగా ఉండే పరిస్థితి.

**రిగ్గింగ్ :-** ఒక రాజకీయ పార్టీ లేదా అభ్యర్థి మోసపూరితమైన, తప్పుడు పద్ధతుల ద్వారా తమ ఓట్లను పెంచుకోడానికి ప్రయత్నించడం, కొద్దిమంది వ్యక్తులు ఇతరులు వేసిన ఓట్ల బ్యాలెట్ పెట్టెలను ఎత్తుకు పోవడము, ఒకే వ్యక్తి అనేకసార్లు ఓటు వేయడము, ఎన్నికల అధికారులను ఒక అభ్యర్థికి అనుకూలంగా ఉండమని లంచం ఇవ్వడం, బలప్రయోగం చేయడం అన్నీ రిగ్గింగ్‌లో భాగాలే.

**ఓటింగ్ సరళి :-** ఒక ఎన్నికలో మొత్తం అర్హులైన ఓటర్లలో ఓట్లు వేసిన వారి శాతము.

## అభ్యాసాలు

1. ఈ క్రింది వానిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కారణాలలో తప్పు వాక్యాన్ని గుర్తించండి.
   - ఎ. ప్రభుత్వం యొక్క పనితీరుపై ప్రజలు తీర్పు ఇచ్చేలా ఎన్నికలు చేస్తాయి.
   - బి. ఎన్నికల్లో ప్రజలు తమ యొక్క ప్రతినిధిని వారియొక్క ఇష్టప్రకారం ఎంపిక చేసుకుంటారు.
   - సి. ఎన్నికలు న్యాయవ్యవస్థ యొక్క పనితీరును ప్రజలు మదింపు చేసేలా చేస్తాయి.
   - డి. ప్రజలు తాము ఏ విధానాలను కోరుకుంటున్నారో తెలియజేస్తారు.

2. భారతదేశ ఎన్నికలు ప్రజాస్వామ్యయుతమైనవని చెప్పడానికి ఈ క్రింది వానిలో ఏది సరైన కారణం కాదు?
   - ఎ. ప్రపంచంలోకెల్లా భారతదేశంలోనే ఎక్కువమంది ఓటర్లు కలరు.
   - బి. భారత ఎన్నికలసంఘం చాలా శక్తివంతమైనది.
   - సి. భారతదేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలదు.
   - డి. భారతదేశంలో ఓడిపోయే పార్టీలు ఎన్నికల తీర్పును అంగీకరిస్తాయి.

3. ఈ క్రింది వాటిని జతపరుచుము.

| | |
|---|---|
| ఎ. ఓటర్ల జాబితాను ఎప్పుడూ తాజాగా ఉంచుకోవాలి. ఎందుకంటే | 1. మన సమాజంలో అన్ని వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభిస్తుంది. |
| బి. కొన్ని నియోజకవర్గాలను షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రత్యేకంగా కేటాయించారు. కాబట్టి | 2. ప్రతి ఒక్కరూ తమ ప్రతినిధిని ఎన్నుకోవడానికి సమాన అవకాశం కలిగి ఉన్నారు. |
| సి. ప్రతి ఒక్కరికీ ఒకే ఒక ఓటు ఉంటుంది కాబట్టి | 3. ఎన్నికలలో పోటీ చేయడానికి అందరికీ సరైన అవకాశం తప్పనిసరిగా ఉండాలి. |
| డి. అధికారంలో ఉన్న పార్టీ ప్రభుత్వ వాహనాన్ని ఉపయోగించేందుకు అనుమతి లేదు. ఎందుకనగా | 4. కొద్దిమంది ప్రజలు గతంలో ఓటు వేసిన ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి వెళ్లి ఉండవచ్చు. |

AP SCERT

4. ఎన్నికలకు సంబంధించి ఈ అధ్యాయంలో పేర్కొన్న వేర్వేరు కార్యకలాపాలను మొదటి కార్యకలాపం నుంచి చివరి కార్యకలాపం వరకు అన్నింటినీ పేర్కొని వాటిని క్రమ పద్ధతిలో అమర్చుము.
వాటిలో కొన్నింటిని ఈ క్రింద ఇవ్వడం జరిగింది.
ఎన్నికల హామీపత్రం విడుదల చేయడము, ఓట్లను లెక్కించడము, ఓటర్ల జాబితాను తయారుచేయడము, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ఫలితాలను ప్రకటించడం, ఓట్లు వేయడము, తిరిగి పోలింగ్‌కు ఆదేశించడము, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడము, అభ్యర్థిత్వ పత్రాలను సమర్పించడం.
5. రాష్ట్రంలో ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించేలా చూడడానికి సురేఖ ఇంచార్జ్ అధికారిగా ఉన్నారు. ఈ క్రింది ఎన్నిక దశలలో ఆమె దేనిపై ఎక్కువగా దృష్టి పెట్టాలో వివరించుము.
ఎ. ఎన్నికల ప్రచారం
బి. ఎన్నికలు జరిగే రోజు
సి. ఓట్ల లెక్కింపు రోజు
6. అమెరికా కాంగ్రెస్‌లో ఎన్నికైన వివిధ జాతుల యొక్క సంఖ్యా వివరాలను ఈ దిగువున ఇవ్వడం జరిగింది. అమెరికా జనాభాలో ఈ జాతులను అందలి ప్రజల నిష్పత్తితో పోల్చుము. దీని ఆధారంగా అమెరికా కాంగ్రెస్‌లో నీవు రిజర్వేషన్ విధానాన్ని సూచిస్తావా? అవును అంటే, ఎందుకు? ఏయే జాతుల వారికి? కాదు అంటే ఎందుకు వద్దు.

| | జాతుల యొక్క నిష్పత్తి ( శాతములు ) | |
|---|---|---|
| | ప్రతినిధుల సభ | అమెరికాలో జనాభా |
| నల్లజాతీయులు | 8 | 13 |
| స్పానిష్ భాష మాట్లాడే నల్లజాతీయులు | 5 | 13 |
| తెల్లజాతివారు | 86 | 70 |

7. ఈ అధ్యాయంలో ఇచ్చిన సమాచారం ఆధారంగా మనం ఈ క్రింది అభిప్రాయాలను ఏర్పరచుకోవచ్చా? ప్రతి దానిపై నీ అభిప్రాయాలు సమర్థించుకోవడానికి రెండు వాస్తవాలు తెలపండి.
ఎ. మనదేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించడానికి భారత ఎన్నికల సంఘానికి సరిపడినన్ని అధికారాలు లేవు.
బి. మన దేశంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఎన్నికలలో పాల్గొంటారు.
సి. అధికారంలో ఉన్న పార్టీకి ఎన్నికల్లో గెలవడం చాలా తేలిక.
డి. ఎన్నికలు పూర్తి స్వేచ్ఛగా, న్యాయంగా జరిగేలా చేయడానికి చాలా సంస్కరణలు అవసరం.
8. తన భార్యను కట్నం విషయంలో చిత్రహింసలు పెట్టినందుకు చిన్నప్పకు శిక్ష విధించారు. సత్బీర్ అంటరానితనమును పాటించినందుకు నేరస్థుడైనాడు. న్యాయస్థానం వారిరువురిని ఎన్నికలలో పోటీ చేయడానికి అనుమతించలేదు. ఈ నిర్ణయము ప్రజాస్వామ్య ఎన్నికల సూత్రాలకు విరుద్ధంగా ఉందా?
9. ప్రపంచంలో వేర్వేరు ప్రదేశాలలో ఎన్నికలలో అనుచితప్రవర్తనలకు సంబంధించిన కొన్ని నివేదికలు కలవు. వారి మెరుగైన ఎన్నికల నిర్వహణకు మనదేశం నుంచి వారు నేర్చుకోవడానికి ఏమైనా ఉన్నదా? ప్రతి సందర్భంలోనూ నీవు ఏమి సూచిస్తావు?
ఎ. నైజీరియాలో ఓట్ల లెక్కింపు అధికారి ఒక అభ్యర్థి ఓట్లను ఉద్దేశపూర్వకంగా పెంచి అతను ఎన్నికైనట్లు ప్రకటించాడు.

AP SCERT

## అభ్యాసాలు

ఒక అభ్యర్థికి వచ్చిన 5లక్షల ఓట్లను మరొక అభ్యర్థికి అనుకూలంగా లెక్కించినట్లు కోర్టు తరువాత గుర్తించింది.

బి. ఫిజిలో ఎన్నికలకు కొన్ని రోజుల ముందు మాజీ ప్రధానమంత్రి మహేంద్ర చౌదరికి ఓటు వేస్తే రక్తపాతం జరుగుతుందని ఓటర్లను హెచ్చరిస్తూ ఒక కరపత్రాన్ని పంచారు. ఇది భారత సంతతికి చెందిన ఓటర్లకు ఒక బెదిరింపుగా ఉంది.

సి. అమెరికాలో ప్రతి రాష్ట్రము తనదైన ఓటు వేసే పద్ధతిని, తనదైన ఓట్ల లెక్కింపు పద్ధతిని, ఎన్నికలు నిర్వహించడానికి తన సొంత అధికార వ్యవస్థను కలిగి ఉంటుంది. 2000 సంవత్సరంలో అధ్యక్ష ఎన్నికల్లో బుష్‌కు అనుకూలంగా ఫ్లోరిడా రాష్ట్రంలోని అధికారులు చాలా వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. అయితే అలాంటి నిర్ణయాలను ఎవరూ మార్చలేరు.

10. భారతదేశంలో ఎన్నికల గురించి కొన్ని అనుచిత ప్రవర్తనలకు సంబంధించిన నివేదికలు ఇక్కడ ఉన్నాయి. ప్రతి సందర్భంలోనూ ఉన్న సమస్యను గుర్తించుము. పరిస్థితిని సరిచేయడానికి ఏమి చేయాలి?

ఎ. ఎన్నికల ప్రకటన చేసిన తర్వాత మూసివేసిన పంచదార మిల్లును తెరిపించడానికి ఆర్థిక సహాయం చేస్తానని మంత్రిగారు వాగ్దానం చేశారు.

బి. దూరదర్శన్ మరియు రేడియో కేంద్రాలలో తమ యొక్క ప్రకటనలు, ప్రచారానికి సరిగ్గా ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

సి. ఒక రాష్ట్రంలోని ఎన్నికల జాబితాలో 20 లక్షల నకిలీ ఓటర్ల పేర్లు ఉన్నట్లు భారత ఎన్నికల సంఘం నిర్వహించిన విచారణలో తేలింది.

డి. ఒక రాజకీయపార్టీ గూండాలు తుపాకులతో తిరుగుతూ ఇతర రాజకీయ పార్టీల మద్దతుదారులను, ఓటర్లను కలవనీయకుండా నిరోధిస్తూ, ఇతర పార్టీల బహిరంగ సభలపై దాడులు చేస్తున్నారు.

11. ఈ అధ్యాయము బోధించే సమయంలో రమేష్ తరగతి గదిలో లేడు. అతను మరుసటి రోజు వచ్చి తన తండ్రి ద్వారా ఏదైతే విన్నాడో దానిని చెబుతున్నాడు. ఈ క్రింది వాక్యాలలో ఏది తప్పుగా ఉన్నదో నీవు రమేష్‌తో చెప్పగలవా?

ఎ. స్త్రీలు ఎల్లప్పుడూ పురుషులు చెప్పిన విధంగానే ఓటు వేస్తారు. కావున వారికి ఓటుహక్కు ఇవ్వడంలో ఉన్న అర్థం ఏమిటి?

బి. పార్టీ రాజకీయాలు సమాజంలో ఉద్రిక్తతను సృష్టిస్తున్నాయి. ఎన్నికలు పోటీ ద్వారా కాకుండా ఏకాభిప్రాయం ద్వారా నిర్ణయించబడాలి.

సి. డిగ్రీ చదివిన వారు మాత్రమే ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయాలి.

---




మన దేశంలో ప్రతి సంవత్సరం సాధారణంగా ఏవో కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూ ఉంటాయి. ఈ సమయంలో జరిగే ఎన్నికలు గురించి సమాచారాన్ని సేకరించుము. సమాచారాన్ని సేకరించేటప్పుడు వాటిని మూడు భాగాలుగా విభజించుము.

- ఎన్నికల ముందు జరిగే ముఖ్యమైన సంఘటనలు– రాజకీయ పార్టీలు చర్చించే ప్రధాన ఎజెండా, ప్రజల డిమాండ్ల గురించిన సమాచారం, ఎన్నికల సంఘం యొక్క పాత్ర
- ఎన్నికలు జరిగే రోజు, ఓట్ల లెక్కింపు రోజున జరిగే ముఖ్య సంఘటనలు – ఎన్నికలలో ఓటింగ్ సరళి, అనుచిత ప్రవర్తనలకు సంబంధించిన నివేదికలు, తిరిగి పోలింగ్ నిర్వహించడం, ముందస్తు అంచనాలు మరియు చివరి ఫలితము.
- ఎన్నికల తరువాత:– ఎన్నికలలో గెలుపు ఓటములకు రాజకీయ పార్టీలు చెప్పే కారణాలు, మీడియా వారిచే ఎన్నికల తీర్పుపై విశ్లేషణ, ముఖ్యమంత్రి ఎంపిక

AP SCERT

## జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

భారతదేశ ప్రజలమైన మేము ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగి ఉండి మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛ, న్యాయమైన, శాంతియుతమైన ఎన్నికల యొక్క హుందాతనాన్ని కాపాడుతానని, ప్రతి ఎన్నికల్లోనూ ఎటువంటి భయం లేకుండా కులం, మతం, భాష, జాతి మరియు ఏ విధమైన ప్రలోభానికి లోను కాకుండా ఓటుహక్కును విని యోగించుకుంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

మీ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25న ఎలా నిర్వహించారు? నీవు జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞను చేశావా?




ఓటర్ల అక్షరాస్యత క్లబ్బు మీ పాఠశాలలో పని చేస్తుందా? ఓటర్లను క్రమపద్ధతిలో విద్యావంతులను చేయడానికి మరియు ఎన్నికల భాగస్వామ్యం గురించిన వివరాలు తెలుసుకోవడానికి భారత ఎన్నికల సంఘం యొక్క http://ecisveep.nic.in ను సందర్శించుము.




2016 లో 67వ గణతంత్ర వేడుకల సందర్భంగా న్యూఢిల్లీలోని రాజ్‌పథ్ గుండా ఎన్నికల సంఘము యొక్క శకటం కదులుతున్న దృశ్యం.